సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+16+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00
సంపుటి: 12
సంచిక: 347
SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL






# జై కిసాన్

**రైతును రాజు చేసేదాకా నిద్రపోం.. స్థిర సంకల్పంతో పనిచేస్తాం: సీఎం**

రైతుబంధు కొనసాగుతుంది.. 24 గంటల ఉచిత విద్యుత్‌ను ఆపేది లేదు

కొత్త రెవెన్యూ చట్టం తెస్తాం.. సీఏఏను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేస్తాం

ఎన్‌పీఆర్ బదులు నేషనల్ ఐడెంటిటీ కార్డు పెట్టాలి

రాష్ట్రంలో కరోనా లేదు.. దానిపై అసత్యాలు సరికాదు

ఒకవేళ వైరస్ వచ్చినా రూ. 1,000 కోట్లు పెట్టయినా అడ్డుకుంటాం

గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మాన చర్చలో సీఎం కేసీఆర్ సమాధానం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రతి రైతును రాజును చేసేదాకా నిద్రపోమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. అరుపులు, పెడబొబ్బలతో ఎవరు అడ్డుపడినా, అడ్డంకులు సృష్టించినా ఆగేది లేదని, స్థిర సంకల్పంతో పని చేస్తామన్నారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ అనంతరం సీఎం కేసీఆర్ సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో రైతుబంధు కొనసాగుతుందని, 24 గంటల ఉచిత విద్యుత్‌ను ఆపేది లేదన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తయ్యాయని, కాళేశ్వరం నీళ్లు వారం పది రోజుల్లో సిద్దిపేటకు రాబోతున్నాయన్నారు. కోదాడ వరకు కాకతీయ కాలువలో 120 రోజుల నుంచి నీళ్లు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో నీటి లభ్యత ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు వ్యవసాయ రంగాన్ని ఎంత నాశనం చేశారో ప్రజలకు తెలుసునన్నారు. వారి విధానాల వల్ల కరెంటు, నీటి సమస్యలు ఉన్నాయని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సన్నరకం సోనా వెరైటీని తయారు చేసిందని, అది షుగర్ ఫ్రీ వరి అని, మధుమేహ వ్యాధిగ్రస్తులు ఈ బియ్యాన్ని బేషుగ్గా తినవచ్చని వెల్లడించారు. దేశవ్యాప్తంగా సన్నబియ్యానికి అత్యధిక డిమాండ్ ఉందని, రాష్ట్రంలో రైతులు ఎక్కువగా సన్న రకమే పండించేలా రైతులను జూన్ నాటికి సిద్ధం చేస్తామన్నారు. వరి సాగు విస్తీర్ణం కోటి ఎకరాలైనా అందులో పండే పంటను సద్వినియోగపరిచేందుకు

మిగతా 4వ పేజీలో ▶



## నిరుద్యోగ భృతి లేదు

- ఈ ఏడాది ఇచ్చే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం లేదు
- 10 శాతం ఈబీసీ రిజర్వేషన్లు అమలు చేస్తాం
- రాష్ట్రంలో రిజర్వేషన్ల పెంపుపై కేంద్రంతో పోరు
- ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలతో కలసి ఢిల్లీలో ధర్నా చేస్తాం
- మండలిలో సీఎం కేసీఆర్ వెల్లడి

- వివరాలు 4లో

## ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం

**ఏపీ తరహాలో అమలుకు నిర్ణయం**

**మండలిలో సీఎం కేసీఆర్ ప్రకటన**

**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మాధ్యమం అమలుపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్ జగన్ సర్కారును అనుసరించనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో బోధన ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలిస్తామని సీఎం చంద్రశేఖరరావు చెప్పారు. శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శనివారం జరిగిన చర్చకు సీఎం కేసీఆర్ సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మీడియాన్ని ప్రవేశపెడుతూ తీసుకున్న నిర్ణయం పట్ల అక్కడి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇంగ్లిష్ మీడియంలో తన కొడుకును చదివించడానికి ప్రైవేట్ పాఠశాలకు పంపుతున్న విషయాన్ని ఓ మహిళా కూలీ చెప్పడాన్ని టీవీలో చూశానన్నారు. పోటీ ప్రపంచంలో

మిగతా 4వ పేజీలో ▶









## రూ. 1.58 లక్షల కోట్ల పద్దు!

- 2020–21 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రతిపాదనలుండే అవకాశం
- గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 8 శాతం వరకు పెరుగుదల
- మాంద్యం, కోవిడ్ ప్రభావమున్నా ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మెరుగ్గానే ఆదాయం
- జీఎస్‌డీపీ పెరుగుదల అంచనా మేరకు బడ్జెట్‌పై ప్రభుత్వం కసరత్తు
- గృహ నిర్మాణం, విద్య, వ్యవసాయం, వైద్యం, సాగునీటి రంగాలకు ప్రాధాన్యం
- రుణమాఫీ, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతికి నిధులు.. రైతు బీమాకు రూ. వెయ్యి కోట్లు

5లో



ఆమె ఒక తల్లి, కూతురు, సోదరి, భార్య..
వీటన్నింటికి మించి ఒక పోరాట యోధురాలు.
శక్తియుక్తులు కలిగిన నారీమణి.
అతని వెంట ఆమె కాదు.. అన్నింటా ఆమే.
అదే ఇప్పుడు ఆమె లక్ష్యం.

ఆవకాయ పెట్టడం నుంచి అంతరిక్షానికి చేరుకునే వరకు.. అగ్గిపెట్టెల తయారీ దగ్గర్నుంచి యుద్ధ విమానాలు నడిపే వరకు అన్నింటా ఆమె ఉనికి కనిపిస్తోంది.

ఆమె ఆకాశంలో సగం కాదు.. ఇప్పుడు ఆమే ఆకాశం..
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని భిన్న కథనాల సమాహారమే ఈ రోజు సండే స్పెషల్..

## 'ఆకాశంలో సగం' కాదు

# ఆమే ఆకాశం



## వన్‌పవర్ మెంట్

సోషల్ మీడియా స్టార్స్

## పౌరాణిక మణిదీపాలు



వీర ధీర భక్త శిరోమణులు

-ఫ్యామిలీలో









epaper.sakshi.com

# ప్రతిభకు పట్టం కడదాం

- సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ 6వ ఎడిషన్‌కు ఎంట్రీల ఆహ్వానం
- మార్చి 31 సాయంత్రం 6 గంటల వరకు గడువు




**సాక్షి, హైదరాబాద్:** ప్రతిభ ఏదైనా పట్టం కడదాం... రంగం ఏదైనా ప్రతిభే కొలమానం... ప్రతి సంవత్సరంలాగే ఈసారి కూడా 'సాక్షి'ఎక్సలెన్స్ అవార్డ్స్ 6వ ఎడిషన్‌కు ఎంట్రీలను ఆహ్వానిస్తోంది. త్యాగం, నైపుణ్యం, ప్రతిభ, కళ ఎక్కడ ఏ రూపంలో ఉన్నా వెలికితీస్తోంది. సమాజహితం కోరే ముఖ్యులతో ఏర్పాటైన 'జ్యూరీ'సాక్షికి లభించిన ఎంట్రీల నుంచి విజేతలను నిర్ణయించి ప్రకటిస్తోంది. ఈ ఏడాది 6వ ఎడిషన్ అవార్డుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. మార్చి 31వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఎంట్రీలను అందజేయవచ్చు. ఈసారి ఎంట్రీలను ఆన్‌లైన్‌లో కూడా అప్‌లోడ్ చేయవచ్చు. ప్రతిభను గుర్తెరిగిన ఇతరులెవరైనా ఆయా వ్యక్తులు, సంస్థల తరఫున కూడా ఎంట్రీలను పంపించవచ్చు. కొన్ని అంశాల్లో యువ తరానికి, ప్రవాస భారతీయులకు కూడా అవార్డులు ఉన్నాయి. సందర్భాన్ని బట్టి 'జ్యూరీ ప్రత్యేక ప్రశంస'కూడా లభించవచ్చు. నైపుణ్యాలను ప్రశంసించడం, సేవల్ని కొనియాడటం, సాధనను అభినందించడం ఎవరైనా చేయదగినదే. ఈ భావన కలిగిన వారంతా తమ ఎరుకలో ఉన్న ఇటువంటి ప్రతిభామూర్తుల్ని గుర్తించి వారి పేర్లను ప్రతిపాదిస్తూ అవార్డుల కోసం ఎంట్రీలను పంపుతారని 'సాక్షి'అభిలషిస్తోంది. సాక్షి చేస్తున్న ఈ కృషికి అందరూ చేయూతనివ్వండి. నామినేషన్‌ల ఎంట్రీలను నేరుగా అప్లికేషన్ ఫామ్‌లో ఇచ్చిన చిరునామాకు పంపించవచ్చు లేదా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు **www. sakshiexcellenceawards.com** వెబ్‌సైట్‌కు లాగిన్ కావచ్చు. పూర్తి వివరాల కోసం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు (వర్కింగ్ డేస్‌లో) 040–23322330 ఫోన్ నంబర్ లేదా **sakshiexcellenceawards2019@sakshi.com** ఈ–మెయిల్ ద్వారా సంప్రదించవచ్చు.

భారతి సిమెంట్



శనివారం కోవిడ్ వ్యాప్తి నివారించేందుకు వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్‌వోలతో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్

# వైద్య సిబ్బందికి సెలవులు రద్దు

- కోవిడ్ నేపథ్యంలో సర్కారు నిర్ణయం
- 10న 70 వేల మంది వైద్య సిబ్బందికి శిక్షణ
- జిల్లా వైద్య అధికారులతో మంత్రి సమీక్ష
- వైద్య సిబ్బందిని అభినందించిన సీఎం

**సాక్షి, హైదరాబాద్:** కోవిడ్ వైరస్ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా వైద్యులు, వైద్య సిబ్బంది సెలవులను ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు శనివారం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం కోవిడ్ వైరస్ వ్యాప్తి తీవ్రత కనిపిస్తుండటంతో వైద్య ఆరోగ్య శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. వైద్యుల కొరత ఎక్కువగా ఉండటం, వైద్య సిబ్బంది చాలా మంది విధులకు హాజరుకాకపోవడం వల్ల కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. డాక్టర్ల సమయపాలనపై కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సమయపాలన పాటించని వైద్యులు, వైద్య సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. అవసరమైతే అలాంటి వారిని సస్పెండ్ చేస్తామని హెచ్చరించింది. కోవిడ్‌పై 70 వేల మందికి క్షేత్రస్థాయిలో మరింత అవగాహన కల్పించేందుకు ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు, పీహెచ్‌సీ వైద్యులందరికీ శిక్షణ ఇవ్వనున్నారు. వారికి ఈ నెల 10న టీ శాట్స్ ద్వారా ఒకేసారి అవగాహన కల్పించనున్నారు.

### గాంధీ ఆసుపత్రిలో మార్పులు చేర్పులు

గాంధీ ఆస్పత్రిలో కోవిడ్ చికిత్స అందిస్తున్న ఏడో అంతస్తులోకి ఎవరూ వెళ్లకుండా అన్ని ద్వారాలు మూసేయాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది. విదేశాలకు వెళ్లి వచ్చిన లేదా వారితో కలిసి ఉండి జ్వరం, జలుబు, దగ్గు లక్షణాలున్న వారికి ఓ చోట, విదేశాలకు వెళ్లి వచ్చి కోవిడ్ లక్షణాలు లేని వారిని మరో వార్డులో ఉంచాలని ఆదేశాలు జారీ చేసింది. గాంధీ ఆసుపత్రికి వస్తున్న వారికి వైరస్ సోకకుండా అనుసరించాల్సిన ప్రొటోకాల్‌ను పాటించాలని, ఆ మేరకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖకు సర్కారు సూచించింది.

### అభినందించిన సీఎం కేసీఆర్..

కోవిడ్ వైరస్‌పై గత కొద్ది రోజులుగా నిర్విరామంగా పనిచేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను సీఎం కేసీఆర్ అభినందించినట్లు సమాచారం. వైరస్ వ్యాప్తి చెందకుండా తగు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించడంతో వైద్య ఆరోగ్య శాఖ సఫలీకృతం అయినట్లు వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ కూడా బాగా పనిచేసిందని సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

### డీఎంహెచ్‌వోలతో ఈటల వీడియో కాన్ఫరెన్స్..

కోవిడ్ వైరస్ వ్యాప్తిని నివారించేందుకు చేపట్టాల్సిన చర్యలపై మంత్రి ఈటల రాజేందర్ శనివారం అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలతో సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విదేశాల నుంచి వచ్చే ప్రతి ఒక్కరి డేటాను సేకరించాలని, వారిని ట్రాక్ చేయాలని మంత్రి ఆదేశించారు. కరీంనగర్‌కు గ్రానైట్ వ్యాపారం కోసం వచ్చిన చైనా, ఉజ్బెకిస్తాన్ దేశీయులను గుర్తించి క్వారంటైన్‌లో ఉంచినట్లు అక్కడి జిల్లా వైద్యాధికారి మంత్రికి తెలిపారు. కోవిడ్‌పై ప్రజల్లో నెలకొన్న భయాన్ని పోగొట్టేందుకు గ్రామ కార్యదర్శి స్థాయి నుంచి ఆశ వర్కర్ వరకు అందరూ పనిచేయాలని మంత్రి సూచించారు. దీనికి జిల్లాల్లో జిల్లా వైద్యాధికారులే బాధ్యత వహించాలన్నారు. వైరస్ కేసులు నమోదు కాలేదు కాబట్టి రిలాక్స్ అవుతామన్న భావన రావొద్దన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. కేంద్రం నుంచి వచ్చిన ఎన్‌సీడీసీ ప్రతినిధులు కూడా మంత్రితో సమావేశమై పలు అంశాలను చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఏర్పాట్లపై కేంద్ర బృందం సంతృప్తి వ్యక్తం చేసింది.

# 'భగీరథ'కు భరోసా!

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పరిధిలోని రిజర్వాయర్లు, బ్యారేజీల్లో మిషన్ భగీరథకు అవసరమయ్యే తాగునీటిని పక్కనపెట్టాకే మిగతా అవసరాలకు వినియోగించాలని సాగునీటి శాఖ నిర్ణయించింది. ప్రాజెక్టుల నుంచి తాగునీటికి 10 శాతం నీరు తీసుకోవాలని ప్రభుత్వం ఇదివరకే నిర్ణయించింది. మిషన్ భగీరథ కింద తాగునీటి అవసరాలకు ఏటా 60 టీఎంసీల నీటి అవసరాలను అధికారులు గుర్తించి, కృష్ణాబేసిన్‌లోని 15, గోదావరి బేసిన్‌లోని 21 రిజర్వాయర్ల పరిధిలో తాగునీటిని తీసుకునేలా కనీస నీటిమట్టాలను నిర్ధారించారు. సింగూరు ప్రాజెక్టులో కనీస నీటిమట్టాన్ని 520.50 మీటర్లుగా నిర్ధారించారు. ఈ కనీస నీటిమట్టాన్ని నిర్వహిస్తేనే భగీరథ అవసరాలకు 5.70 టీఎంసీల నీటిని తీసుకోవచ్చు. అలాగే ఎల్లంపల్లి కనీస నీటిమట్టాన్ని 146.40గా నిర్ణయించారు. ఈ నీటిమట్టాన్ని నిర్వహిస్తేనే 2.82 టీఎంసీలను తాగునీటికి తీసుకునే అవకాశముంది. ఇలా అన్ని రిజర్వాయర్ల పరిధిలో కనీస నీటిమట్టాలపై ఇదివరకే అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. అయితే చాలా ప్రాజెక్టుల కింద సాగునీటి అవసరాలకు నీటి సరఫరా జరుగుతోంది. ఈ దృష్ట్యా తాగునీటికి లోటు రాకుండా నెలవారీగా, జూలై వరకు ఏ ప్రాజెక్టుల కింద, ఎంత నీరు రావాలోతెలుపుతూమిషన్‌భగీరథ ఇంజనీర్లు సాగునీటి శాఖకు వివరాలు సమర్పించారు. దీని ప్రకారం గోదావరి, కృష్ణా బేసిన్‌లోని 36 ప్రధాన రిజర్వాయర్లలో జూలై నెలాఖరు వరకు తాగునీటికి 30 టీఎంసీలు అవసరమని వెల్లడించారు. అయితే చాలా ప్రాజెక్టుల్లో కావాల్సినంత నీటి లభ్యత ఉన్నా, సింగూరు, నిజాంసాగర్‌లలో పరిస్థితి అనుకూలంగా లేదు. దీంతో ఈ ప్రాజెక్టుల్లో 18 నెలల అవసరాలకు సరిపడేంత తాగునీటిని పక్కనపెట్టాకే మిగతా నీటిని మళ్లించాలని, ఒక సీజన్‌లో సమృద్ధిగా వర్షాలు కురవకున్నా, మరో సీజన్ ఆరంభమయ్యే వరకు తాగునీటి నిల్వలు కాపాడుకునేలా చర్యలు తీసుకోవాలని సాగునీటి శాఖ నిర్ణయించింది.




# ఆ సమయంలో బస్సులనెలా నడిపారు..?

**కేరళలో అధ్యయనానికి ఆర్టీసీ అధికారి**

**సాక్షి, హైదరాబాద్:** మూడు కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదైన సమయంలోనూ కేరళలో ఆర్టీసీ బస్సులను ఎలా నడిపారో అధ్యయనం చేసేందుకు ఆర్టీసీ ఈడీ యాదగిరి కేరళ వెళ్లారు. కోవిడ్ కేసులను విజయవంతంగా ఎదుర్కొని అభినందనలు అందుకుంటున్న కేరళ ప్రభుత్వం వ్యవహరించిన తీరును తెలుసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం 12 మంది వివిధ విభాగాల అధికారులను కేరళకు పంపింది. అందులో ఆర్టీసీ ఈడీ యాదగిరి కూడా ఉన్నారు. ఒకేసారి ముగ్గురు వ్యక్తులు కోవిడ్ బారిన పడి ఆసుపత్రిలో చేరటంతో అటు జనం ఆందోళనకు గురికాకుండా, ఇటు బాధితులు త్వరగా కోలుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం గాంధీ ఆసుపత్రిలో హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కోవిడ్‌కు చికిత్స తీసుకుంటున్న నేపథ్యంలో.. యావత్తు సిటీ ఆందోళనలో ఉంది. మరికొందరు అనుమానిత లక్షణాలతో ఆసుపత్రిలో చేరటం, వారి నమూనాలను వైద్యులు పుణెకు పంపటం.. తదితర పరిణామాలతో జనం ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో వ్యవహరించాల్సిన తీరుపై అధికారులు అధ్యయనం చేస్తున్నారు. ఆర్టీసీ బస్సుల నిర్వహణలో అనుసరించిన తీరును యాదగిరి పరిశీలిస్తున్నారు.

## గవర్నర్ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు



**సాక్షి, హైదరాబాద్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర మహిళలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుభాకాంక్షలు తెలియజేశారు. జాతీయ సమగ్రత, శాంతి సామరస్యాలను పరిరక్షించడంలో, దేశ నిర్మాణంలో మహిళలు గొప్ప పాత్ర పోషించి, సమాజానికి ప్రేరణగా ఉన్నారన్నారు. కుటుంబ సంప్రదాయాల పరిరక్షణతోపాటు దేశ నిర్మాణంలో మహిళలు నిస్సందేహంగా కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. సహనశక్తిలో అధిక బాధ్యతలను మోయగలగడం మహిళలకు దేవుడిచ్చిన వరమని తెలిపారు.

## తెలంగాణ భవన్‌లో మహిళా దినోత్సవం

**సాక్షి, హైదరాబాద్:** ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా టీఆర్‌ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం సంబురాలు నిర్వహించారు. మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎంపీ గుండు సుధారాణి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ మాలోత్ కవిత, జెడ్పీ చైర్‌పర్సన్‌లు దీపిక, సరిత, అనితారెడ్డి, విజయ, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, పలువురు మహిళా కార్పొరేటర్లను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం నాయకురాళ్లు మూల విజయారెడ్డి, సుశీలారెడ్డి, బొంతు శ్రీదేవి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## షీటీమ్‌లు దేశానికే ఆదర్శం: బాలమల్లు

**సాక్షి, హైదరాబాద్:** మహిళలపై జరిగే నేరాలను అరికట్టడంలో షీటీమ్‌లు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని టీఎస్‌ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని పరిశ్రమల భవన్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆర్థిక స్వావలంబన, రిజర్వేషన్లు, ప్రభుత్వం చేపడుతున్న మహిళా సాధికారత కార్యక్రమాల ద్వారా మహిళలు వివిధ రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. మహిళల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. టీఎస్‌ఐఐసీలో 50 శాతం మంది మహిళా ఉద్యోగులు ఉన్నారని, పరిశ్రమల ఏర్పాటులో మహిళా పారిశ్రామికవేత్తలకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని బాలమల్లు ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు మహిళా ఉద్యోగులను ఆయన సన్మానించారు. సమావేశంలో టీఎస్‌ఐఐసీ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, సీఈవో మధుసూదన్, చీఫ్ ఇంజనీర్ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు లింగ సమానత్వంపై సమావేశం

**సాక్షి, హైదరాబాద్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'లింగ సమానత్వం'అనే అంశంపై సమావేశం నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు ఇందిరాభవన్‌లో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో వివిధ రంగాల ప్రముఖులు పాల్గొని ప్రసంగిస్తారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

## నిమ్స్‌లో సేవలపై నిజాం మనవడి ఆరా

### నిమ్స్ ఆస్పత్రిని సందర్శించిన ముఫఖంజా

**హైదరాబాద్:** నిమ్స్‌లో నిరుపేదలకు అందుతున్న వైద్య సేవలపై నిజాం ఉస్మాన్ ఆలీఖాన్ మనవడు ప్రిన్స్ ముఫఖంజా ఆరా తీశారు. శనివారం ఆయన తన సన్నిహితులతో కలసి నిమ్స్ ఆసుపత్రిని సందర్శించారు. ఆస్పత్రిలోని నెఫ్రాలజీ, ఆంకాలజీ, ఆరోగ్యశ్రీ తదితర విభాగాలను పరిశీలించారు. అక్కడ రోగులకు అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. తొలుత ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ కె.మనోహర్‌తో సమావేశమయ్యారు. ఆసుపత్రిలోని వైద్యుల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ పాల్గొన్నారు. ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశం తీసుకున్న నిర్ణయాలు ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం.

# బాబోయ్ హైదరాబాద్

సాక్షి, హైదరాబాద్

**న**గరం నుంచి బీదర్‌కు ఆర్టీసీ రోజూ 50 బస్సులను తిప్పుతోంది. వీటి ఆక్యుపెన్సీ రేషియో 80కి పైమాటే. కానీ రెండ్రోజులుగా ఈ బస్సుల్లో ఒక్కోదానిలోనూ ఐదారుగురికి మించి ఉండటం లేదు. ఫలితంగా బస్సులు ఖాళీగా తిప్పాల్సిన పరిస్థితి..

నగర మార్కెట్లలో కర్నూలుకు చెందిన ఉల్లి, బియ్యం వ్యాపారుల వాటా పెద్దదే. అందుకే నిత్యం కర్నూలు నుంచి నగరానికి వీరి రాకపోకలు ఎక్కువ.. కానీ నాలుగు రోజులుగా రెండు ప్రాంతాల మధ్య తిరిగే బస్సులు బోసిపోయాయి.

ఈ పరిస్థితుల్లో నాలుగు రోజులుగా ఆర్టీసీ రోజువారీ నష్టం రూ.కోటికి చేరుకుందని అధికారులు చెబుతున్నారు.

### ఆర్టీసీకి కోవిడ్ ఎఫెక్ట్

- రాజధానికి రావాలంటే బెంబేలెత్తుతున్న పొరుగు రాష్ట్రవాసులు
- బీదర్, యాద్గిర్, ఉద్గీర్ మధ్య బస్సుల్లో ప్రయాణికులు అంతంతే
- రాష్ట్రంలోని ఇతర పట్టణాల బస్సులదీ అదే పరిస్థితి
- ఆర్టీసీకి నిత్యం కోటి రూపాయల వరకు నష్టం

### కోవిడ్ ప్రభావంతో..

మినీ భారత్‌గా వెలుగొందే భాగ్యనగర వీధులు నిత్యం పొరుగు రాష్ట్రాల వారితో కిటకిటలాడుతుండేవి. అన్ని ప్రాంతాల వారు ఇక్కడ స్థిరపడ్డారు. వారితో సంబంధ బాంధవ్యాలున్న వారి రాకపోకలు ఎక్కువ. దీనికి తోడు నగరంలో జరిగే వ్యాపార లావాదేవీల్లో ఇతర రాష్ట్రాల వారి హవా కూడా ఎక్కువే. ఫలితంగా కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని సరిహద్దు పట్టణాలవారు నిత్యం పెద్దసంఖ్యలో హైదరాబాద్‌కు వస్తుంటారు. ఇక ఆంధ్రప్రదేశ్‌తో నగరానికి ఉన్న సంబంధాలు అసాధారణం. ఇక్కడికి వైద్య సేవల కోసం వచ్చే వారి సంఖ్యా ఎక్కువే. ఈ క్రమంలో నిత్యం దాదాపు లక్షమంది కంటే ఎక్కువే వచ్చి వెళ్తుంటారు. కానీ, నాలుగు రోజులుగా తీరు మారింది. కోవిడ్ వైరస్ నేపథ్యంలో హైదరాబాద్ అంటేనే బయటి ప్రాంతాల వారు హడలిపోతున్నారు. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంతో మరింత బెంబేలెత్తుతున్నారు. కొంతకాలం సిటీకి దూరంగా ఉండటమే మంచిదన్న భావనతో చాలామంది రాకపోకలు తగ్గించుకున్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సుల్లో వచ్చే ప్రయాణికులు బాగా తగ్గిపోయారు. ఇటు తెలంగాణ ఆర్టీసీ, అటు ఆయా రాష్ట్రాల రవాణా సంస్థల బస్సులు ఖాళీగా కనిపిస్తున్నాయి. కొన్ని సర్వీసులు రెండువైపులా రద్దయ్యాయి. వ్యక్తిగత వాహనాల్లో వచ్చే వారి సంఖ్య కూడా మూడొంతులు తగ్గిందని, రైళ్లలో ప్రయాణాలు మాత్రం అంతగా తగ్గలేదని అధికారులు అంటున్నారు.



ప్రయాణికులు లేక వెలవెలబోతున్న వనపర్తి నుంచి హైదరాబాద్ వస్తున్న ఆర్టీసీ బస్సు

### షిర్డీ బస్సులో ఇద్దరే..

కర్ణాటకలోని యాద్గిర్, రాయచూర్, బీదర్ నుంచి రోజూ 250 బస్సులు తిరుగుతున్నాయి. వీటిల్లో ప్రస్తుతం ఆక్యుపెన్సీ రేషియో 40 శాతం మించట్లేదు. దీంతో సగం బస్సులు తిప్పలేని దుస్థితి.. అలాగే మహారాష్ట్రలోని ఉద్గీర్, ఛత్తీస్‌గఢ్‌లోని కొన్ని పట్టణాలతోపాటు ముంబై, షిర్డీకి కూడా నిత్యం బస్సులు తిరుగుతున్నాయి. కాగా, బీదర్, యాద్గిర్, రాయచూర్ బస్సు సర్వీసులు క్రమంగా నిలిచిపోతున్నాయి. గాంధీ ఆసుపత్రిలో అనుమానిత లక్షణాలతో ఇద్దరు చేరారన్న వార్తలు వచ్చిన తర్వాత పరిస్థితి మరీ క్షీణించింది. దీంతో చాలామంది సిటీలో పనులను వాయిదా వేసుకోగా, వైద్య సేవల కోసం బెంగళూరుకు వెళ్తున్నారు. ఇక శుక్రవారం రాత్రి నగరం నుంచి షిర్డీ వెళ్లాల్సిన ఆర్టీసీ ఏసీ బస్సులో ఇద్దరు ప్రయాణికులే ఉండటంతో సర్వీసును రద్దు చేశారు. ఏకంగా 24 అడ్వాన్సు బుకింగ్స్ రద్దయ్యాయి. శుక్ర, శనివారాల్లో మహారాష్ట్రలోని ఉద్గిర్ నుంచి రావాల్సిన సర్వీసులు కొన్ని ఆగిపోయాయి. నగరం నుంచి తిరుగు ప్రయాణమయ్యే వారి సంఖ్య పలచగా ఉండటంతో ఇక్కడి నుంచి కూడా సర్వీసులను తగ్గించారు.

### కర్నూలు వ్యాపారులేరీ?

నగర మార్కెట్లకు కర్నూలు నుంచి నిత్యం వందల సంఖ్యలో బియ్యం లారీలు వస్తాయి. మూడు రోజులుగా వాటి సంఖ్య తగ్గిపోతోంది. అలాగే ఉల్లిపాయల లోడ్లు కూడా తగ్గాయి. విజయవాడ, గుంటూరు నుంచి రాకపోకలు సాగించే వారి సంఖ్య కూడా పడిపోయిందని, అటువైపు వెళ్లే సర్వీసులను తగ్గించుకుంటున్నామని ఆర్టీసీ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. బెంగళూరు బస్సుల్లో ఐదారుగురికి మించి ఉండటం లేదు. పొరుగు రాష్ట్రాలకే కాక తెలంగాణలోని ఇతర పట్టణాలకు వెళ్లే బస్సుల్లోనూ ప్రయాణికుల సంఖ్య పలచబడింది. ఫలితంగా ఆర్టీసీ ఆక్యుపెన్సీ రేషియో కొన్ని సర్వీసుల్లో 40 శాతానికి పైగా పడిపోయింది. సగటున 20 శాతం వరకు తగ్గిందని అధికారులు అంటున్నారు. రైళ్లలో మాత్రం 2 నుంచి 3 శాతం మేర ప్రయాణికుల సంఖ్య తగ్గినట్టు అంకెలు చెబుతున్నాయని రైల్వే అధికారి ఒకరు తెలిపారు.

# ఏ2 మద్దిలేటిని కస్టడీకి ఇవ్వండి

- హైకోర్టులో ఎన్‌ఐఏ బృందం పిటిషన్
- మావోయిస్టు సానుభూతిపరుల వివరాల కోసం అన్వేషణ

**గద్వాల క్రైం:** నిషేధిత మావోయిస్టు పార్టీతో సంబంధాలు కలిగి ఉన్నారన్న కేసులో అరెస్టయిన వారిలో ఏ2 (టీవీవీ రాష్ట్ర అధ్యక్షుడు మద్దిలేటి)ని తమ కస్టడీకి ఇవ్వాలంటూ జాతీయ విచారణ ఏజెన్సీ (ఎన్‌ఐఏ) బృందం శనివారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కాగా, 2019 అక్టోబర్ 5న మల్దకల్ మండలం ఎల్కూరుకు చెందిన నాగరాజు అలియాస్ నాగన్న (ఏ1), నారాయణపేట జిల్లా మక్తల్ వాసి బండారి మద్దిలేటి (ఏ2), వనపర్తి జిల్లా పెబ్బేరుకు చెందిన వైనమోని బలరాం (ఏ3), జనగామ జిల్లా బాచన్నపేట్ వాసి జగన్ (ఏ4), మేడ్చల్ జిల్లా చాకిరిపురానికి చెందిన చుక్క శిల్ప (ఏ5), జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలం పార్చర్ల వాసి గుంత రేణుక (ఏ6), హైదరాబాద్‌కు చెందిన మెంచు రమేశ్ (ఏ7), నలమాస కృష్ణ (ఏ8)ను గద్వాల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరంతా సంఘ విద్రోహ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు రహస్య సమావేశాలు ఏర్పాటు చేసుకుని యువతను నిషేధిత కార్యక్రమాల వైపు ప్రేరేపిస్తున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. దీంతో అప్పట్లో పలు నివాస గృహాల్లో సోదాలు నిర్వహించి విప్లవ సాహిత్యం, వివిధ లేఖలు, కీలక డాక్యుమెంట్లు, కంప్యూటర్, పెన్‌డ్రైవ్‌లను స్వాధీనం చేసుకున్నారు. తాజాగా టీవీవీ రాష్ట్ర అధ్యక్షుడు మద్దిలేటి (ఏ2)ని తమ కస్టడీకి ఇవ్వాలంటూ హైకోర్టులో ఎన్‌ఐఏ బృదం పిటిషన్ వేయడంతో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మాజీ మవోయిస్టుల ఇళ్లలో తనిఖీ చేసిన సమయంలో లభించిన ఆధారాలను బట్టి ఆయనకు మావోయిస్టులతో సంబంధాలు ఉన్నట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించి ఎంత మంది ఉన్నారనే కోణంలో విచారణ చేసే అవకాశం ఉంది. ఎన్‌ఐఏకు అనుమతి ఇవ్వొద్దంటూ నిందితుడి కుటుంబసభ్యులు హైకోర్టును ఆశ్రయించారు.




సామ్‌సంగ్ గెలాక్సీ ఎస్-20 సిరీస్ ఫోన్లను బిగ్‌సీ షోరూమ్‌లలో అందుబాటులోకి తెచ్చినట్లు బిగ్‌సీ ఫౌండర్, ఎండీ ఎం.బాలు చౌదరి తెలిపారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని బిగ్‌సీ షోరూంలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రముఖ సినీనటి పూజా హెగ్డే గెలాక్సీ ఎస్-20 ఫోన్లను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా బిగ్‌సీ ఎండీ బాలు చౌదరి మాట్లాడుతూ.. బిగ్‌సీ ద్వారా మార్కెట్‌లోకి ప్రవేశిస్తే తమ ఉత్పత్తులు అమ్మకాల్లో దూసుకుపోతాయనే విశ్వాసంతోనే కంపెనీలు బిగ్‌సీని ఎంచుకుంటాయన్నారు. కార్యక్రమంలో బిగ్‌సీ డైరెక్టర్లు వై.స్వప్నకుమార్, బాలాజీరెడ్డి, ఆర్.గౌతమ్‌రెడ్డి, సామ్‌సంగ్ ప్రతినిధులు శశికిరణ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# 'మార్క్‌ఫెడ్' ఏకగ్రీవం

- నామినేషన్లు ఒక్కోటి రావడంతో ఏకగ్రీవం
- ఏడు పదవుల్లో ఆరింటికే నామినేషన్లు
- ఈ నెల 11న చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక

**సాక్షి, హైదరాబాద్:** మార్క్‌ఫెడ్ డైరెక్టర్ల పదవులు ఏకగ్రీవమయ్యాయి. శనివారం నామినేషన్లు సమర్పించాల్సి ఉండగా, ఒక్కో డైరెక్టర్ పదవికి ఒకరే నామినేషన్ వేయడంతో వారిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సహకార ఎన్నికల అథారిటీ ప్రకటించింది. మొత్తం ఏడు డైరెక్టర్ పదవులకుగాను, ఆరింటికి ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలయ్యాయి. దీంతో ఆరు డైరెక్టర్ పదవులను ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. రేకుల గంగాచరణ్, ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, బొర్రా రాజశేఖర్, మర్రి రంగారావు, మారగంగారెడ్డి, ఎన్.విజయ్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

### ఏకగ్రీవాలతో తప్పిన ఎన్నికల నిర్వహణ

డైరెక్టర్ పదవులు ఏకగ్రీవం కావడంతో ఆ రోజు ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం లేకుండా పోయింది. ఒకవేళ ఒక్కో డైరెక్టర్ పదవికి రెండు అంతకుమించి నామినేషన్లు దాఖలైనట్లయితే, ఈ నెల పదో తేదీన ఎన్నికలు నిర్వహించేవారు. ఏకగ్రీవంగా ఎన్నికైన డైరెక్టర్లు ఈ నెల 11న చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. వారి మధ్య పోటీ నెలకొంటే ఎన్నిక నిర్వహిస్తారు. లేకుంటే ఆ రెండు పదవులు కూడా ఏకగ్రీవమయ్యే అవకాశముంది. ఒక డైరెక్టర్ పదవికి ఒకరు నామినేషన్ వేయడానికి మార్క్‌ఫెడ్‌కు రావడంతో ఘర్షణ నెలకొందని, దీంతో అతను నామినేషన్ వేయకుండానే వెళ్లినట్లు కొంతమంది చెబుతున్నారు. తమ ప్రాంగణంలో ఎటువంటి ఘర్షణ, గొడవలు జరగలేదని ఎన్నికల అధికారులు తెలిపారు.

ఇదం జగత్



ఇటువైపు కూడా చెత్త ఉంది
కాస్త చూడు.. హ్యాపీ ఉమెన్స్ డే డియర్!

## ఒక్కరోజు కలెక్టరమ్మ

ఉద్యోగం కావాలంటే అనుభవం ఉందా అని అడుగుతారు. ఎవరైనా అవకాశం ఇస్తే కదా అనుభవం వచ్చేది.. ప్రతిభ బయటకొచ్చేది..! ఈసారి మహిళాదినోత్సవం సందర్భంగా మహారాష్ట్ర బుల్ధానా జిల్లా యంత్రాంగం అమ్మాయిలకి అలాంటి అవకాశం వచ్చేలా వినూత్న ఆలోచన చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే మెరికల్లాంటి అమ్మాయిలను ఎంపికచేసి వారికి ఒక్కరోజు కలెక్టర్ బాధ్యతలు అప్పగిస్తారు. జిల్లాలో నెలకొన్న సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాలు సరైన లబ్ధిదారులకు చేరేలా చర్యలు, జిల్లా అభివృద్ధికి రచించాల్సిన ప్రణాళికలు వంటివి ఒక్కరోజు ఆ కలెక్టర్ పదవిలో ఉండే అమ్మాయి ప్రభుత్వానికి వివరించే మహత్తర అవకాశం వస్తుంది. ఇదంతా చదవుతుంటే ఒక్కరోజు సీఎం పదవిపై వచ్చిన సినిమా గుర్తుకు వస్తోందా? అది సినిమా కాబట్టి ఓకే. కానీ రియల్‌లైఫ్‌లో అది సాధ్యమేనా అనుకోవద్దు. మహిళలు తలచుకుంటే ఏదైనా సాధ్యమే. ఆ 24 గంటల సమయంలోనే ఎన్నో చేయొచ్చు. సమాజాన్ని మార్చే వినూత్న ఆలోచన మెదడులో పుట్టడానికి క్షణం చాలు. దానిని అమలుచేసే అవకాశం రావడమే అరుదు. అలాంటి అరుదైన అవకాశం బుల్ధానా అమ్మాయిల్లో ఒకరికి వస్తోంది. ఇలా ఒక్కరోజు ఆ కుర్చీలో కూర్చుంటే అమ్మాయిల్లో ఆత్మవిశ్వాసం పెరగడమే కాదు, ఇంకా బాగా పని చేయాలన్న ప్రేరణ కూడా వస్తుంది. ప్రభుత్వ యంత్రాంగం ఎలా పనిచేస్తుందో సామాజిక, ఇతర అంశాలను ఎలా ఎదుర్కోవాలో ప్రాక్టికల్‌గా తెలిస్తే, ఐఏఎస్ కావాలన్న స్ఫూర్తి కూడా వారిలో రగులుతుందని బుల్ధానా కలెక్టర్ సుమన్‌చంద్ర అభిప్రాయపడ్డారు.



## కరోనా సరే.. చైనాలో మరో పోరు

జుట్టు ఆడవారికి అందాన్నిస్తుంది. వారిని ఆకర్షణీయంగా మారుస్తుంది. జుట్టుని తీయడమంటే ఒకరకంగా మహిళల్ని అవమానించడమే. కానీ ముంచుకొచ్చింది మామూలు ముప్పు కాదు. కరడుగట్టిన కరోనా. అందులోనూ పెద్ద జుట్టు ఉంటే వైరస్ ఎక్కడ వ్యాపిస్తుందోనని చైనాలో అధికారులు కరోనా వ్యాధిగ్రస్తులకి సేవచేసే మహిళా నర్సులకి జుట్టు కట్ చేస్తున్నారు. అంతేకాదు వారు నిరంతరం సేవలు అందించడం కోసం పీరియడ్స్ రాకుండా పిల్స్ ఇస్తున్నారు. ఇదంతా మహిళలపై చూపిస్తున్న వివక్షేనంటూ అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేళ చైనా ఉమెన్ ఫెడరేషన్ పోరుబాట పట్టింది. కరోనా వ్యాధిగ్రస్తులకు సేవ చేయడానికి ధరించే ఐసోలేషన్ సూట్ ధరించడమే ఇబ్బంది అనుకుంటే.. రేయింబవళ్లు పని చేయిస్తున్నారు. ఆసుపత్రిలో ఉన్నవారి అవసరాలన్నీ అంచనా వేసిన చైనా ప్రభుత్వం అన్నీ అందించింది కానీ మహిళలకి శానిటరీ ప్యాడ్స్ సరఫరా చేయలేకపోయింది. దీంతో నెలసరి వచ్చినప్పుడు మహిళా సిబ్బంది ఎన్నో పాట్లుపడ్డారు. దీనికి విరుగుడుగా నెలసరి వాయిదా వేయడానికి 200 బాటిల్స్ పిల్స్ అధికారులు సరఫరా చేశారు. సహజసిద్ధంగా వచ్చే పీరియడ్స్‌ని ఆపేస్తే హార్మోన్లపై ప్రభావం చూపిస్తుందంటూ మహిళా నర్సులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చైనాలో స్వదేశీయంగా వాడే ట్విట్టర్ తరహా సామాజిక మాధ్యమమైన వైబోలో మహిళలు ఎదుర్కొంటున్న కష్టాలు వైరల్‌గా మారాయి. కరోనాపై పోరాటానికి సమాంతరంగా ఇప్పుడు మరో పోరాటం జరుగుతోంది. అవును మరి అక్కడ నర్సుల్ని కమాండ్ చేస్తున్న వారంతా మగవారే. వాళ్లకి ఆడవాళ్ల కష్టాలెలా అర్థమవుతాయి?.

### మీడియా పాయింట్

## కేటీఆర్ లీజుకు తీసుకున్నారు: తలసాని



సాక్షి, హైదరాబాద్: 'మంత్రి కేటీఆర్ ఫామ్ హౌస్‌ను సొంతంగా నిర్మించుకోలేదు. వేరే వాళ్లు కట్టుకున్న దాన్ని ఆయన లీజుకు తీసుకున్నారు. ఇదే విషయాన్ని ఎన్నికల అఫిడవిట్‌లోనూ పొందుపరిచారు. గతంలో మాదిరిగా ఏది పడితే అది మాట్లాడితే ప్రజలు స్వాగతించడం లేదని రేవంత్‌రెడ్డి ఉదంతం ద్వారా అర్థమవుతోంది' అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శనివారం మీడియా లాంజ్‌లో పిచ్చాపాటీగా మాట్లాడారు. జీఓ 111ను ఉల్లంఘించి నిర్మించిన ఫామ్‌హౌస్‌ను కేటీఆర్ లీజుకు తీసుకోవడాన్ని విలేకరులు ప్రస్తావించగా 'జీఓ 111ను రద్దు చేయాలనే డిమాండు ఎప్పటి నుంచో ఉంది. ఆ జీఓను పెంచి పోషించింది టీడీపీ, కాంగ్రెస్ పార్టీలే' అని తలసాని వ్యాఖ్యానించారు.

## వేటు తప్పదేమో: జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై వేటు తప్పదేమోనని మంత్రి జగదీశ్ రెడ్డి నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. శనివారం అసెంబ్లీ వాయిదా పడిన అనంతరం తనకు ఎదురమైన మీడియా ప్రతినిధులతో సంభాషించారు. రాజగోపాల్‌రెడ్డిపై వేటు పడితే మునుగోడు ఉప ఎన్నిక జరుగుతుందని, అదే జరిగితే టీఆర్‌ఎస్ పార్టీ పక్కాగా గెలుస్తుందన్నారు. సభలో బలమైన విపక్షం లేదని మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా 'కాంగ్రెస్ ఎమ్మెల్యేలను వద్దన్నా మా పార్టీలోకి వచ్చారు. ఎవరైనా వస్తామంటే వద్దంటామా' అని జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు.

## కాంగ్రెస్‌వి అసత్య ఆరోపణలు: కర్నె



సాక్షి, హైదరాబాద్: రేవంత్‌రెడ్డి విషయంలో కాంగ్రెస్ నేతలు గులాం నబీ ఆజాద్, ఆర్సీ కుంతియాలు ప్రభుత్వం, పోలీసులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ మండిపడ్డారు. గోపన్‌పల్లి భూ ఆక్రమణలు కప్పిపుచ్చుకోవడానికే రేవంత్‌రెడ్డి కావాలనే అరెస్టయి జైలుకు వెళ్లాడన్నారు. ఎలాంటి పర్మిషన్ తీసుకోకుండా డ్రోన్‌లను ఎగిరేయడం చట్టవిరుద్ధమని, చట్టాలు తెలిసిన వారు కూడా పాటించడం లేదని పేర్కొన్నారు.

## ప్రతిపక్షాల తీరు శోచనీయం: గువ్వల



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై ప్రతిపక్షాలు వ్యవహరించిన తీరు శోచనీయమని, ప్రతిపక్షాలు పసలేని పక్షాలుగా తయారయ్యాయని టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు విమర్శించారు. ప్రతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఓడిస్తున్నప్పటికీ కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ప్రభుత్వంపై ఎలా విమర్శలు చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. మిషన్ భగీరథపై రాజగోపాల్ చేసిన వ్యాఖ్యలని ఖండిస్తున్నానన్నారు. సభలో ఒక నిర్మాణాత్మకమైన చర్చకు తావివ్వాలని ప్రతిపక్షాలను తాను కోరుతున్నానని పేర్కొన్నారు.

## సీఏఏ అంటే రాజ్యాంగంపై దాడే

### గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలో అక్బరుద్దీన్



సాక్షి, హైదరాబాద్: కేంద్రం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) పూర్తిగా రాజ్యాంగం మీద చేసిన దాడిగా ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ అభివర్ణించారు. సీఏఏ, ఎన్నార్సీ, ఎన్పీఆర్‌లు ముస్లింలకే కాదు.. దేశంలోని మొత్తం పేద ప్రజలకు వ్యతిరేకమని పేర్కొన్నారు. 'దేశ ఆర్థిక పరిస్థితి క్షీణించింది. జాతీయ వృద్ధి రేటు పడిపోతోంది. నిరుద్యోగం పెరుగుతోంది. జీఎస్టీ బకాయిలు పేరుకుపోతున్నాయి. వీటిపై కేంద్రానికి చీమ కుట్టినట్లయినా లేదు. సీఏఏ, ఎన్నార్సీ, ఎన్పీఆర్‌లనే పట్టుకొని వేలాడుతోంది' అని ఒవైసీ దుయ్యబట్టారు. శనివారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా మాట్లాడుతూ.. తమ హక్కుల కోసం కొట్లాతూనే ఉంటామని, హక్కుల సాధనలో ఎవరికీ భయపడేది లేదని స్పష్టం చేశారు. సీఏఏను తిప్పికొట్టే పోరాటానికి సీఎం కేసీఆర్ నాయకత్వం వహించాలని కోరారు. దేశంలో లౌకికత్వాన్ని కాపాడే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే చర్యలకు తాము సహకరిస్తామని తెలిపారు. ఇటీవల జరిగిన ఢిల్లీ అల్లర్లలో చనిపోయిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. సీఏఏతో పాటు, కాళేశ్వరానికి జాతీయ హోదా ఇవ్వాలని ఈ సమావేశాల్లోనే తీర్మానం చేయాలని సూచించారు. మైనార్టీల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం చేసిన కృషిని ఆయన అభినందించారు. అయితే వాటి అమలులో వేగం పెంచాలని కోరారు. ముస్లిం రిజర్వేషన్లపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం

▶ మొదటి పేజీ తరువాయి

ఇంగ్లిష్ వచ్చి ఉండాలని అందరూ కోరుకుంటున్నారని, దీన్ని అమలు చేసేందుకు విద్యావేత్తలు తగిన ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. బడ్జెట్ సమావేశాల తరువాత దీనిపై ఓ సమావేశం ఏర్పాటు చేయాలని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ఆదేశించారు. ఆ సమావేశానికి తాను కూడా హాజరవుతానని, ఆ మీటింగ్‌లో వ్యక్తమైన సలహాలు, సూచనల్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మహాత్మా గాంధీ 150వజయంత్యుత్సవాల సందర్భంగా జీవిత ఖైదీలను కొందరిని విడుదల చేయాలన్న విజ్ఞప్తులను సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

# తీసి అవతల పారేద్దామా?

### సభలో ఏది పడితే అది మాట్లాడటం సరికాదు

| రాజగోపాల్‌రెడ్డిపై నిప్పులు చెరిగిన కేసీఆర్ | మిగతా కాంగ్రెస్ సభ్యుల తీరుపైనా అసంతృప్తి | నల్లగొండలో ఫ్లోరోసిస్ తగ్గింది భగీరథతోనే.. | 'సింగపూర్' రూల్ ఇక్కడ తీసుకురావచ్చో చూడండి | స్పీకర్‌కు విజ్ఞప్తి చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ |
|---|---|---|---|---|

సాక్షి, హైదరాబాద్: 'సభలో అబద్ధాలు చెప్పే వారు అవసరమా? తీసి అవతల పారేద్దామా? అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించేవారు సభలో ఉండటానికి అర్హులా?' అని రాజగోపాల్‌రెడ్డి సహా కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తీవ్రస్థాయి లో మండిపడ్డారు. సభలో అసత్య ఆరోపణలు చేసే వారిపై స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం చర్చపై సీఎం కేసీఆర్ సమాధానం ఇచ్చారు. 'శాసనసభలో ఏదిపడితే అది మాట్లాడటం కరెక్టు కాదు. కొత్త రూల్ అవసరమే. సింగపూర్‌లో ఒక చట్టం ఉంది. ఆరోపణ చేస్తే నిరూపించాలి. మన దగ్గర అలాంటి అవకాశం ఉందో పరిశీలించండి. ఇలాంటి వాటికి ఎక్కడో ఒక దగ్గర చరమగీతం పాడాలి. లేకపోతే అది రాష్ట్రానికి మంచిది కాదు. ఎవరికీ మంచిది' అని సీఎం పేర్కొన్నారు.

**ఆధారం లేకపోతే మాది అరణ్య రోదనే కదా!**

'మిషన్ భగీరథ వంటి ప్రతిష్టాత్మక పథకంపై పిచ్చి కూతలు కూసే కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి నియోజకవర్గంలోనే 334 ఆవాసాలకు నీళ్లు ఇచ్చాం. గ్రామ పంచాయతీల తీర్మానాలు ఉన్నాయి. నీళ్లు వచ్చాయని ఆయనే సంతకం చేశారు. మళ్లీ అబద్ధాలు చెబుతున్నారు. అంటే ఆయన సంతకం చేసింది అబద్ధమా? ఇదిగో ఆ పత్రం.. మీ దగ్గరే పెట్టండి.. ఆయనపై ఏం యాక్షన్ తీసుకుంటారో ఆలోచించండి. మినిస్టర్‌ను తిట్టారు. ఈ రుజువు లేకపోతే మా పరిస్థితేంటి.. అరణ్య రోదనే కదా.. గతంలో ఆయన అన్న గవర్నర్‌పై మైక్ విసిరారు. ఈ అరాచకం మంచిది కాదు. ఎక్కడో చోట దెబ్బ కొట్టాలి. మీరు సీరియస్‌గా తీసుకోవాలి. సహించొద్దు. గుణపాఠం చెప్పాల్సిందే. మీరే నిర్ణయం తీసుకోండి. ఈ విషయంలో నివేదిక తెప్పించుకొని చర్యలు చేపట్టండి' అని పేర్కొన్నారు.

**ఫ్లోరోసిస్‌కు అడ్డుకట్ట వేశాం**

'మిషన్ భగీరథ పథకంతో నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిస్‌కు అడ్డుకట్ట వేశాం. ఇది అద్భుత పథకమని యావత్ దేశం ప్రశంసించింది. ఈ పథకం కోసం ఇప్పటికే రూ.41 వేల కోట్లు ఖర్చు చేశాం. మరో రూ.3 వేల కోట్లు అవసరం అవుతాయి.



శనివారం శాసనసభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

మిషన్ భగీరథ వల్ల నల్లగొండలో ఫ్లోరోసిస్ సమస్య పోయిందని స్వయంగా కేంద్ర జల శక్తి శాఖనే ప్రకటించింది. భగీరథతో రాష్ట్రంలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని ఇస్తున్నాం. అవికాకుండా అదనంగా రూ.90 లక్షలు కావాలని రాజగోపాల్‌రెడ్డి అడిగారు' అని సీఎం వివరించారు.

**ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ అంతటోళ్లే ఓడిపోయారు..**

'ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజం. ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ అంతటివాళ్లే ఓడిపోయారు. కాంగ్రెస్ పరిస్థితి రోజురోజుకు దిగజారుతోంది. ఢిల్లీలో కాంగ్రెస్‌కు 4 శాతం ఓట్లే వచ్చాయి. ప్రజాస్వామ్యంలో సహనం అవసరం. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. ఎవరు పని చేస్తారనుకుంటే ప్రజలు వారినే గెలిపిస్తారు. గొంతు ఉంది కదా అని అసత్య ఆరోపణలు చేయొద్దు. ఎన్నికల్లో ప్రజలు ఓడించినా కాంగ్రెస్‌కు బుద్ధి రాలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్ అన్నారు. బ్యాలెట్‌తో జరిగిన జెడ్పీల్లో టీఆర్‌ఎస్ అత్యధిక స్థానాలు గెలుచుకుంటే మాట లేదు. గెలుపోటములపై కాంగ్రెస్ ఆత్మపరిశీలన చేసుకోవాలి. కేసుల మీద కేసులు వేస్తూ కాంగ్రెస్ నేతలు అభివృద్ధికి అడ్డుపడుతున్నారు. కేసులేసేది వాళ్లే.. నీళ్లు రావడం లేదని ఆరోపించేదీ వాళ్లే. ఉమ్మడి రాష్ట్రంలో అదే. ఇప్పుడు అదే పరిస్థితి. తెలంగాణపై మాట్లాడితే కేసులు పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌ది. మాపై ఎన్నో కేసులు పెట్టి తెలంగాణను అడ్డుకోవాలని చూశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత కూడా కాంగ్రెస్, బీజేపీ కుట్రలు ఆగలేదు. కాంగ్రెస్ నేతలు ఎంత నీచానికైనా దిగజారుతారు. ఏడు మండలాలు, సీలేరు ప్రాజెక్టు దక్కకుండా బీజేపీ కుట్రలు చేసింది. అభివృద్ధికి సహకరించకుండా ప్రతి దాన్ని రాజకీయం చేస్తోంది. మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుంది' అని కేసీఆర్ దుయ్యబట్టారు.

**వస్తామన్నా వద్దని వారించా**

'మా పార్టీ తరపున 88 మంది ఎమ్మెల్యేలను ప్రజలు గెలిపించారు. ఉప ఎన్నికల్లో మరొకటి, ఒకరు నామినేటెడ్ ఎమ్మెల్యే. మొత్తం 90 మంది ఉన్నారు. ఆ సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొంతమంది టీఆర్‌ఎస్‌లోకి వస్తామంటే నేనే వద్దని చెప్పా. రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాలని చెప్పా. దానిపై తప్పుడు ప్రచారం చేయొద్దు. రాజ్యాంగం ప్రకారం మూడింట రెండొంతుల ఎమ్మెల్యేలు విలీనం అయ్యారు. రాజ్యసభలో టీడీపీ ఎంపీలు బీజేపీలో విలీనం అయ్యారు' అని కేసీఆర్ తెలిపారు. కాగా, కాంగ్రెస్ సభ్యుడు విలీనంపై చేసిన ఆరోపణను పరిగణనలోకి తీసుకుని చర్యలు చేపట్టాలని స్పీకర్‌ను సీఎం కోరారు. అనంతరం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు.

# నిరుద్యోగ భృతి లేదు

### ఈ ఏడాది ఇచ్చే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం లేదు
### మండలిలో ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది కూడా నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇచ్చే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం లేదని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. తామిచ్చిన వాగ్దానం నెరవేర్చడానికి ఐదేళ్ల సమయం ఉందని, వచ్చే ఏడాది లేదా ఆ తర్వాతి ఏడాది చూస్తామన్నారు. ఆర్థిక మాంద్యం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఇప్పుడు సాధ్యం కాదన్నారు. శనివారం మండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి సీఎం సమాధానమిస్తూ.. కేంద్రం తీసుకొచ్చిన చట్టం ప్రకారం రాష్ట్రంలో కూడా 10% ఈబీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామన్నారు. భైంసాలో అల్లర్లలో నిజమైన బాధితుల వివరాలు అందజేస్తే సాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తెలంగాణలో 70 శాతానికి పైగా బలహీనవర్గాల వారు ఉన్నందున రిజర్వేషన్ల పెంపుపై కేంద్రంతో పోరాడతామని, కేబినెట్ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఢిల్లీ వెళ్లి ధర్నా చేస్తామని చెప్పారు. పీఆర్సీ కమిటీ గడువు ముగిసినా కొనసాగిస్తామని, సర్వీసు బుక్స్, ఇతర అంశాలను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాల్సి ఉందని పేర్కొన్నారు. వేతన సవరణ కోసం పీఆర్సీ ఆగలేదని స్పష్టం చేశారు. గోదావరి, కృష్ణా నదుల్లో తెలంగాణకు కేటాయించిన నీటిని పూర్తిస్థాయిలో ఉపయోగించుకుంటామన్నారు. గతంలో ఏపీ సీఎం కక్ష పూరితంగా వ్యవహరించారని, తాము మహారాష్ట్ర సీఎంతో ఏడుసార్లు భేటీఅయి ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. సంక్షేమ రంగంలో రూ.45 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు.

**బతికున్నంత కాలం ఉచిత కరెంట్**

కేసీఆర్ బతికున్నంత కాలం రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తామని, రైతుబంధు, రైతుబీమా, కోటిఎకరాలకు నీరందించేలా నీటిపారుదల ప్రాజెక్టులు చేపడతామన్నారు. కల్తీలేని ఎరువులు, విత్తనాలు అందించేందుకు కఠినచర్యలు తీసుకుంటామని, కల్తీకి పాల్పడే దుర్మార్గులపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపుతామని తెలిపారు. మహిళల ఆత్మగౌరవానికి చిహ్నమైన డబుల్ బెడ్రూం ఇళ్లను 2.76 లక్షల మేర నిర్మాణం పూర్తిచేసి అందజేస్తామన్నారు.

**ఐకేపీ ఉద్యోగుల క్రమబద్ధీకరణ**

57 ఏళ్ల వయసు దాటిన వారికి వృద్ధాప్య పింఛన్లు ఈ ఆర్థిక సంవత్సరం నుంచి అమలు చేస్తామని తెలిపారు. నిరుద్యోగం ఉంటుందని, అయితే కేంద్ర ప్రభుత్వంలో ఉన్న వివిధ ఉద్యోగ అవకాశాలు పొందేలా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు స్టడీసర్కిళ్ల ద్వారా శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. కాగా, ఐకేపీ కింద ఉన్న మూడు, నాలుగు వందల మంది ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని తెలిపారు.

**త్వరలో కోటి ఎకరాలకు నీరు..**

ఏడాదిన్నర రెండేళ్లలోనే పూర్తిస్థాయిలో పాలమూరు, సీతారామ, దేవాదుల, కాళేశ్వరం పూర్తిస్థాయిలో పూర్తయితే కోటి ఎకరాలకు నీటిని అందిస్తామన్నారు. రైతు బీమా గొప్ప పథకమని, ఏ రైతు ఏ కారణంతో చనిపోయినా బీమా కల్పిస్తామని, ఈ పథకానికి ప్రీమియం మొత్తం రూ.600 కోట్ల నుంచి రూ.1,300 కోట్లకు పెరిగిందని, రైతుల సంఖ్య ఇంకా పెరిగినా ప్రభుత్వమే ఆ మొత్తాన్ని చెల్లిస్తుందని పేర్కొన్నారు. రైతు మరణించిన 10 రోజుల్లోగా అందించే ఏర్పాట్లు చేస్తామన్నారు.

# జై కిసాన్



▶ మొదటి పేజీ తరువాయి

ప్రణాళికను సిద్ధం చేస్తామన్నారు. రైతు పండించే ప్రతి గింజను కొంటామన్నారు. ఈ ఏడాది వానాకాలంలో 40 లక్షల ఎకరాలు, యాసంగిలో 38 లక్షల ఎకరాల్లో వరి వేశారని, దాన్నుంచి 225 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని, అందులో 100 లక్షల టన్నులు మనం తినడానికే అవుతుందని, మిగిలిన 125 లక్షల టన్నులు ఎఫ్‌సీఐ తీసుకోవడానికి సిద్ధంగా ఉందన్నారు. సన్న బియ్యం రకం పంట విస్తీర్ణం పెరిగితే రాష్ట్రంలోని మిల్లులకు ప్రోత్సాహం అందించడం ద్వారా ఎగుమతి చేయవచ్చన్నారు. రైతులకు దుఃఖాన్ని కల్పిస్తున్న రెవెన్యూ చట్టాన్ని మారుస్తామని, కొత్త చట్టాన్ని తెస్తామన్నారు. ఈ సందర్భంగా సీఎం వెల్లడించిన అంశాలు ఆయన మాటల్లోనే..

**ఆ ఒక్క ఘటన తప్ప అంతా బాగు...**

''రాష్ట్రంలో శాంతిభద్రతలు బ్రహ్మాండంగా ఉన్నాయి. దిశ రేప్ కేసు విషయంలో అందరం బాధపడ్డాం. మనందరి ఇళ్లలో తల్లులు, భార్య బిడ్డలున్నరు. ఎంత ఖండించినా తక్కువే. అదొక్కటే దురదృష్టకరమైన సంఘటన. దేశం మొత్తంలో ఉన్న సీసీటీవీల్లో 66 శాతం తెలంగాణలో ఉన్నాయి. 6 లక్షల సీసీ టీవీ కెమెరాలను తెలంగాణ వచ్చాక ఏర్పాటు చేశాం. ఇక ఐటీ ఎగుమతుల్లో సూపర్ డూపర్‌గా ఉన్నాం. ఐటీ ఉత్పత్తుల ఎగుమతుల జాతీయ వృద్ధిరేటు 7–8 శాతం ఉంటే రాష్ట్రంలో 16 శాతం ఉంది. సామాజిక సమతూకం పాటించే విషయంలో ముందుకు వెళ్తున్నాం. అన్ని రంగాల్లో అన్ని వర్గాల ప్రజల ప్రాతినిధ్యం పెరిగితేనే కడుపునిండినట్లు ఉంటది. అందరికీ అవకాశాలు రానప్పుడు ఆక్రోశం ఉంటది. అది మంచిది కాదు.

**ముస్లిం కోటాపై ఆందోళన వద్దు..**

ముస్లింలకు 4% రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో జరుగుతున్న విచారణపట్ల ఆందోళన అవసరం లేదు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈ కేసును వాదించేందుకు సీనియర్ న్యాయవాదిని నియమించాం. ప్రత్యేక ఉర్దూ డీఎస్సీ నిర్వహణ, ఆలేరు ఎన్‌కౌంటర్‌పై సిట్ దర్యాప్తు నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టాలని అక్బరుద్దీన్ ఒవైసీ చేసిన విజ్ఞప్తులపై సానుకూల నిర్ణయం తీసుకుంటాం. పాతబస్తీ లాల్‌దర్వాజ మహంకాళి ఆలయ విస్తరణ చేపట్టాలని అక్బరుద్దీన్ విజ్ఞప్తి చేయడం సంతోషం.

**పాతబస్తీకి మెట్రో...**

పాతబస్తీకి మెట్రో రైల్ ఏర్పాటుకు కట్టుబడి ఉన్నాం. ఇప్పటికే అలైన్‌మెంట్ సమస్యలు పరిష్కారం అయ్యాయి. ఆ పనులను ప్రారంభించి యుద్ధప్రాతిపదిక కొనసాగించాలని మున్సిపల్ శాఖ మంత్రిని ఆదేశిస్తున్నా. పాతబస్తీ ఎమ్మెల్యేలు, ఎంఐఎం ఎంపీ సహకరిస్తారు. పాతబస్తీకి తాగునీటి సమస్యను తీరుస్తాం. ఓల్డ్ సిటీలో ఆసుపత్రి కడతాం.

**అవసరమైతే పెంచుతాం..**

రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థాపక సామర్థ్యాన్ని పెంచుకున్నాం. తలసరి విద్యుత్ వినియోగం పెరిగింది. ఇది రాష్ట్రానికి గర్వకారణం. 24గంటల కరెంటు అవసరం లేదట. అప్పులు తెచ్చి విద్యుత్ ఇస్తున్నారు.. చార్జీలు పెంచుతారా? అని అంటున్నారు. పెంచుతాం.. ప్రజలకు పరిస్థితిని వివరిస్తాం. ఆరేళ్లలో ఒక్కసారే ఆర్టీసీ, కరెంట్ చార్జీలను స్వల్పంగా పెంచాం. మళ్లీ పెంచాల్సి వస్తే పెంచుతాం. ప్రజలను ఇబ్బంది పెట్టేలా కాకుండా సంస్థల మనుగడ కోసం కొంత మేర పెంచుతాం. ప్రజల దగ్గర నుంచి వసూలు చేసే పన్నుల ద్వారానే ప్రభుత్వాలు నడుస్తాయి. అయితే ఆ పన్నులు రీజనబుల్‌గా ఉండాలి.

**ప్రజలకు దోఖా చేస్తే వచ్చేదేంటి?**

అధికారంలో ఉంటే ఒకలా.. ప్రతిపక్షంలో ఉంటే మరోలా అలవాటు అయిపోయింది. ప్రతిపక్ష పార్టీ అధికారంలోకి వస్తే చార్జీలు తగ్గిస్తుందా? అదేం దోఖా? ఎంతకాలం ఈ ఆత్మవంచన, ప్రజావంచన. ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా అబద్ధాలు చెప్పి దోఖా చేస్తే వచ్చేదేంటి?

**పోడు భూములకు రైతుబంధు వర్తించదు...**

పోడు భూములకు రైతుబంధు వర్తించదు. సీఎస్, నేను, మంత్రులు అంతా ఒకసారి వెళ్లి ప్రజాదర్బార్ పెట్టి పోడు భూముల సమస్యలను పరిష్కరిస్తాం. గతంతో పోలిస్తే రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయి.

**ఇళ్ల పథకాల్లో వారు తిన్నారు...**

ఇళ్ల పథకాల్లో వారు(కాంగ్రెస్ నేతలు) తిన్నారు. మేం తినము. పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తాం. వారి పాలనలో 70–80 లక్షల ఇళ్లు కట్టామని చెప్పారు. అవన్నీ ఏమయ్యాయి.. ఎక్కడ పోయాయి? ఇళ్లు కట్టలేదు... తినేశారు.

**3 ఎకరాల భూమి పథకం నిరంతరం..**

దళితులకు 3 ఎకరాల భూమి పథకం నిరంతరం కొనసాగుతుంది. ఎంత మంది వస్తే అంత మందికి ఇస్తాం. భూమి ఉంటే కొనుగోలు చేసి ఇస్తాం. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో విదేశాలకు వెళ్లిన వారిని, హైదరాబాద్‌లో స్థిరపడిన వారితో మాట్లాడితే భూమి కొనుగోలు చేసి ఇస్తాం.

**త్వరలో ఏపీలోనూ 25 జిల్లాలు...**

స్వాతంత్ర్యం వచ్చాక అనేక రాష్ట్రాలు కొత్త జిల్లాలు ఏర్పాటు చేసుకున్నాయి. అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ మాత్రమే చేసుకోలేదు. తెలంగాణ వచ్చాక 33 జిల్లాలు చేశాం. ఏపీ సీఎం మాట్లాడిన దానిని బట్టి త్వరలో ఏపీలో కూడా 25 జిల్లాలు చేయబోతున్నారు.

**ఈ టర్మ్ పూర్తయ్యేలోగా మూసీ ప్రక్షాళన..**

ఈ టర్మ్ పూర్తయ్యేలోగా మూసీ ప్రక్షాళన చేస్తాం. చౌటుప్పల్‌లో కాలుష్యం మేం తెచ్చామా? మేం పరిశ్రమలకు అనుమతులు ఇస్తే పక్కాగా వ్యవహరిస్తున్నాం. కొన్ని మినహా ఇతర పరిశ్రమల్లో 90 శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇవ్వాలని చెప్పాం.

**సుస్థిరాభివృద్ధిలో మనం భేష్...**

సుస్థిరాభివృద్ధిలో తెలంగాణ భేష్ అని నీతి ఆయోగ్ చెప్పింది. 'కాగ్'లెక్కల ప్రకారం కాంగ్రెస్ హయాంలో స్థూల మూల వ్యయం రూ. 59 వేల కోట్లు ఉంటే ఈ ఐదేళ్లలో రూ. 1.6 లక్షల కోట్లకు చేరింది. ఈ లెక్కలు 'కాగ్'లో అందరూ చూడవచ్చు. 2014 నాటికి జీఎస్‌డీపీ రూ. 4 లక్షల కోట్లు ఉంటే అది ఇప్పుడు రూ. 8.6 లక్షల కోట్లకు చేరింది. 2020–21లో 9.5 లక్షల కోట్లు అవుతుందని కాగ్ అంచనా వేసింది.

## మాస్కులు ఎందుకు?

రాష్ట్రంలో కరోనా వైరస్ లేదు. దానిపై అసత్యాలు, దుష్ప్రచారాలు చేయడం సరి కాదు. కరోనా రావొద్దని దేవుణ్ణి ప్రార్థిస్తున్నా. రాష్ట్రానికి కరోనా వైరస్ రాదు.. రానివ్వం. ఈ వైరస్ ఇక్కడ పుట్టింది కాదు. ఒకవేళ వచ్చినా రూ. వెయ్యి కోట్లు ఖర్చు పెట్టయినా అడ్డుకుంటాం. మాస్కులు లేకుండానే పని చేస్తాం. 130 కోట్ల మంది ఉన్న దేశంలో 31 మందికే కరోనా వచ్చింది. అందులో ఒకరు దుబాయ్ పోయి వచ్చిన వ్యక్తి రాష్ట్రానికి వచ్చాడు. ఇప్పుడు ఆయన కూడా బాగానే ఉన్నారు, బతుకుతాడు. రాష్ట్రంలో కరోనా లేనప్పుడు మాస్కులు ఎందుకు? సభలో ఇంత మంది ఉన్నాం. మాస్కులు లేకపోతే సచ్చిపోతామా? 22 డిగ్రీల ఉష్ణోగ్రత దాటితే కరోనా వైరస్ బతకదు అని ఒక సైంటిస్ట్ చెప్పారు. మన దగ్గర 30 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంది. అలాంటప్పుడు అది బతకదు. పైగా కరోనాకు ఒక్క పారాసిటమాల్ టాబ్లెట్ సరిపోతుందని వైద్యులు చెప్పారు.

## నాకే బర్త్ సర్టిఫికెట్ లేదు.. ఎక్కడ తేవాలి?

పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్) వ్యవహారాలు దేశ గౌరవానికి చెందిన అంశాలు. మిగతా రాష్ట్రాల్లాగే సీఏఏను వ్యతిరేకిస్తూ మన అసెంబ్లీలో చర్చించి తీర్మానం చేసి పంపిద్దాం. తమ పౌరసత్వాన్ని నిరూపించుకొనేందుకు ప్రజలు బాగా ఇబ్బందులు పడుతున్నారు. నేను మా ఊళ్లో సొంతింట్లో పుట్టాను. నాకే బర్త్ సర్టిఫికెట్ లేదు. నువ్వెవరు అంటే ఏం చెప్పాలి? హౌ డూ ఐ ప్రూఫ్? ఆ కాలంలో పెద్దలు ఊళ్లో ఉన్న అయ్యగారిని పిలిపించి జన్మనామ పత్రిక అని రాయించేవాళ్లు. అదే బర్త్ సర్టిఫికెట్. దానికి అధికారిక ముద్ర ఉండదు. ఇప్పటికీ నా జన్మనామం పత్రిక నా భార్య దగ్గర ఉంది. ఆ రోజున ఈ రికార్డులు లేవు. నాదే దిక్కులేదంటే, 'మీ నాయనది తీసుకురమ్మంటే' నేను చావాల్నా? మాకు 580 ఎకరాల భూమి, పెద్ద కుటుంబం ఉంది. అలాంది నాకే బర్త్ సర్టిఫికెట్ లేకపోతే దళితులకు, నిరుపేదలకు ఎక్కడిది? వివరాలు తెమ్మంటే యాడ తేవాలి? దీనికి బదులు నేషనల్ ఐడెంటి కార్డు పెట్టాలి. సీఏఏపై ఓ రోజంతా సభలో చర్చిద్దాం.

## ఇంటికో ఉద్యోగం ఇస్తామనలేదు...

మేం ఇంటికో ఉద్యోగం ఇస్తామనలేదు. యువతను తప్పుదారి పట్టించకండి. మా మెనిఫెస్టోలో చూపిస్తారా? మేం అనని విషయాలను అన్నట్లుగా అబద్ధాలు చెప్పకండి. 60 ఏళ్లలో కాంగ్రెస్, టీడీపీ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చాయి. తెలంగాణ వస్తే మన ఉద్యోగాలు మనకే వస్తాయని చెప్పాం. పోలీసులు, ఇతర ఉద్యోగాలు కలుపుకుంటే 80 వేలు వచ్చాయి. ప్రభుత్వ ఉద్యోగులు వేలల్లో ఉంటే ప్రైవేటు ఉద్యోగులు లక్షల్లో ఉన్నారు. ఒక్క ఐటీలోనే 7 లక్షలు, పరిశ్రమల్లో 8 లక్షలు, భవన నిర్మాణ రంగంలో 18 లక్షల మంది ఉన్నారు.

## ధూల్‌పేటకు కచ్చితంగా వస్తా...

రాష్ట్రంలో 6,299 గుడుంబా తయారీ కుటుంబాలకు రూ. 125.99 కోట్లతో పునరావాసం కల్పించాం. ధూల్‌పేటలో 859 మందికి రూ. 2 లక్షల చొప్పున ఇచ్చాం. ధూల్‌పేటకు వస్తానని పోలేదు. నిజమే ఒప్పుకోవాలి. నేను, సిటీ ఎమ్మెల్యేలు, మంత్రులం వస్తాం. ఇంకా ఏమైనా సాయం కావాలన్నా చేస్తాం. పీఆర్సీ, రిటైర్‌మెంట్ వయసు పెంపు అమలు చేస్తాం. అందుకు సమయం, సందర్భం ఉంటుంది. సంస్కరణలు తేవాలి.. తప్పించుకోం. కాంగ్రెస్ దుష్ట పాలనలోనే వచ్చిన దరిద్రం నిరక్షరాస్యత. వారు పట్టించుకోకపోవడం వల్ల అక్షరాస్యతలో దిగువ నుంచి మూడో స్థానంలో ఉన్నాం. అందుకే 'ఈచ్ వన్ టీచ్ వన్'కార్యక్రమం గురించి చెప్పాను. ఎమ్మెల్యేలు అందులో చురుగ్గా పాల్గొనాలి. అందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తాం.''

## ఊదా.. సమానత్వ హోదా

**అ**మ్మాయిలంటే పింక్, అబ్బాయిలంటే బ్లూ.. కానీ ఈసారి మహిళా దినోత్సవంలో ఒక కొత్త రంగు కనిపిస్తోంది. అదే పర్పుల్. ఈ మధ్య ఏ పార్టీలు జరిగినా వేసుకునే డ్రెస్సుల్లో కలర్ కోడ్ పాటిస్తున్నారు. ఈసారి ఐక్యరాజ్య సమితి.. మహిళా దినోత్సవం సందర్భంగా అందరూ పర్పుల్ రంగు దుస్తులు ధరించాలని పిలుపునిచ్చింది. ఈ రంగు ఎంచుకోవడానికీ ఓ కారణముంది. ఆడ, మగా ఇద్దరూ సమానమేనని మాటల్లోనే చెబుతాం. ఆచరణలోకి ఇంకా అది రావడం లేదు. 2020లోకి వచ్చినా ఈ భావన ఇంకా పోలేదు. ఇప్పటివరకు ప్రపంచంలో ఏ దేశం కూడా లింగ సమానత్వాన్ని సాధించలేదని ఐక్యరాజ్య సమితి గణాంకాలు చెబుతోంది. ఇంటి పనుల్ని చక్కబెట్టడంలో, పనిచేసే ప్రదేశాల్లో, ఒకే పనికి వచ్చే వేతనాల్లో, చదువులో, ఆరోగ్యంలో ఇలా అన్నింటా ఇంకా ఆమె చేరుకోవాల్సిన లక్ష్యాలు భారీగానే ఉన్నాయి. అందుకే మహిళలు తమ హక్కుల్ని తెలుసుకొని అన్నింటా సమానత్వాన్ని సాధించే లక్ష్యంతో ఉమెన్స్ డే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సమానత్వం అనే భావనకు ఊదా రంగు ప్రతీకగా నిలుస్తుంది. మన రంగులకీ ఒక శాస్త్రం ఉంది. నిజాయితీ, లక్ష్యసాధనలో స్థిరత్వం, ఒక ప్రయోజనం నెరవేర్చుకోవడంలో దృఢనిశ్చయం వంటి వాటికి పర్పుల్ రంగు సంకేతం. మహిళా స్వేచ్ఛా ఉద్యమం థీమ్ కలర్ ఊదాయే. మరెందుకాలస్యం.. పర్పుల్ రంగు దుస్తులు వేసుకోండి. మీరనుకున్న ప్రయోజనాన్ని నెరవేర్చుకోండి.




## సూపర్ 'షీ'రోస్

**సూ**పర్‌మ్యాన్, బ్యాట్‌మ్యాన్, స్పైడర్‌మ్యాన్.. ఇలా ఏది చూసినా మగవారిని హీరోలుగా చేసి చూపించే పాత్రలే. కానీ మహిళలకేం తక్కువ? వారి శక్తి సామర్థ్యాలు మగవాళ్లకి ఏ విధంగానూ తీసిపోవని శాస్త్రీయంగా రుజువైంది.

- దీర్ఘాయుష్మాన్‌భవ అని పెద్దవాళ్లు దీవిస్తారు కదా! ఆ దీవెనలన్నీ ఆడవారికే దక్కినట్టుగా అనిపిస్తోంది. 110 ఏళ్ల కంటే ఎక్కువ జీవితాన్ని చూసిన 43 మందిలో 42 మంది మహిళలే ఉన్నారని గ్లోబల్ గెరంటాలజీ రీసెర్చ్ గ్రూప్ వెల్లడించింది. శరీర నిర్మాణం, సామాజికపరమైన అంశాలు, వ్యసనాలు లేకపోవడం, ఆరోగ్యకరమైన అలవాట్లు ఆడవారిలో ఆయుష్షును పెంచుతున్నాయి.
- మగవారితో పోలిస్తే ఆడవారిలో రోగనిరోధక శక్తి ఎక్కువట. కరువు కాటకాలు, వాతావరణ మార్పులు, వ్యాధులు ప్రబలినప్పుడు మహిళలే ఎక్కువగా తట్టుకోగలరని అమెరికాకు చెందిన నేషనల్ అకాడమీ అధ్యయనకారులు చెబుతున్నారు. దీనికి స్పష్టమైన కారణాలు సరిగ్గా వెల్లడి కానప్పటికీ తల్లి గర్భంలో ఉన్నప్పుడే ఆడపిల్లల్లో రోగ నిరోధకశక్తి ఎక్కువగా స్వీకరించుకోగలిగే శక్తి వారికి వస్తుందని చెబుతున్నారు.
- మానసికంగా మహిళలే ఎక్కువగా బలవంతులని సెయింట్ గాలెన్ యూనివర్సిటీ నేతృత్వంలో జరిగిన అధ్యయనంలో వెల్లడైంది. మగవారి కంటే మహిళలే అత్యధికంగా ఒత్తిళ్లను తట్టుకోగలరట.
- మగవారి మెదడు సైజు పెద్దదేమో కానీ, సొంత తెలివి మాత్రం ఆడవాళ్లదేనట. ఎడిన్‌బర్గ్ యూనివర్సిటీ నిర్వహించిన ఐక్యూ పరీక్షల్లో మహిళలు స్పందించినంత చురుగ్గా మగవారు స్పందించలేరని తేలింది.

అసెంబ్లీ ముచ్చట్లు

# వందెకరాలున్నా 'రైతు బంధు'

### మండలిలో మంత్రి పువ్వాడ అజయ్



**సాక్షి, హైదరాబాద్:** 'రైతుబంధు'పథకానికి ఎలాంటి పరిమితులు, ఆంక్షలు విధించలేదని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ స్పష్టంచేశారు. మండలిలో శనివారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే విషయంపై చర్చ జరిగింది. ఈ తీర్మానాన్ని మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు ప్రవేశపెట్టారు. అనంతరం చర్చ జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రతిపక్ష సభ్యులు 'రైతుబంధు'కు పరిమితులు విధిస్తున్నారని, అందరికీ రావడంలేదని వ్యాఖ్యానించారు. మంత్రి పువ్వాడ కలుగజేసుకొని వందెకరాలున్నా 'రైతు బంధు'కింద పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు తెలిపారు.

### బీడు భూములకు నీళ్లు



ముఖ్యమంత్రి కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేసి బీడు భూములకు నీళ్లు అందిస్తున్నారని చీఫ్ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆయన మాట్లాడుతూ రైతులు ఈ రోజు ఆనందంగా పంటలు పండిస్తున్నారన్నారు.వారికి ప్రభుత్వం గిట్టుబాటు ధర అందిస్తోందన్నారు.

### దేశంలోనే నంబర్‌వన్



రాష్ట్రం దేశంలోనే నెంబర్‌వన్‌గా ముందుకెళ్తోందని టీఆర్ఎస్ సభ్యుడు భానుప్రసాద్ అన్నారు. విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు 900కు పైగా గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రైతులకు 3పంటలకు నీళ్లు అందిస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదన్నారు.

### పరిశ్రమల ఏర్పాటు



రాష్ట్రంలో పరిశ్రమలను ఏర్పాటు చేయడంలో ఐటీ మంత్రి కేటీఆర్ కృషి చేస్తున్నారన్నారని టీఆర్ఎస్ సభ్యుడు నారదాసు లక్ష్మణరావు అన్నారు. సీఎం కేసీఆర్ అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి అభివృద్ధి వైపు రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తున్నారన్నారు.

### నిరుద్యోగ భృతి ఏదీ



నిరుద్యోగులకు రూ. 3,016 భృతి ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు ఆ ప్రస్తావనే తీసుకురాలేదని బీజేపీ ఎమ్మెల్సీ రామచందర్ రావు విమర్శించారు. పీఆర్సీ ఇవ్వడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. కోవిడ్ వైరస్ విషయంలో ప్రజలకు ఎలాంటి ధైర్యం కల్పిస్తున్నారో చెప్పాలన్నారు.

### పీఆర్సీ ప్రకటించాలి



ఉద్యోగులకు ప్రభుత్వం వెంటనే పీఆర్సీ ప్రకటించాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కనీసం మధ్యంతర భృతి అయినా ప్రకటించాలన్నారు. ఏపీ ప్రభుత్వం 27% ప్రకటించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

### భైంసా అల్లర్లను సమర్థించడంలేదు



భైంసా అల్లర్లు రెండు వర్గాల మధ్య జరిగాయని ఎంఐఎం సభ్యుడు జాఫ్రీ అన్నారు. వాటిని తాము ఏమాత్రం సమర్థించడంలేదన్నారు.

### మిగులు రాష్ట్రం కాస్తా.. అప్పుల పాలైంది

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర విభజనకు ముందు మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణ.. అనంతరం అప్పుల రాష్ట్రంగా మారిపోయిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క విమర్శించారు. ప్రజలపై ఎనలేని బారం మోపుతూ అప్పులతోనే రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని మండిపడ్డారు.

### ప్రతిపక్షం లేకుండా చేశారు



రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా చేశారని, ఉన్న విపక్ష సభ్యులకు సమయం ఇవ్వట్లేదని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ విమర్శించారు.

### మాంద్యంలోనూ కొనసాగింపు

గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టిన టీఆర్ఎస్ సభ్యుడు ఆరూరి రమేశ్ మాట్లాడుతూ.. ఆర్థిక మాంద్యం ఉన్నా, కేంద్రం నుంచి ఆర్థికసాయం అందకున్నా ప్రభుత్వం ఏ ఒక్క సంక్షేమ పథకానికి కోత విధించడం, నిలిపేయడం లేదని పేర్కొన్నారు.

### ప్యానెల్ స్పీకర్లుగా నలుగురు సభ్యులు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర అసెంబ్లీలో ప్యానెల్ స్పీకర్లుగా టీఆర్ఎస్ పార్టీ సీనియర్ సభ్యులు హన్మంతు షిండే, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రెడ్యానాయక్, ఎంఐఎం ఎమ్మెల్యే మౌజంఖాన్‌లను నియమించారు. ఈ మేరకు శనివారం సభ ఆరంభమైన వెంటనే వీరి పేర్లను స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్యానెల్ స్పీకర్లుగా ప్రకటించారు.

# 1.58 లక్షల కోట్ల పద్దు!




## 2020-21 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రతిపాదనలుండే అవకాశం

**సాక్షి, హైదరాబాద్:** గతేడాది ఓటాన్ అకౌంట్‌తో పోలిస్తే సాధారణ బడ్జెట్‌కు భారీగా కోత పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం రానున్న ఆర్థిక ఏడాదికి కూడా వాస్తవిక కోణంలోనే బడ్జెట్ అంచనాలను ప్రతిపాదించనుంది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) పెరుగుదల అంచనాలను పరిగణనలోకి తీసుకుని గతేడాది బడ్జెట్ అంచనాల కన్నా 8% పెరుగుదలతో రూ. 1.58 లక్షల కోట్ల వరకు 2020– 21 వార్షిక బడ్జెట్‌ను ప్రతిపాదించనున్నట్లు తెలుస్తోంది. ఆర్థిక మాంద్యం ప్రభావం వచ్చే ఆర్థిక ఏడాది తొలి త్రైమాసికం వరకు ఉంటుందనే అంచనాలు, కోవిడ్ ప్రభావంతో పారిశ్రామిక రంగ ఆదాయం పడిపోతుందేమోననే భయం ఉన్నా ప్రస్తుత ఆర్థిక ఏడాది రాబడులు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మెరుగ్గానే ఉండటంతో ఈ మేరకు బడ్జెట్ అంచనాలకు వెళ్లవచ్చనే నిర్ధారణకు ఆర్థికశాఖ వర్గాలు వచ్చాయని సమాచారం. దీంతో గతేడాది రూ.1.46 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించగా, మరో రూ.12 వేల కోట్ల వరకు కలిపి మొత్తం రూ.1.58 లక్షల కోట్ల మేర బడ్జెట్ అంచనాలను అసెంబ్లీ ముందుంచేందుకు సిద్ధమయిందని సమాచారం. ఆర్థిక మంత్రి హోదాలో హరీశ్‌రావు తొలిసారి ఆదివారం ఉదయం 11:30 గంటలకు 2020– 21 వార్షిక బడ్జెట్‌ను శాసన సభలో ప్రవేశపెట్టనున్నారు. మండలిలో శాసనసభా వ్యవహా రాల మంత్రి ప్రశాంత్‌రెడ్డి బడ్జెట్ ప్రవేశపెడతారు.


మండలి నుంచి కేబినెట్ భేటీకి ఒకే కారులో వస్తున్న సీఎం కేసీఆర్, ఆర్థికమంత్రి హరీశ్‌రావు

### కీలక రంగాలకు అదే ప్రాధాన్యం..

ఈసారి బడ్జెట్ లో కీలక రంగాలకు ప్రాధాన్యత మేరకు నిధులు కేటాయించనున్నారు. ప్రస్తుతం అమలవుతున్న అన్ని పథకాలను కొనసాగిస్తూనే విద్య, వైద్యం, సాగునీటి శాఖలతో పాటు ఈసారి గృహ నిర్మాణానికి (డబుల్ బెడ్ రూం ఇళ్లు) ఎక్కువ నిధులు కేటాయించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణంపై ప్రతిపక్షాలు చేస్తు న్న విమర్శలకు తాళం వేసేందుకు బడ్జెట్‌లో నిధులు పెంచాలని, ఆ మేరకు ఇళ్లు కట్టి చూపించాలని, ఇంటి స్థలం ఉన్న వారికి ఇళ్లు కట్టుకునేందుకు రూ.6 లక్షలు ఇవ్వాలన్న హామీకి కూడా నిధులు కేటాయించాలని ప్రభుత్వం యోచిస్తోంది. గృహ నిర్మాణ శాఖకు నిధులు పెరగనున్నాయి. సాగునీటి శాఖకు ఈ సారి రూ.8,500 కోట్లు కేటాయించే అవకాశముంది. గతేడాది కన్నా రూ.1000 కోట్లు అధికంగా కేటాయించడంతో పాటు మరో రూ.15 వేల కోట్ల వరకు అప్పులు ప్రతిపాదించడం ద్వారా మొత్తం రూ.23,500 కోట్ల వరకు వచ్చే ఏడాది సాగునీటి రంగంపై ఖర్చు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇక విద్య, వైద్యానికి గత ఏడాది కన్నా కేటాయింపులు పెంచనున్నారు. ఆపద్బంధు, కుట్టుమిషన్ల పంపిణీ బాధ్యతలను కూడా సంక్షేమ శాఖలకే అప్పగించనున్నారు.

### సగం రుణమాఫీకి యోచన...

వ్యవసాయ రంగానికి కూడా నిధులు అంచనాలకు అనుగుణంగానే కేటాయించనున్నారు. ఈసారి రైతు రుణమాఫీకి గతేడాది కేటాయించిన రూ.6 వేల కోట్లతో పాటు మరో రూ.6 వేల కోట్లు ప్రతిపాదిస్తారని, మొత్తం రుణమాఫీ అమలుకు రూ.24వేల కోట్లు అవసరమవుతాయనే లెక్కల్లో సగం కేటాయించడం ద్వారా వచ్చే ఏడాది రెండు దఫాల్లో రైతుల రుణాలను సగం మేర మాఫీ చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం. అదే విధంగా రైతు బీమాకు గత ఏడాది కేటాయించిన రూ.700 కోట్లను రూ.1000 కోట్ల వరకు పెంచనున్నారు. ఆసరా పింఛన్లకు రూ.12 వేల కోట్లు, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల అమలుకు రూ.7,500 కోట్ల వరకు ఖర్చు కానున్నాయి. ఇక, జీతభత్యాలు, అప్పులకు వడ్డీల చెల్లింపులు, సబ్సిడీలు, విద్యుత్ రాయితీలకు కలిపి మరో ప్రణాళికేతర పద్దుల కింద రూ.50 వేల కోట్ల వరకు అవసరం కానున్నాయి. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానానికి సమాధానమిచ్చిన సీఎం కేసీఆర్ ఆదివారం అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను బట్టి ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ, నిరుద్యోగ భృతి లాంటి హామీలు ఈ ఏడాది ఆగే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాము మాట ఇచ్చింది వాస్తవమేనని, అయితే వీటి అమలుకు తమకు సమయం ఉందని సీఎం వ్యాఖ్యానించిన నేపథ్యంలో వాటికి ఈసారి బడ్జెట్‌లో కేటాయింపులు లేవనే తెలుస్తోంది. తెలంగాణ ఏర్పడినప్పుడు జీఎస్‌డీపీ రూ.4 లక్షల కోట్లుందని, గత ఏడాది రూ.8.6 లక్షల కోట్లుండగా, ఈ సారి రూ.9.5 లక్షల కోట్ల వరకు ఉండవచ్చని కాగ్ లెక్కలు చెబుతున్నాయని సీఎం అసెంబ్లీలో చెప్పారు. దీని ఆధారంగా వివిధ శాఖల అవసరాలను క్రోడీకరించి రూ.1.58 లక్షల కోట్ల వరకు ఈసారి అంచనాలు ప్రతిపాదించవచ్చనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో జరుగుతోంది. ఇదిలా ఉండగా, అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి నిధుల్లోనూ కోత పడే అవకాశం ఉంది. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి పేరుతో నేరుగా గ్రామాలకు, మున్సిపాలిటీలకు ప్రభుత్వం నిధులు ఇస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రూ.3 కోట్లుగా ఉన్న ఏసీడీఎఫ్ నిధులను రూ.1.5 కోట్లకు పరిమితం చేయనున్నట్లు సమాచారం.

### బడ్జెట్‌కు కేబినెట్ ఆమోదముద్ర

**సాక్షి, హైదరాబాద్:** ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి మండలి శనివారం రాత్రి ప్రగతి భవన్‌లో సమావేశమై 2020–21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలను ఆమోదించింది. పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) వ్యతిరేకిస్తూ శాసనసభలో ప్రవేశపెట్టనున్న తీర్మానం ప్రతిపై సైతం మంత్రివర్గ సమావేశంలో క్షుణ్ణంగా చర్చించినట్లు తెలిసింది. సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీల విషయంలో శాసన సభలో ప్రభుత్వం అవలంబించాల్సిన వైఖరిపై ఈ భేటీలో చర్చించినట్టు సమాచారం.

# కాంగ్రెస్ సభ్యుల సస్పెన్షన్

**సీఎం ప్రసంగానికి అడ్డుతగలడం వల్లే...**

- సభ నుంచి ఒకరోజు సస్పెండ్ చేస్తూ అసెంబ్లీ తీర్మానం
- రాజగోపాల్‌రెడ్డి తీరుపై కేసీఆర్ ఆగ్రహం
- తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి ప్రశాంత్‌రెడ్డి.. ఆమోదించిన సభ
- మిగతా సభ్యులపై తన విచక్షణాధికారం కింద స్పీకర్ సస్పెన్షన్ వేటు


సభనుంచి సస్పెండ్ అయిన అనంతరం బయటకు వస్తున్న కాంగ్రెస్ నేతలు రాజ్‌గోపాల్‌రెడ్డి, వీరయ్య, భట్టి విక్రమార్క, సీతక్క, శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** శాసనసభలో సీఎం ప్రసంగానికి అడ్డు తగిలినందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై శనివారం సస్పెన్షన్ వేటు పడింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు సీఎం కేసీఆర్ సమాధానం ఇచ్చేందుకు సిద్ధమవుతుండగా కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆయన ప్రసంగాన్ని అడ్డుకొనేందుకు ప్రయత్నించారు. కాంగ్రెస్‌కి చెందిన పీఏసీఎస్ చైర్మన్‌ను టీఆర్ఎస్ నేతలు కిడ్నాప్ చేశారంటూ ఆరోపించారు. దీంతో రాజగోపాల్‌రెడ్డితోపాటు మల్లు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తూర్పు జయప్రకాశ్‌రెడ్డి, పోడెం వీరయ్య, సీతక్కను ఒక రోజు సస్పెండ్ చేయాలంటూ సభా వ్యవహారాల మంత్రి ప్రశాంత్‌రెడ్డి ప్రతిపాదించిన తీర్మానాన్ని సభ ఆమోదించింది. ఆ వెంటనే వారు సస్పెండ్ అయినట్లు స్పీకర్ ప్రకటించారు. అంతకుముందు నల్లగొండ జిల్లాకు చెందిన పీఏసీఎస్ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నామినేషన్ వేయడానికి ప్రయత్నించినప్పుడు టీఆర్ఎస్ నాయకులు కిడ్నాప్ చేశారంటూ మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లేందుకు ఆయన విఫలయత్నం చేశారు. తనకు మైక్ ఇవ్వాలని స్పీకర్‌ను కోరగా తోసిపుచ్చారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు సమాధానం ఇవ్వాలని సీఎంని కోరారు. ముఖ్యమంత్రి లేచి మాట్లాడుతుండగా రాజగోపాల్‌రెడ్డి నల్లగొండ జిల్లా పీఏసీఎస్ చైర్మన్ వ్యవహారంపై గట్టిగా అరుస్తూ చెప్పే ప్రయత్నం చేశారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క కూడా రాజగోపాల్‌రెడ్డికి తోడుగా లేచి నిలబడ్డారు. అత్యవసర అంశాన్ని ప్రస్తావించేందుకు ఒక్కసారి తనకు అవకాశం ఇవ్వాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని పదేపదే కోరారు. సీఎం ప్రసంగంపై వివరణలకు సమయం ఇస్తామని స్పీకర్ చెప్పినా కాంగ్రెస్ సభ్యులు పట్టువీడలేదు. ఈ సమయంలో కోమటిరెడ్డి బిగ్గరగా అరుస్తూ ఏదో చెప్పబోతుంటే సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

### సభా నిబంధనలు తెలియవా..?: సీఎం

'అటు నలుగురే. ఇటు ఎంతమంది ఉన్నారో చూడండి. మీకంటే రెట్టింపు అరవగలం. సభా సంప్రదాయానికి కట్టుబడి ఉన్నాం. ప్రజాతీర్పును గౌరవించరు. వెళ్లాలంటే వెళ్లిపోండి. ఈ రాద్ధాంతం ఎందుకు? సభలో సభా నాయకుడు ప్రసంగిస్తున్నారనే సంస్కారం కూడా మీకు లేదు. సీఎం ప్రసంగం వినే ఓపిక కూడా మీకు లేదు.''అని కాంగ్రెస్ సభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని ఉద్దేశించి సీఎం కేసీఆర్ నిప్పులు చెరిగారు. సభలో సీఎం మాట్లాడేందుకు లేచినప్పుడు అడ్డుకోరాదనే సభా నిబంధనలు కూడా తెలియదా? లేక తెలిసే అడ్డుకోవాలని అనుకుంటున్నారా? ఇదేం పద్ధతి? సస్పెండ్ చేయాలంటూ సీఎం అనడంతో శాసనసభా వ్యవహారాల మంత్రి ప్రశాంత్‌రెడ్డి లేచి సస్పెన్షన్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీన్ని సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది.

# సీఎం.. ఏ ప్రాంతానికి?: రాజగోపాల్‌రెడ్డి

**ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడు: ఎర్రబెల్లి ■ అసెంబ్లీలో మంత్రి, ఎమ్మెల్యే మధ్య వాగ్యుద్ధం**



**సాక్షి, హైదరాబాద్:** శాసనసభలో శనివారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మధ్య తీవ్ర వాగ్యుద్ధం జరిగింది. ఒకదశలో సహనం కోల్పోయిన ఇరువురు నేతలు నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయిలో సవాలు, ప్రతిసవాళ్లు విసురుకున్నారు. సీఎం కేసీఆర్‌కు కాళేశ్వరంపై ఉన్న శ్రద్ధ పాలమూరు–రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులపై లేదని, ఆయన తెలంగాణకు ముఖ్యమంత్రా లేదా ఓ ప్రాంతానికా అనేది అర్థం కావడం లేదని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. మంత్రి ఎర్రబెల్లి జోక్యం చేసుకుని రాజగోపాల్‌రెడ్డి ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరింత అసహనానికి లోనైన రాజగోపాల్‌రెడ్డి తెలంగాణ ద్రోహులను తెచ్చి నెత్తిన పెట్టుకుంటే పరిస్థితి ఇలాగే ఉంటుందని ఎదురుదాడికి దిగారు. సీఎం కేసీఆర్ దర్శన భాగ్యం దొరకడం లేదని, మంత్రులు ఎవరెక్కడ ఉన్నారో తెలియడం లేదని ఆరోపించారు. దీంతో ఎర్రబెల్లి.. ఇలాగే మాట్లాడితే పరుగెత్తించి కొడతారంటూ రాజగోపాల్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు. గడచిన 13 నెలల నుంచి సీఎం దర్శనం దొరకడంలేదని రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు.

**వందమంది కౌరవులకు ఐదుగురు చాలు**

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ– 'తెలంగాణలో ప్రజాస్వామ్యం లేదు. శాసనసభలో వందమంది ఉన్నారని టీఆర్ఎస్ విర్రవీగుతోంది. వంద మంది కౌరవులను ఐదుగురు పాండవులు ఏం చేశారో గుర్తుంచుకోవాలి. డబ్బుతో రాజకీయాలను భ్రష్టు పట్టించారు. ప్రభుత్వం కార్పొరేట్ ఆస్పత్రులకు దాసోహమవుతూ.. ప్రభుత్వాస్పత్రులను నిర్వీర్యం చేస్తోంది. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఎర్రవెల్లి, గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో నిర్మిస్తే సరిపోతుందా?. ఇంటింటికీ నల్లానీరు రాకపోతే ఓట్లడగనని ఎన్నికల్లో హామీనిచ్చారు. ఆరేళ్లయినా నల్లా నీళ్లు రాలేదు. నా నియోజకవర్గంలో 14 నెలలైనా క్యాంపు ఆఫీసు నిర్మించలేదు. ఏ పనికీ ప్రభుత్వం బిల్లులు చెల్లించట్లేదు. పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలకు దోచిపెట్టేందుకే కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తోంది'అని ధ్వజమెత్తారు.

# సైగలతో సస్పెండ్ చేశారు..

- కంటిచూపుతో బయటకు వెళ్లగొట్టారు..
- పదవిలో కొనసాగే అర్హత కేటీఆర్‌కు లేదు..
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ధ్వజం
- దౌర్జన్యం రాజ్యమేలుతోంది: ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** 'తెలంగాణలో ప్రజాస్వామ్యం లేదు. శాంతి భద్రతలు అసలే లేవు. వేలిసైగలు, కంటిచూపుతో సభ నుంచి ప్రతిపక్షాన్ని బయటకు పంపించారు. తెలంగాణలో ప్రజాస్వామ్యం ఉరకలు పెడుతోందని ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగంలో చెప్పిం చారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఎలా ఉరకలు పెడుతోందో అసెంబ్లీ ద్వారా ప్రజలకు చెబుదామనుకుంటే మమ్మల్ని సభ నుంచి సస్పెండ్ చేశారు'అని రాష్ట్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. శనివారం అసెంబ్లీ నుంచి సస్పెం డైన అనంతరం పార్టీ ఎమ్మెల్యేలు డి.శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జగ్గారెడ్డి, సీతక్క, పొడెం వీరయ్యతో కలసి ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నామినేషన్ వేసేందుకు వెళ్లిన కాంగ్రెస్‌కు చెందిన మునుగోడు పీఏసీఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డిపై మంత్రి నిరంజన్‌రెడ్డి, ఆర్మూరు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి దౌర్జన్యం చేశారని భట్టి ఆరోపించారు. 150 మంది గూండాలను పెట్టుకుని శ్రీనివాస్‌రెడ్డి చేతిలో ఐడీ కార్డులు లాక్కుని, అసభ్య పదజాలంతో దూషించి, బట్టలు చించి, పిడిగుద్దులు గుద్ది నామినేషన్ వేయకుండా చేశారని ఆరోపించారు. ఈ విషయాన్ని సభలో చెప్పాలని ప్రయత్నిస్తే మైక్ ఇవ్వకుండా సస్పెండ్ చేశారన్నారు. సభా నాయకుడు సైగలు చేస్తే అసెంబ్లీ వ్యవహారాల మంత్రి సస్పెన్షన్ తీర్మానం ప్రవేశపెట్టారని, ఒక్క సభ్యుడి పేరుతో తీర్మానం ప్రవేశపెట్టి అందరినీ సస్పెండ్ చేశారని దుయ్యబట్టారు.

**నిజాలు బయటపడతాయనే భయంతోనే..**

ప్రతిపక్షం చెప్పే నిజాలు బయటకు వెళ్తే తమ బండారం బయటపడుతుందనే భయంతోనే టీఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ సభ్యులందరినీ సస్పెండ్ చేసిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. మున్సిపల్ మంత్రిగా, రెగ్యులటరీ అథారిటీ అధిపతిగా కేసీఆర్ కుమారుడు కేటీఆర్.. జీవో 111కి విరుద్ధంగా వ్యవహరించారని విమర్శించారు. అక్రమంగా సంపాదించిన సొమ్ముతో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో వందల, వేల ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, విలాసవంతమైన భవనాలు నిర్మించుకున్నారని ఆరోపించారు. కేటీఆర్‌కు మంత్రిగా కొనసాగే అర్హత లేదని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి శు. చతుర్దశి రా. 2.14, వరకు, తదుపరి పౌర్ణమి నక్షత్రం మఖ రా.3.40 వరకు (తెల్లవారితే సోమవారం), తదుపరి పుబ్బ, వర్జ్యం సా.4.19 నుంచి 5.50 వరకు, దుర్ముహూర్తం సా.4.29 నుంచి 5.17 వరకు, అమృతఘడియలు... లేవు.

సూర్యోదయం : 6.21
సూర్యాస్తమయం : 6.03
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు



### అవార్డ్

“ఇంటర్నేషనల్ ప్రెస్ ఇనిస్టిట్యూట్ గౌరవం దక్కినందుకు అభినందనలు తెలిపినవారందరికీ ధన్యవాదాలు. గత ఏడాది సుదీర్ఘ కాలం పాటు ప్రజాస్వామ్య దేశంలో సమాచార నిషేధం, ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడం వంటి సమస్యలను అధిగమించి మీకోసం కథనాలు అందించిన నా మీడియా సహచరులందరికీ ఈ అవార్డును అంకితం చేస్తున్నా”

– నిధి రజ్దాన్, జర్నలిస్ట్



### గుడ్ బై

“హఠాత్తుగా నా చెల్లెలు చనిపోతే ఎలా ఏడవాలో నాకెవరూ చెప్పలేదు. కేవలం 36 ఏళ్లు, ఎటువంటి జబ్బూ లేదు. బీపీ కూడా లేదు. ఆమె డాక్టర్ కూడా. హఠాత్తుగా బ్రెయిన్ హెమరేజ్‌తో నిశ్శబ్దంగా వెళ్లిపోయింది. ఎటువంటి గుడ్ బైలు కూడా లేవు. కుటుంబంలోని ప్రతి ఒక్కరి గుండెను ఎవరో బయటకు తీసి పిండేసినట్టుగా ఉంది”

– స్వాతి ఎస్ మాలిక్, లాయర్



### హోలీ

“నేను బాల్యంనుంచే హోలీ ఆడటం మానేశాను. ఎందుకంటే 6–13ఏళ్ల మధ్య పండగల్లో పాల్గొన్నప్పుడే నాపట్ల కొందరు అసభ్యంగా ప్రవర్తించేవారు. అందుకే ఇప్పటికీ 'హోలీ హై' అనే మాట నాకు యుద్ధారావంగా ధ్వనిస్తుంది. ఇష్టానుసారం నాపై దాడి చేయడానికి, అయినా ఎలాంటి పర్యవసానాలు లేకుండా తప్పించుకోవడానికి కొందరికి ఆ పండగ ఒక సాకు”

– శాచీ నెల్లి, ఫెమినిస్ట్



### మంచి రోజు

“ఈ రోజు ఎంత మంచి రోజు. ఢిల్లీ అల్లర్ల కారణంగా మరణాలు, విధ్వంసం అంతా అలుముకున్న వేళ, తమ ఇళ్లు కోల్పోయి, ముస్తాఫాబాద్ పునరావాస కేంద్రంలో ఉంటున్న పిల్లలు ఎంతో ప్రేమతో, వెలుగుతో చేరువయ్యారు. వాళ్లందరికీ సంతోషకరమైన, సురక్షితమైన భవిష్యత్ లభించాలని కోరుకుంటున్నా”

– జెబా వర్సి, జర్నలిస్ట్



### రక్షణ

“ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడైనా చూశారా? తమ ప్రజాస్వామిక హక్కయిన నిరసనను ప్రకటించినందుకు సామాన్య పౌరుల పేర్లు, చిరునామాలు, ఫోన్ నెంబర్లు ఇలా బహిరంగంగా ప్రదర్శించి వారి రక్షణకు గండికొట్టే చర్యను ఏమనాలి?”

– సానియా అహ్మద్, రచయిత



### కలయిక

“యునిసెఫ్ బాలల హక్కుల రాయబారిగా ఉన్న ప్రియాంకా చోప్రా పునరావాస కేంద్రాల్లో పిల్లలను కలిసిందా? ఢిల్లీ అల్లర్లలో తమవారిని కోల్పోయిన కుటుంబాలను పరామర్శించిందా? లేదు, కనీసం ఫొటోలకు ఫోజులివ్వడానికి కూడా ఆ పని చేయలేదు”

– అహోనా సేన్ గుప్తా, జర్నలిస్ట్

# తీరు మార్చిన పోరు

విశ్లేషణ



మనోబినా గుప్తా

మొట్టమొదటగా నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురించి మాట్లాడుకునే ముందు ఈ దేశంలో నిరసనలు తీసుకొచ్చిన సరికొత్త మార్పు పట్ల పండుగ చేసుకోవలసిందే. ఒకవైపు ప్రధాని నరేంద్ర మోదీ మహిళలకు స్ఫూర్తి కలిగించడానికి తన సోషల్ మీడియా ఖాతాలను మార్చి 8న మహిళలకు అప్పగించేస్తానని ప్రకటించారు. కానీ అదే సమయంలో ఈ దేశంలో మహిళలు తమ మనుగడ హక్కుకోసం తీవ్రమైన పోరాటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇన్ని దశాబ్దాల తర్వాత దేశ చరిత్రలో మహిళలు నిరసన ప్రదర్శనలకు తీసుకొచ్చిన వినూత్న మార్పును

తమ మనుగడ కోసం జరుపుతున్న పోరాటంలో, మహిళలకు, పురుషులకు ప్రత్యేక ప్రపంచాలూ, రంగాలూ అంటూ ఏవీ ఉండవు. మీ కాళ్ల కింది భూమి కదలడం ప్రారంభించినప్పుడు మీ సమస్య పరిష్కారం కోసం అసాధారణంగా మీరు అడుగులు వేస్తారు, సాహసిస్తారు కూడా. కోల్‌కతాలోని పార్క్ సర్కస్ మైదాన్‌లో నిరసన తెలుపుతున్న జమిల్ అనే మహిళ కవితా పంజాబీతో ఇదే విషయం హృద్యంగా చెప్పారు. అదేమిటంటే.. ''ఒక గృహిణి ఇంటి బయటకు వచ్చిందంటే అసాధారణమైనది జరిగి ఉంటుంది. నిజంగానే భయంకరమైన ఘటన జరిగి ఉంటుంది. హిందూస్తాన్ అనే గొప్ప దేశం, ఘనమైన హిందూస్తాన్ మట్టి ఇప్పుడు మమ్మల్ని సైగ చేసి పిలుస్తున్నాయి'' విశేషం ఏమిటంటే జమిల్ తన కుటుంబంలోని 18 మంది సభ్యులను వీధుల్లోకి లాక్కొచ్చింది.

**చరిత్రలో తొలిసారి మహిళలు వీధుల్నే ఇళ్లుగా మార్చుకున్నారు. ఇంట్లో పిల్లలను చూసుకోవడం, నిరసనల్లో పాల్గొంటున్న తమ మహిళలకు ఆహారం అందించడం వంటి పనులు పురుషులు స్వీకరించారు.**

మనం మనస్ఫూర్తిగా స్వాగతించాలి.

సాధారణంగా ఇల్లు, ప్రపంచం రెండూ పూర్తిగా భిన్నమైన విషయాలుగా చూడటం పరిపాటిగా మారింది. ఇలాంటి వర్ణనల మధ్యే మహిళలపై గృహిణులు అనే ముద్రపడింది. అదేసమయంలో పురుషులు బయటి ప్రపంచాన్ని తమ స్థావరంగా చేసుకున్నారు. ఇటీవల నూతన పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చిన వేలాది మంది మహిళలు (వారిలో చాలా మంది గృహిణులు) తమపై ఈ తరహా భిన్నమైన సరిహద్దులకు సంబంధించిన ముద్రలను తోసిపడేశారు. ఇటీవలి చరిత్రలో మొట్టమొదటిసారిగా మహిళలు వీధులనే తమ ఇళ్లుగా మార్చుకున్నారు. గత రెండునెలలుగా ఢిల్లీలోని షహీన్‌బాగ్ వీధుల్లో మహిళా నిరసనకారులు (తల్లులు, అమ్మమ్మలు కూడా) కొలువుతీరి ఉంటున్నారు. అలాగే కోల్‌కతాలోని పార్క్ సర్కస్ మైదానంలోనూ మహిళలు నెల రోజులకంటే పైగా కొలువుతీరి సీఏఏకి వ్యతిరేకంగా ప్రదర్శనలు చేస్తున్నారు. దేశంలో చాలా చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది.

ఇంటి నుంచి ప్రపంచంలోకి రావడం అనేది ఈ సందర్భంలో అత్యంత సహజమైనది. నూతన పౌరసత్వ సవరణ చట్టం వల్ల దేశంలో తమకు నివాసమే లేకుండా పోవడం, స్వేచ్ఛను కోల్పోయి తిరిగి బానిసత్వ స్థితిలోకి వెళతామేమో అన్న భీతి కారణంగా మహిళలు చేస్తున్న కొత్తతరహా ప్రదర్శనలు స్వతంత్ర భారత చరిత్రలో మనమెన్నడూ చూసి ఉండలేదు. పార్క్ సర్కస్ మైదానంలోని దృశ్యాలను మీరు చూసినట్లయితే మహిళలు ఇళ్లు వదిలిపెట్టి అంత దూరం ఎందుకు వచ్చారో స్పష్టమవుతుంది. రాత్రి పూట కూడా ఇంటికి పోకుండా వారు అక్కడే కూర్చుని ఉన్నారు. వారితోపాటు కాలేజీ విద్యార్థినులు, టీచర్లు కూడా ఉన్నారు.

ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఇలాంటి మహిళలకే చెందుతుంది. నిన్నటివరకు వీరు రాజకీయ వ్యవస్థ, పితృస్వామిక కుటుంబం, సామాజిక చట్రాల వెనుక మరుగున పడి ఉన్నారు. దశాబ్ది కాలంగా మహిళా సంస్థలు పార్లమెంటులో, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ రాజకీయ




వర్గాలపై ఒత్తిడి తీసుకొచ్చినప్పటికీ వారి ప్రయత్నాలు ఫలించలేదు. చివరకు బిల్లుకు మద్దతు పలికినవారు కూడా పైపైనే తమ సమ్మతి తెలపడం గమనార్హం. అదే సమయంలో ఓబీసీలకు కోటాను గ్యారంటీ చేస్తూ తెచ్చిన చట్టాలు ఏమాత్రం అవరోధం లేకుండానే ఆమోదం పొందాయి. అయిదేళ్ల క్రితం కేంద్రంలో భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన బీజేపీ మహిళా రిజర్వేషన్ బిల్లుపై కనీసం ప్రస్తావన కూడా చేయలేకపోయింది.

రాజకీయవర్గాలు ఉద్దేశపూర్వకంగా లేక అనుద్దేశపూర్వకంగా బహిరంగ రాజకీయ వాతావరణంలోకి మహిళలు ప్రవేశించడాన్ని మినహాయించాయి. కాగా పౌరసత్వ సవరణ చట్టం, ఆ బిల్లు అమలు క్రమాన్ని గురించి, జాతీయ పౌర పట్టిక అమలు గురించి హోం మంత్రి పదే పదే నొక్కి చెప్పడం వల్ల రాజకీయవర్గాల పథకం విఫలమైపోయింది. ఉన్నట్లుండి మహిళలు అన్నిరకాల బహిరంగ ప్రదేశాల్లో కనిపించడం మొదలైపోయింది. మహిళలు ఇలా వినూత్నంగా తమది కాని స్థలంలో కనిపించడం, ప్రత్యేకించి ముస్లిం మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు రావడం అనేది ఇతర మతాలకు సంబంధించిన మహిళలను కూడా ఆకర్షించింది. ఇదే ఈ ఏడాది మార్చి 8కి ఒక కొత్త రాజకీయ, సామాజిక, జెండర్ పరమైన చలనశీలతను ఆపాదించింది. బయటి ప్రపంచాన్ని కౌగిలించుకోవడం ద్వారా మహిళలు తమ ఇళ్లను రక్షించుకుంటున్నారు. పౌరసత్వ సవరణ చట్టానికి తదితర చట్టాలకు వ్యతిరేకంగా సహజసిద్ధంగా మహిళలు వెల్లువెత్తడం, పోరాటంలో పట్టు సడలించకుండా కృతనిశ్చయాన్ని వ్యక్తపర్చడం అనేవి రాజకీయ పార్టీల ఉద్యమాలకు పూర్తి భిన్నంగా సాగడం విశేషం. రాజకీయ పార్టీల జన సమీకరణలు పూర్తిగా పురుషులతో నిండి ఉండగా మహిళలే తమ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నారు.

అందుకే ఇది ఉద్యమాలకు సంబంధించి అత్యంత సహజమైన మార్పును ప్రతిబింబిస్తోంది. ఇది కేవలం మహిళల స్థానానికి సంబంధించిన పరివర్తనగానే కాకుండా ఇళ్లలో జెండర్ పరమైన పాత్రలు తారుమారు కావడం కూడా చూడవచ్చు. మహిళలు చాలామంది నిరసనల్లో పాల్గొంటుండగా పురుషులు మాత్రం తమ పిల్లలను చూసుకుంటూ ఇళ్ల వద్దే ఉండిపోయారు. పైగా నిరసన కార్యక్రమాల్లో ఉన్న తమ మహిళలకు ఆహారాన్ని సరఫరా చేయడం, అక్కడి స్థలాలను నిత్యం శుభ్రపర్చే బాధ్యతను కూడా పురుషులు తీసుకున్నారు.

మార్చి 8 చారిత్రక మూలాలను తిరిగి స్మరించుకుంటున్న వేళ ఇది చక్కటి మార్పు. ఈ మార్పుకు మొదటగా 1908లో న్యూయార్క్ నగరంలో తొలి బీజం పడింది. ఆరోజు వేలాది మంది వస్త్రపరిశ్రమల్లోని కార్మికులు అధిక వేతనాలు, మెరుగైన పరిస్థితులను డిమాండ్ చేస్తూ వీధుల్లోకి వచ్చారు. కానీ అలాంటి చరిత్రాత్మక ఘటనలు సాధారణ వ్యవహారాలుగా మిగిలిపోతాయి. ఆ ఉద్యమాల సారాంశం మరుగునపడి వాటిపేరుతో జరిగే వేడుకలు లాభాలను తెచ్చిపెట్టే మార్కెట్ ప్రేరేపిత ప్రాజెక్టులుగా మారిపోతాయి. ఇలాంటి ఘటనల వెనుక ఉన్న చరిత్రను వినియోగదారులు మర్చిపోతారు. మార్చి 8 వేడుకలు కూడా సంప్రదాయబద్ధంగా జరిగే అలాంటి సందర్భాల్లో ఒకటిగా మారిపోయాయి. మహిళలు స్ఫూర్తి పొందడానికి తన సోషల్ మీడియా ఖాతాలను ఈరోజు వారికే అప్పగిస్తానని ప్రధాని మోదీ చెప్పారు. కానీ ఇప్పుడు స్ఫూర్తి పొందుతున్న మహిళలు గజగజలాడించే చలిలో, చలిగాలుల్లో కూడా సాహసించి ఇంటి బయటకు వచ్చారనేది మరవరాదు. తమ అస్తిత్వ హక్కు కోసం వారు పోరాడుతున్నారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు, రచయిత

---

# ఒక ఆకాంక్ష ఒక విలువ

సందర్భం



కాత్యాయనీ విద్మహే

1910 నుండి మార్చి 8 అంటే అంతర్జాతీయంగా స్త్రీల సామాజిక సామూహిక శక్తికి సంకేతం. మహిళల అస్తిత్వం, వ్యక్తిత్వం, ఆకాంక్షలు, విజయాలు ఏ స్థాయికి చేరాయో చూసుకొని వాటికి అవరోధంగా ఉన్న సమస్త అధికార శక్తుల నుండి విముక్తికి పునరంకితం కావటానికి కావలసిన ఉత్సాహ శక్తిని పుంజుకొనవలసిన సందర్భం ఇది.

స్త్రీ పురుషులు సంఖ్యలోనే కాదు, శక్తిసామర్థ్యాలలో, అవకాశాలలో, అభివృద్ధిలో, నిర్ణయాలలో, నిర్మాణంలో సమానంగా ఉండే ప్రపంచం నిస్సందేహంగా శక్తిమంతమైన ప్రపంచమే. అయితే అలాంటి ప్రపంచాన్ని నిర్మించుకొనటం ఆకాంక్షగా, ఆదర్శంగా మిగిలిపోతున్నదే తప్ప ఆచరణ వాస్తవం కావటంలేదు. ఎందువల్ల? భారతదేశంలోనైతే స్వాతంత్ర్యం వచ్చిన పాతికేళ్లకే స్త్రీ పురుష సమానత్వం సాధించబడలేదన్న ఎరుక కలిగింది కదా! సమానత్వ దిశగా తొలి అడుగులు మాత్రమే పడుతున్నాయి అని అనుకున్న (Towards equality report) 50 ఏళ్ళ తరువాత వెనుదిరిగి చూస్తే ఆ అడుగులు సాగిన జాడ లేక అక్కడే కూరుకు పోయాయా ఏమిటి? అని ఆందోళన కలగక మానదు. ఇది మనదేశపు స్థితే కాదు. సాపేక్షంగా చూస్తే చాలా దేశాలు మనకన్నా పైస్థాయిలో ఉండవచ్చు కానీ ప్రపంచమంతటా ప్రజాస్వామ్యాన్ని, శాస్త్ర సాంకేతిక రంగాలలో సాధించిన అభివృద్ధిని హేళన చేస్తూ స్త్రీపురుష అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయి. అందువల్లనే ప్రతి ఒక్కరూ సమానత్వం కోసం అని ఈ మార్చి 8న మళ్ళీ పిలుపును ఇయ్యవలసిన అంతర్జాతీయ అక్కర వచ్చింది. స్త్రీల హక్కులను వాస్తవానుభవంలోకి తేవటంగురించి నొక్కి చెప్పాల్సి వచ్చింది. మహిళా సాధికారత అనే భావనను ముందుకు తెచ్చిన బీజింగ్ సదస్సు జరిగిన పాతికేళ్ల తరువాత పరిస్థితి ఇది.

ఆడపిల్లను పుట్టకుండానే ఆపివేసే లింగనిర్ధారణ పరీక్షలు, గర్భస్థ శిశుహత్యలు చట్ట ప్రకారం నేరమే అయినా ఈ రోజున అది వైద్యరంగంలో కోట్లాది రూపాయల అక్రమ వ్యాపారం అయిపోయింది. విద్యాఉద్యోగాలలో 33 శాతం స్త్రీల ప్రాతినిధ్యం చట్టబద్ధంగా అమలవుతున్నది, స్త్రీలు సాఫ్ట్ వేర్ రంగంలో సైతం ప్రతిభను చాటుకుంటున్నారు, కంపెనీ సీఈఓలుగా అత్యున్నత స్థాయికి ఎదిగారు అని మురిసినంత సేపు పట్టదు ఈ నాటికీ హైస్కూల్ స్థాయి విద్యలో అర్ధంతరంగా చదువులు ఆపేసి వెళ్తున్న ఆడపిల్లలు 63.5 శాతం (2015) ఉన్నారని తెలిసి దిగులు పడటానికి. పేదరికము, తాగివచ్చి తండ్రి ఇంట్లో చేసే యాగీ, బడిలో టాయిలెట్ వంటి వసతులు లేకపోవటం, పెళ్లిచేసి పంపియ్యాలన్న తొందర.. కారణాలు ఏమైతేనేమి వీళ్లంతా విద్యాఉద్యోగ అవకాశాలకు దూరం చెయ్యబడుతున్నవారే. పెద్దపెద్ద ప్రాజెక్టుల వల్ల, ప్రత్యేకఆర్థిక మండలుల వల్ల అటవీ వనరుల మీద, భూముల మీద హక్కులు, జీవనోపాధిమార్గాలు, ఆహారభద్రత కోల్పోతున్నారు అనే కమంది మహిళలు.

అదే 33 శాతం ప్రాతినిధ్యం పంచాయతీ రాజ్ వ్యవస్థలో వుంది కనుక స్త్రీలు కిందిస్థాయిలో రాజకీయ భాగస్వామ్యాన్ని అయితే పొందుతున్నారు గానీ స్వతంత్రంగా ఎంతవరకు పనిచెయ్యగలుగుతున్నారు అంటే మిగిలేది నిరాశే. చట్టసభలలో స్త్రీల రిజర్వేషన్ బిల్లు ఎప్పుడో తుంగలో తొక్కేశాం. ఇప్పుడు రాజకీయరంగంలో ఉన్న స్త్రీలకు కూడా ప్రోత్సాహకరమైన వాతావరణం ఏమీ లేదని 2019 ఎన్నికల సందర్భంగా 95 మంది మహిళా రాజకీయనాయకులపై మిలియన్‌కు పైగా ట్విట్టర్ మొదలైన మాధ్యమాలలో అసభ్యంగా, అవమానకరంగా–వాళ్ళ శరీరాన్ని, రంగును, దుస్తులను, కులాన్ని హీనపరుస్తూ వచ్చిన ట్రోలింగుల గురించి ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ విడుదల చేసిన నివేదిక చెప్తున్నది. ఇక మహిళా సాధికారత ఎక్కడ ?

ఇళ్ల దగ్గర నుండి వసతి గృహాల వరకు ఆడపిల్లలను లైంగిక అవసరాలకు వాడుకొనే వికృతి వ్యాపించింది. అత్యాచారం, అక్రమ రవాణా, హత్య సాధారణ విషయాలు అయిపోయాయి. తాగుడు, మాదకద్రవ్యాల వినియోగం ఈ నేరాలకు తక్షణ కారణాలైతే, స్త్రీలను లైంగిక వస్తువుగా తప్ప చూడలేని మానసిక వికృతిని మప్పిన సినిమాలు, అశ్లీల చిత్రాలు వాటికి మరింత బలం చేకూర్చేవి. స్త్రీపట్ల మగవాడి దృష్టిని ఈ విధంగా నిర్మిస్తూ వచ్చిన తరతరాల పితృస్వామిక అధికార సంస్కృతిది అసలు నేరమంతా.. ఈ అన్ని నేరాలను పట్టించుకోకుండా స్త్రీల కట్టుబొట్టు వ్యవహార సరళి పురుషులను రెచ్చగొట్టేవిగా ఉండటమే స్త్రీలపై అత్యాచారాలకు కారణమంటూ బాధితులనే నేరస్తులుగా చేసే రాజకీయం ఈనాడు కొనసాగుతున్నది. వీటిని వేటినీ ప్రశ్నించకుండా, సంస్కరించకుండా 'ప్రతిఒక్కరూ సమానత్వం కోసం' అనే మాటకు అర్థం ఉంటుందా? మంత్రాలకు చింతకాయలే రాలవు అని మనకు తెలిసిందే. మరి సమానత్వం ఎలా సాధ్యం? సాధ్యం కాదని ఈనాడు స్త్రీలు గ్రహిస్తున్నారు. కుటుంబం, కులం,మతం, సంపద, సంస్కృతి, రాజ్యం వంటి సంస్థల వర్గ వర్ణ లింగ పాక్షిక దృష్టి స్త్రీల సమానతకు ఎప్పుడూ అవరోధమే అని వాళ్లకు తెలుసు. అందువల్లనే వాళ్ళు ఈ నాడు పోరాటశక్తులుగా ఎదుగుతున్నారు. విస్తరిస్తున్నారు.



ఈ పాక్షిక దృష్టి సగభాగమైన స్త్రీలను నిర్వీర్యం చేయటంవల్ల సమాజాన్ని పక్షవాతానికి గురిచేస్తుందని గుర్తుచేస్తున్నారు. తక్షణ పరిష్కారాలతో నేరాలను అరికట్టలేము, నేర కారణాల నిర్మూలనపై దృష్టిపెట్టవలసిన అవసరాన్ని నొక్కి చెబుతున్నారు. నేరరహిత సమాజంతో ముడిపడి స్త్రీల హక్కులు అనుభవ వాస్తవం అవుతుందని నమ్ముతున్నారు. అందుకే ఈనాడు స్త్రీలు తమ హక్కుల కోసం, అవకాశం కోసం మాట్లాడుతున్నదానికంటే ఎక్కువగా తమలాగే హక్కులు అవకాశాలు కోల్పోతున్న దళిత ఆదివాసీ మైనారిటీ మత సమూహాలకోసం మాట్లాడుతున్నారు. అట్లా మాట్లాడటం, వాళ్ళ పక్షాన పనిచేయటం అసమానతలు లేని ఒక మానవీయ సమాజ నిర్మాణం కోసమే. స్త్రీలంటే తల్లులు కదా! బిడ్డలైనా, సమాజమైనా, దేశమైనా పాడై పోతుంటే వూరికే ఉండలేరు. అట్లా ఉండకపోవటం కుటుంబంలో అయితే అవిధేయత. సమాజంలో అయితే బరితెగించటం. రాజ్యం దృష్టిలో అయితే ద్రోహం. అందుకు ఫలితం బహిష్కరణలు లేదా జైళ్లు. అయినా 'ప్రతి ఒక్కరూ సమానత్వం కోసం' ఆలోచించే సంస్కారాన్ని పెంచుకొనే దిశలో మానవీకరించబడటం కోసం స్త్రీలు అందుకు సిద్ధమవుతున్నారు. షాహిన్ బాగ్ దానికి ఒక సంకేతం. వేలాది లక్షలాదిమంది ముస్లిం మహిళలు ఒక సమానత్వ విలువ కోసం వీధుల్లోకి వచ్చారు. ఐదారేళ్ళ పిల్లలనుండి అరవై ఏళ్ళు పైబడిన వాళ్ళు కూడా ఆజాదీ అని గొంతెత్తి నినదిస్తున్నారు. ఆ ఆకాంక్ష , ఆ విలువ మొత్తం సమాజాన్నీ ఉన్నతీకరించే దిశగా స్త్రీలను మరింత సంఘటితం చేస్తుంది అన్న ఆశ కలుగుతున్నది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత్రి, కాకతీయ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్

---

# నిజమైన వారసులు

అభిప్రాయం



దేవి

'నేను సమానత్వపు తరం. స్త్రీల హక్కులను గుర్తించాలి' అని ఐక్యరాజ్య సమితి మహిళా విభాగం ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పిలుపునిచ్చింది. అందరూ కోరుకుంటున్న సమానత్వం విరాజిల్లే ప్రపంచం నిర్మించడానికి వయస్సు, జాతి, వర్ణ, మత, లింగ తేడాల్లేకుండా అందరూ సమానత్వం వైపే సాగే చర్యలు చేపట్టాలని దాని సారాంశం. సమానత్వం భావన ఎంత వెనుకబడిన వారిలో కూడా ఇంతో అంతో చేరింది. మరెందుకు తాము సమానం అని భావించలేకపోతున్నారు. స్త్రీలే కాదు. వివక్షకు గురవుతున్న సమూహాలన్నీ తమనితాము వంచితులుగానే భావించడానికి కారణం ఏమిటో దేశాధినేతలు విధానకర్తలు ఒకసారి పరికించి చూడాల్సి ఉంది. బీజింగ్ కార్యాచరణ ప్రణాళిక ప్రకటించి 25 సంవత్సరాలు గడిచాక దానిపై సంతకం చేసిన దేశాలు.. సమానత్వ సూచికలో ఎక్కడుంటున్నారో సమీక్షించాలి. ఒకే పనికి ఒకే రకం అయిన వేతనం.. వేతనంలో తేడాను ఆపాలనే అతి చిన్న డిమాండ్ కూడా పూర్తికాలేదు. 34 శాతం మన దేశంలో వేతన వ్యత్యాసం ఇంకా కొనసాగుతున్నది. పైగా ఓట్ల రద్దు తరువాయి ఆర్థికమాంద్యం వలన కోల్పోయిన 3 కోట్ల 60 లక్షల ఉద్యోగాల్లో అత్యధికంగా మహిళలే ఉన్నారు. దాదాపు 50–60 శాతం వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత వృత్తుల్లో ఉన్న మహిళలు దరిద్రంలోకి నెట్టివేయబడుతున్నారు. మహిళల్ని రైతులుగా గుర్తించాలనే కోరిక కూడా ఎవరి చెవికీ ఎక్కడం లేదు.

చిన్న చిన్న పన్నెండు పనులు చేస్తే సమానత్వం వైపు సాగవచ్చని ఆశపడుతున్నది యూఎన్ మహిళ. దానిలో మొదటిది స్త్రీల పనిని.. ఇంటిపని, వంటపని, పిల్లల పెంపకం, వృద్ధుల సేవ వంటి గుర్తింపునోచని వేతనం లేని చాకిరీని పంచుకోమని సూచిస్తున్నది. ఇది ఇంట్లో వాళ్లు పంచుకుని చేయటం ఒక తాత్కాలిక పరిష్కారం కాని ఈ చాకిరీని సమాజపరం చేయటం దీర్ఘకాలిక పరిష్కారం. అంటే ఇంటి పనిని తేలిక చేసే పరికరాలు కొనుగోలు చేసే శక్తి కలిగిఉండటం, వంటపని, పని ప్రదేశాలకు తరలించడం (ఉదయం మధ్యాహ్న భోజనాలు పని దగ్గరే లభించేలా చేయటం) పిల్లలకు శిశు సంరక్షణాలయాలు (కేర్ సెంటర్లు) ఇంటి దగ్గర, పని ప్రదేశాల్లో అందుబాటులో ఉండటం...

ఇక పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, అత్యాచారాల వ్యవహారానికి వస్తే 'మీ టూ' వల్ల ప్రముఖ హాలీవుడ్ నిర్మాత అత్యాచారాలకు పాల్పడ్డాడని రుజువై, 25 సంవత్సరాల శిక్షకు సిద్ధపడుతున్నాడు. ఇంత కాలం ఎందుకు బాధితులు మౌనంగా ఉన్నారు.. అనే సవాలును కోర్టు కొట్టి పారేసింది. వారి ఉపాధి దెబ్బతింటుందనే భయంతోపాటు ఇతని బలం పట్టు సినీ పరిశ్రమపై ఉండటమే వారు ఫిర్యాదు చేయకపోవడానికి కారణంగా భావించింది. అయితే గుజరాత్‌లో ఒక కళాశాలలోని 63 మంది విద్యార్థినులను లోదుస్తులు విప్పించి వారు రుతుక్రమంలో ఉన్నారా లేదా అని పరీక్షించినవాళ్లు, నర్సు ఉద్యోగాల కోసం వెళ్లిన మహిళల్ని అమానుషమైన రెండు వేళ్ల పరీక్షతో కన్యత్వం, గర్భధారణ నిర్ధారించిన ప్రభుత్వ అధికారుల్ని మందలించిన దాఖలాలు లేవు. అన్ని ప్రభుత్వ శాఖల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఉండాలనే నియమం తప్పనిసరి అనికూడా చాలామంది అధికారులకు తెలియదు. భాషలోగానీ, భావాల్లోగానీ వివక్ష తగ్గుతున్న దాఖలాలు మన దేశంలో పెద్దగా కనపడటం లేదు. జెండర్ సమానత్వ సూచికలో మొదటి స్థానంలో ఉన్న నార్వే మాత్రం మరో అడుగు ముందుకేసింది. భార్యాభర్తలిద్దరికీ 7 నెలల ప్రసూతి సెలవు పూర్తి జీతంతో సహా ఇచ్చేందుకు చట్టం చేసింది. మన దేశంలో ఆసుపత్రిలో ప్రసవాలు జరగాలనే నియమం కూడా 13 నుండి 39 శాతం కేసుల్లో (రాష్ట్రాలవారీ తేడా ఉంది) జరగటం లేదు. అమ్మాయిలకు వారి విలువ తెలియజేయాలనే ప్రయత్నాలు ఎప్పటినుంచో జరుగుతున్నాయి. మహిళా ఉద్యమాలు, స్వచ్ఛంద సంస్థలు దీనిపై నిరంతరాయంగా ప్రచారం చేస్తున్నాయి. కానీ 0–6 సంవత్సరాల వయస్సులో ప్రతి వెయ్యిమంది మగపిల్లలకు 898 మందే సగటున ఉన్నప్పుడు అమ్మాయిల విలువను దేశం గుర్తించిందా అనే ప్రశ్న అవసరం అవుతుంది. ఇప్పటికీ 18 ఏళ్లలోపు జరుగుతున్న వివాహాలు 39 శాతం ఉంటే 'బేటీ బచావో' చట్టాలు ఎక్కడ ముక్కు మూసుకున్నాయో తెలియదు. కనీసపక్షంగా ప్రధాన మీడియాలో 'మూస'ల్ని ప్రశ్నించడం కూడా లేదు. అదే 'ఛాతీ లెక్కలు' అవే గాజులు తొడిగించుకోలేదు అనే కించపరిచే పదాలు మగతనపు వైభవాన్ని, స్త్రీత్వపు బలహీనతల్ని చాటే చిత్రాలు, దృశ్యాలుగా మనోఫలకాలపై ముద్ర వేస్తుంటే అమ్మాయిల ఆత్మగౌరవం ఎలా పెరుగుతుంది. గతంకంటే చదువుకుంటున్న, ఉద్యోగాలు చేస్తున్న అమ్మాయిల సంఖ్య గణనీయంగా పెరిగింది కానీ 2020కి పెరగాల్సిన మోతాదులో ఉందా? బడి, బహిరంగ ప్రదేశాలు, పని ప్రదేశాలు, కనీసపక్షంగా ఇల్లు అయినా అమ్మాయిలకు సురక్షిత ప్రదేశంగా భావించే స్థితి ఉందా?

తమ కనీస పౌరహక్కులు కలిగి ఉండటం తమ హక్కు అని పూర్తి శాంతియుతంగా రోడ్లపైకి వచ్చిన యువతరం, మహిళలు, మైనారిటీలు, దళితులు దేశద్రోహులయ్యారు. రాజ్యాంగంపట్ల, ప్రజాస్వామ్యంపట్ల ఏ మాత్రం గౌరవం లేని పాలన ప్రభుత్వ సంస్థల్ని, న్యాయాలయాల్ని, పోలీసు యంత్రాంగాన్ని విభజించిపడేసింది. ఈ మొత్తం కల్లోలాలకు మొదటి సమిధలు మళ్లీ స్త్రీలు, పిల్లలే. ఒక వర్గం స్త్రీలను అత్యాచారం చేయొచ్చు, చంపొచ్చు అనే భావన ఏర్పడేంతగా విద్వేష ప్రచారం నడుస్తున్నది. కానీ ఎంత విభజించినా ఈ దేశ మత సామరస్యపు అల్లిక ఇంకా మిగిలే ఉందని నిరూపించిన ఢిల్లీ దాడులు.. చట్టబద్ధమైన హక్కులు పార్లమెంటులో ప్రవేశం ఇవ్వకపోతే వీధుల్లోనయినా సాధిస్తాం అన్న షహీన్‌బాగ్‌లు, మతపెద్దల సంకెళ్లను బద్దలుకొట్టిన మైనారిటీ మహిళలు, యువతరం బాధ్యతగానే కాదు, జాగరూకతగా ఉందని చాటి చెబుతున్న అసంఖ్యాక విద్యార్థినీ విద్యార్థులు.. సమానత్వం సైన్యంలో కూడా సాధిస్తాం అంటూ కోర్టుకీడ్చి గెల్చిన మిలటరీ మహిళలు.. వీళ్ల అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి నిజమైన వారసులు, స్ఫూర్తిప్రదాతలు.

వ్యాసకర్త సాంస్కృతిక కార్యకర్త

---

# సమానత్వం.. ఎక్కడ?



మహిళా దినోత్సవం రోజున మాత్రమే ప్రశంసల పూల జల్లు కురవడం, మిగిలిన రోజుల్లో ద్వితీయ శ్రేణి పౌరులుగానే నిరాదరణకు గురవడం మహిళలకు అలవాటైపోయింది. మన దేశంలో మాత్రమే కాదు...ప్రపంచమంతటా ఇదే స్థితి. సమానహక్కులు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి తప్ప ఆచరణ రూపం దాల్చటం లేదు. ప్రాచీనకాలం నుంచి ఇప్పటివరకూ సమాజం ఎదగడానికి జరిగిన, జరుగుతున్న ఉద్యమాల్లో, పోరాటాల్లో మహిళలు చురుగ్గా పాల్గొంటున్నారు. చరిత్ర సృష్టిస్తున్నారు. అయినా మహిళల భద్రత ఇప్పటికీ డేంజర్ జోన్‌లోనే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. మహిళలను అభద్రతా భావనలో ఉంచడం ప్రపంచ మనుగడకు కూడా ముప్పు కలిగిస్తుందన్న సంగతిని సమాజం గ్రహించలేకపోతోంది. సాంకేతికత విస్తరించిన వర్తమానంలో మహిళలపై వేధింపులు మరింత పెరిగాయి. సామాజిక మాధ్యమాల్లో మహిళలను కించపరిచేలా పోస్టులు పెట్టడం, వారిని కేవలం భోగ వస్తువుగా పరిగణించే ఫొటోలు, వీడియోలు పెట్టడం వంటివి మహిళల భద్రతను మరింత ప్రమాదంలో పడేస్తున్నాయి. అత్యాచార సంస్కృతిని పెంచి పోషిస్తున్నాయి. మహిళలకు భారత్ అత్యంత ప్రమాదకరమైన దేశమని 2018లో థామ్సన్ రాయిటర్స్ సర్వే తేల్చింది. 'యత్ర నార్యస్తు పూజ్యంతే...'అని గొప్పగా చెప్పే దేశానికి ఇంతకన్నా అవమానకరమైనది ఉంటుందా? పురుషాధిక్య సమాజం మహిళలకు అందం, అణకువ, పరువు, శీలం, పాతివ్రత్యం...ఇవే ఆభరణాలని నూరిపోస్తోంది. వారు ఆత్మవిశ్వాసంతో ఎదగకుండా అనేక అవరోధాలు కల్పిస్తోంది.

తెలంగాణలో మహిళల పరిస్థితి ఎంత దుర్భరంగా ఉందో ఈమధ్య జరిగిన ఘటనలు నిరూపిస్తున్నాయి. తొమ్మిది నెలల పసికందు శ్రీహిత హత్యాచారం ఎంత గగుర్పాటు కలిగించిందో చెప్పడానికి మాటలు కూడా రావడం లేదు. దిశ ఉదంతం దేశం మొత్తాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. అందమైన భవిష్యత్తును కలగని, మంచి ఉద్యోగాన్ని సంపాదించి, మాటలు రాని జంతువులపై కూడా ఎంతో మమకారాన్ని ప్రదర్శించి మనిషితనానికి నిలువెత్తు రూపంగా నిలిచిన దిశపై దుండగులు అత్యంత అమానుషంగా, క్రూరంగా దాడిచేసి, ఆమెను హతమార్చిన తీరు అందరినీ కలవరపరిచింది. ఆదిలాబాద్ జిల్లాలో సమత హత్యాచారం కూడా ఇదే స్థాయిలో ఆందోళన కలిగించింది. నిర్భయ తర్వాత దేశవ్యాప్తంగా అందరినీ కదిలించి, నిరసనలు వెల్లువెత్తేలా చేసిన ఉదంతాలు ఇవే. ఈ అకృత్యాలన్నిటికీ మద్యమే మూలమని ప్రతిసారీ నిరూపణవుతోంది. నిర్భయ ఉదంతం జరిగి ఎనిమిదేళ్లు కావస్తున్నా... దోషులకు ఉరిశిక్ష వేసినా ఇంతవరకూ అది అమలు కాలేదు. ఆ నేరస్తులు చట్టంలోని లొసుగులను ఉపయోగించుకుని ఉరికంబాన్ని తప్పించుకోవడానికి నిరంతరాయంగా ప్రయత్నాలు చేస్తూనేవున్నారు. మహిళలపై నేరాలకు పాల్పడేవారికి సత్వరం శిక్షలు పడే ఏర్పాటు లేనంతకాలం ఆ రకమైన నేరాలు కొనసాగుతూనేవుంటాయి. మహిళల రక్షణకు వేరే రాష్ట్రాల్లో, దేశాల్లో తీసుకుంటున్న చర్యలేమిటో ప్రభుత్వాలు గమనించి వాటిని అమలు చేయడం తక్షణావసరం. ఇలాంటి నేరాలను అదుపు చేయడంతోపాటు మహిళల ఎదుగుదలకు తోడ్పడే చట్టాలపై దృష్టిపెట్టాలి. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి వీలు కల్పించే బిల్లు ఏళ్లు గడుస్తున్నా పార్లమెంటులో పెండింగ్‌లో నేవుంది. చట్టసభల్లో మహిళల శాతాన్ని పెంచినప్పుడే వారి అభ్యున్నతికి, రక్షణకు తోడ్పడే చట్టాలు వస్తాయి. మహిళలకు ప్రాధాన్యమిస్తున్నామని, వారి కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామని చెప్పే కేంద్ర ప్రభుత్వం మహిళా కోటా బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టి, దాని ఆమోదానికి చర్యలు తీసుకోవాలి. ఈ దేశ మహిళలకు కావలసింది వట్టి మాటలు కాదు...గట్టి కార్యాచరణ. ఆ దిశగా అడుగులు పడాలి.

ఇందిరాశోభన్, తెలంగాణ కాంగ్రెస్ అధికార ప్రతినిధి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
ఆదివారం ॥ 8-3-2020

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం


సానియా మీర్జా


హంపి

# వన్‌పవర్‌మెంట్

ఆట అంటేనే పవర్! షాట్ కొట్టడానికి పవర్. క్యాచ్ పట్టడానికి పవర్. షూట్ చెయ్యడానికి పవర్. లాగి వదలడానికి పవర్. పావులు కదపడానికి పవర్. పంచ్ ఇవ్వడానికి పవర్. స్ట్రయికర్‌ని విసరడానికి పవర్. అన్నిటా ఎంపవర్‌మెంట్‌ని సాధించిన మహిళలు ఆటల్లోనూ తమ పవర్ చూపిస్తున్నారు. నెంబర్ వన్ స్థానంతో విజయానికే వన్‌పవర్‌మెంట్ తెస్తున్నారు.

## ఎన్నో...ఎన్నెన్నో!

### సానియా మీర్జా (టెన్నిస్)

ప్రపంచ మహిళల టెన్నిస్ పటంలో సానియా మీర్జా పుణ్యమాని భారత్‌కు ఓ ప్రత్యేక గుర్తింపు లభించింది. ఆరేళ్ల చిరుప్రాయంలో రాకెట్ పట్టిన సానియా తండ్రి ఇమ్రాన్ మీర్జా పర్యవేక్షణలో అంచెలంచెలుగా ఎదిగింది. 2005లో ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ టోర్నీ సింగిల్స్ విభాగంలో మూడో రౌండ్‌కు చేరిన సానియా... 2007లో సింగిల్స్‌లో కెరీర్ బెస్ట్ 27వ ర్యాంక్ సాధించింది. సానియా 2009లో మహేశ్ భూపతితో కలిసి ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో... 2012లో మహేశ్ భూపతితో కలిసి ఫ్రెంచ్ ఓపెన్‌లో... 2014లో బ్రూనో సోరెస్ (బ్రెజిల్) జతగా యూఎస్ ఓపెన్‌లో మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్స్ సొంతం చేసుకుంది. గాయాల బారిన పడటంతో 2012లో సింగిల్స్‌కు గుడ్‌బై చెప్పి డబుల్స్‌పైనే దృష్టి సారించిన ఈ హైదరాబాదీ... స్విట్జర్లాండ్ మేటి క్రీడాకారిణి మార్టినా హింగిస్‌తో జతకట్టి గొప్ప విజయాలు సాధించింది. 2015 ఏప్రిల్‌లో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను దక్కించుకున్న ఆమె అదే ఏడాది హింగిస్‌తో జతగా వింబుల్డన్, యూఎస్ ఓపెన్... 2016లో ఆస్ట్రేలియన్ ఓపెన్ డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. 2018లో తల్లి అయిన సానియా రెండేళ్లపాటు ఆటకు దూరమైంది. ఈ ఏడాది మళ్లీ బరిలోకి దిగిన 33 ఏళ్ల సానియా హోబర్ట్ ఓపెన్ టోర్నీలో నదియా కిచెనోక్ (ఉక్రెయిన్)తో కలిసి టైటిల్ నెగ్గి పునరాగమనాన్ని ఘనంగా చాటుకుంది. అర్జున అవార్డు (2004), పద్మశ్రీ (2006), రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న (2015), పద్మభూషణ్ (2016) పురస్కారాలు అందుకున్న సానియా ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్, ఆఫ్రో–ఆసియా క్రీడలు కలిపి మొత్తం ఆరు స్వర్ణాలు సహా 14 పతకాలు సాధించింది.


సైనా నెహ్వాల్

## తల్లి కలనునిజం చేయాలని!

### సైనా (బ్యాడ్మింటన్)

పురుషుల బ్యాడ్మింటన్‌లో భారత స్టార్ ఆటగాళ్లుగా వెలుగొందిన వారు తెరమరుగై... భారత బ్యాడ్మింటన్ ఉనికి ప్రశ్నార్థకమవుతున్న తరుణంలో తన విజయాలతో కొత్త ఉత్తేజాన్ని తెచ్చింది సైనా నెహ్వాల్. 2008లో జూనియర్ ప్రపంచ చాంపియన్‌గా అవతరించి తన ముద్ర చాటుకున్నాక వరుస విజయాలు సాధిస్తూ భారత బ్యాడ్మింటన్ ముఖచిత్రాన్ని మార్చేసింది. హరియాణాలోని హిస్సార్‌లో జన్మించిన సైనా... తండ్రి హర్వీర్ సింగ్ ఉద్యోగరీత్యా హైదరాబాద్‌కు బదిలీ కావడంతో భాగ్యనగరంలో స్థిరపడింది. సైనా తల్లిదండ్రులు హర్వీర్, ఉషా రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారులు. ఎనిమిదేళ్లకు రాకెట్ పట్టిన సైనా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలనుకున్న తన తల్లి ఉషా కలను నిజం చేసింది. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తర్వాత సైనా అంతర్జాతీయస్థాయిలో ఎన్నో గొప్ప విజయాలు సాధించింది. 2015లో ప్రపంచ నంబర్‌వన్‌గా నిలిచింది. ఎంతోమంది అమ్మాయిలు ఈ ఆటను కెరీర్‌గా ఎంచుకునేందుకు ప్రేరణగా నిలిచింది.

## మకుటంలేని మహారాణి! హంపి (చెస్)

మేధో క్రీడ చదరంగంలో అమ్మాయిలు కూడా అద్భుతాలు చేయగలరని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 32 ఏళ్ల గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి నిరూపించింది. ఐదేళ్ల ప్రాయంలో తండ్రి అశోక్ ప్రోత్సాహంతో చెస్‌లో ఓనమాలు నేర్చుకున్న హంపి 1997లో అండర్–10 బాలికల ప్రపంచ చాంపియన్‌గా నిలిచింది. 1998లో అండర్–12... 2000లో అండర్–14 విభాగంలో ప్రపంచ టైటిల్‌ను సొంతం చేసుకుంది. 2002లో గ్రాండ్‌మాస్టర్ హోదా పొందిన హంపి 2006 దోహా ఆసియా క్రీడల్లో వ్యక్తిగత, మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత్‌కు స్వర్ణ పతకాలు అందించింది. ఆ తర్వాత పలు అంతర్జాతీయ టోర్నీల్లో పతకాలు నెగ్గిన హంపి 2016లో తల్లి అయ్యాక రెండేళ్లపాటు ఆటకు విరామం చెప్పింది. 2018లో పునరాగమనం చేశాక... కొన్ని టోర్నీలలో నిరాశాజనక ఫలితాలు వచ్చినా 2019లో ‘ఫిడే’ మహిళల గ్రాండ్‌ప్రి రెండు టోర్నీల్లో విజేతగా నిలిచింది. డిసెంబర్‌లో మాస్కోలో జరిగిన ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచి మహిళల విభాగంలో ఈ ఘనత సాధించిన తొలి భారతీయ చెస్ ప్లేయర్‌గా గుర్తింపు పొందింది. ఈ ఏడాది అమెరికాలో జరిగిన కెయిన్స్ కప్ టోర్నీలోనూ చాంపియన్‌గా నిలిచి కెరీర్ బెస్ట్ రెండో ర్యాంక్‌ను అందుకుంది.


అపూర్వీ చండేలా

## స్పోర్ట్స్ జర్నలిస్ట్ కావాలనుకొని!

### అపూర్వీ చండేలా (షూటింగ్)

మహిళల షూటింగ్ క్రీడలో భారత్ నుంచి అంజలి భగవత్, సుమా షిరూర్, తేజస్విని సావంత్, హీనా సిద్ధూ తదితరులు అంతర్జాతీయస్థాయిలో మెరిశారు. వారి అడుగుజాడల్లోనే నడుస్తూ భారత కీర్తి పతాకాన్ని రెపరెపలాడిస్తోంది అపూర్వీ చండేలా. జైపూర్‌కు చెందిన 27 ఏళ్ల అపూర్వీ తొలుత ఆటలకంటే చదువుపై ఎక్కువ శ్రద్ధ పెట్టేది. కెరీర్‌లో స్పోర్ట్స్ జర్నలిస్ట్ కావాలనుకున్న అపూర్వీని 2008 బీజింగ్ ఒలింపిక్స్ మార్చేశాయి. షూటర్ అభినవ్ బింద్రా 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో స్వర్ణం సాధించడం... ఆ తర్వాత బింద్రాకు లభించిన పేరు ప్రతిష్టలు అపూర్వీ మనసు మార్చేశాయి. బింద్రా స్ఫూర్తితో షూటింగ్ వైపు మళ్లిన అపూర్వీ 2012లో జాతీయ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించి భారత జట్టుకు ఎంపికైంది. 2014 గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో పసిడి పతకం సాధించిన ఆమె... 2018 కామన్వెల్త్, ఆసియా క్రీడల్లో కాంస్యాలు గెలిచింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నాలుగో స్థానంలో నిలిచి టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ఇక 2019లో పసిడి పతకాల పంట పండించింది. మూడు ప్రపంచకప్‌లలో స్వర్ణాలు నెగ్గిన అపూర్వీ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్‌గా నిలిచింది.


షఫాలీ వర్మ

## నాన్న స్వప్నాన్ని సాకారం చేస్తూ!

### షఫాలీ వర్మ (క్రికెట్)

భారత్‌లో పురుషుల క్రికెట్‌తో పోలిస్తే మహిళల క్రికెట్‌కు ఆదరణ అంతంత మాత్రమే ఉన్నా... అవకాశం దొరికినపుడల్లా మహిళా క్రికెటర్లు అంతర్జాతీయ వేదికపై అద్భుతాలు చేస్తూనే ఉన్నారు. హరియాణాకు చెందిన 16 ఏళ్ల టీనేజర్ షఫాలీ వర్మ గతేడాది చివర్లో ఒక్కసారిగా వార్తల్లో నిలిచింది. 15 ఏళ్లకే భారత్‌కు ప్రాతినిధ్యం వహించి ఈ ఘనత సాధించిన పిన్న వయస్కురాలిగా గుర్తింపు పొందిన షఫాలీ... గత నవంబర్‌లో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో 49 బంతుల్లో 73 పరుగులు చేసింది. తద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లో పిన్న వయస్సులో అర్ధ సెంచరీ చేసిన భారత క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పింది. ఈ క్రమంలో 30 ఏళ్లుగా భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న రికార్డును ఆమె బద్దలు కొట్టింది. తన కూతురు ఏనాటికైనా భారత జట్టుకు ఆడాలని కలలు కన్న తండ్రి సంజీవ్ స్వప్నాన్ని షఫాలీ తొందరగానే నిజం చేసి చూపించింది. అంతేకాకుండా తన విధ్వంసకర ఆటతో తొలిసారి భారత మహిళల జట్టు టి20 ప్రపంచకప్‌లో ఫైనల్‌కు చేరడంలో ముఖ్యపాత్ర పోషించింది.

**- కరణం నారాయణ**


మేరీకోమ్

## ‘పంచ్’ మే దమ్ హై

### మేరీకోమ్ (బాక్సింగ్)

క్రీడాకారిణిగా, ముగ్గురు పిల్లల తల్లిగా, భార్యగా, కూతురుగా, పార్లమెంటేరియన్‌గా... ఇలా ఎన్నో బాధ్యతలు మోస్తూనే దాదాపు రెండు దశాబ్దాలుగా బాక్సింగ్ రింగ్‌లో తన పంచ్ పవర్ చాటుకుంటోంది మణిపూర్ మెరిక మేరీకోమ్. 37 ఏళ్ల మేరీకోమ్ భారత్‌లో మహిళల బాక్సింగ్‌కు ప్రతిరూపం. వేర్వేరు వెయిట్ కేటగిరీల్లో ఆరుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలువడంతోపాటు ఒలింపిక్స్‌లో, ఆసియా క్రీడల్లో, కామన్వెల్త్ గేమ్స్‌లో ఇలా ప్రతి మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగితే పతకంతో తిరిగొస్తూ ఎందరికో స్ఫూర్తి ప్రదాతలా నిలుస్తోంది. ‘అర్జున అవార్డు’.. ‘రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న’... ‘పద్మశ్రీ’.. ‘పద్మభూషణ్’.. ‘పద్మవిభూషణ్’.. ఇలా అన్ని అవార్డులు మేరీకోమ్‌ను వరించాయి. ఈ ఏడాది జూలై–ఆగస్టులో టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించి మేరీకోమ్ తన ఉజ్వల కెరీర్‌కు ఫినిషింగ్ టచ్ ఇవ్వాలనుకుంటోంది.


ఎస్. అపూర్వ

## సరదాగా మొదలై!

### అపూర్వ (క్యారమ్)

వేసవి సెలవుల్లోనే కాకుండా తీరిక దొరికినపుడల్లా క్యారమ్ బోర్డు ఆట ఆడిన వాళ్లు ఎందరో ఉంటారు. ఇంటి ఆటలోనూ విశ్వవిజేత కావొచ్చని హైదరాబాద్‌కు చెందిన ఎస్.అపూర్వ నిరూపించింది. ఒకవైపు భారత జీవితబీమా సంస్థ (ఎల్ఐసీ)లో సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూనే మరోవైపు క్యారమ్‌లో ప్రపంచ చాంపియన్‌గా నిలిచి అపూర్వ అందరి చేతా శభాష్ అనిపించుకుంది. తన తండ్రి ఆయన మిత్రులతో సరదాగా క్యారమ్ ఆడుతున్నపుడు ఈ ఆటపట్ల ఆసక్తి పెంచుకున్న అపూర్వ ఆ తర్వాత ముందుకు దూసుకుపోయింది. 2004లో కొలంబోలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచిన అపూర్వ... 2016లో బర్మింగ్‌హామ్ ఆతిథ్యమిచ్చిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఏకంగా సింగిల్స్, డబుల్స్, టీమ్ విభాగాల్లో పసిడి పతకాలు సొంతం చేసుకుంది. ఆట ఏదైనా, వయస్సుతో నిమిత్తం లేకుండా పట్టుదలతో కృషి చేస్తే అద్భుతాలు చేయవచ్చని అపూర్వ నిరూపించింది.


దీపిక కుమారి

## ఆటో డ్రైవర్ అమ్మాయి!

### దీపిక కుమారి (ఆర్చరీ)

మహిళా విలువిద్య (ఆర్చరీ)లో భారత్ పేరు దశదిశలా వ్యాప్తి చెందేలా చేసిన క్రీడాకారిణి దీపిక కుమారి. జార్ఖండ్‌కు చెందిన 26 ఏళ్ల దీపికకు ఎలాంటి క్రీడా నేపథ్యం లేకపోయినా స్వయంకృషితో అంచెలంచెలుగా ఎదిగి అత్యున్నత శిఖరాన్ని అధిరోహించింది. దీపిక తండ్రి శివనారాయణ్ మహతో ఆటో డ్రైవర్‌కాగా... తల్లి గీతా మహతో రాంచీ మెడికల్ కాలేజీలో నర్సుగా పని చేస్తున్నారు. చిన్న వయస్సులోనే ఆర్చరీపై ఆసక్తి పెంచుకున్న దీపికకు సరైన సామాగ్రి అందుబాటులో లేకపోయేది. అయినా ఆమె నిరాశ చెందలేదు. తమ ఊర్లోని మామిడి తోటల్లో మామిడి కాయలను గురి చూసి రాళ్లతో కొట్టేది. 2005లో ఖర్సావన్ పట్టణంలోని అర్జున్ ఆర్చరీ అకాడమీలో... కొన్నాళ్ల తర్వాత జమ్‌షెడ్‌పూర్‌లోని టాటా ఆర్చరీ అకాడమీలో దీపిక శిక్షణ తీసుకుంది. 2009లో 15 ఏళ్ల ప్రాయంలో అమెరికాలో జరిగిన ప్రపంచ యూత్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో దీపిక స్వర్ణ పతకాన్ని నెగ్గింది. ఆ తర్వాత దీపిక వెనుదిరిగి చూడలేదు. 2010 కామన్వెల్త్ గేమ్స్‌లో దీపిక రికర్వ్ వ్యక్తిగత, మహిళల టీమ్ విభాగాల్లో భారత్‌కు స్వర్ణ పతకాలు అందించింది. 2012లో టర్కీలోని అంటాల్యాలో జరిగిన ప్రపంచకప్‌లో దీపిక స్వర్ణ పతకం సాధించడంతోపాటు ప్రపంచ నంబర్‌వన్‌గా అవతరించింది. ఈ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళా ఆర్చర్‌గా గుర్తింపు పొందింది. దీపిక ఓవరాల్‌గా ఇప్పటివరకు అంతర్జాతీయస్థాయిలో 41 పతకాలు సొంతం చేసుకుంది.

నెంబర్ 1

# సోషల్ మీడియా స్టార్స్

**సామాజిక మాధ్యమాలలోనూ మహిళలు రాణిస్తున్నారు. వాస్తవానికి మగవాళ్ల కంటే కూడా యాక్టివ్‌గా ఉంటున్నారు. యూట్యూబ్, ట్విట్టర్, ఇన్‌స్టా గ్రామ్, టిక్ టాక్‌లలో తమ నైపుణ్యాన్ని, ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. స్టార్‌లుగా వెలిగిపోతున్నారు. ఆ స్టార్‌లలో సెలబ్రిటీలు ఉన్నారు. సామాన్యులూ ఉన్నారు.**

● టాప్ యూట్యూబర్

### నిషామధులిక

ఫాలోవర్స్.. 7 కోట్ల 65 లక్షల మంది (7.65 మిలియన్)



*మా కె హాత్ కా ఖానా (అమ్మ చేతి వంట)* ఈ చానెల్‌ను అందిస్తున్న షెఫ్ నిషా మధులిక. స్వస్థలం ఉత్తరప్రదేశ్. మొదట.. చిన్నప్పుడెప్పుడో తల్లి దగ్గర నేర్చుకున్న ఉల్లి, వెల్లుల్లి లేని శాకాహార వంటకాలను ఓ వెబ్‌సైట్‌కు రాసేవారు. మంచి స్పందన రావడంతో భర్త, కొడుకు సహాయంతో తనే సొంతంగా http://nishamadhulika.com/ అనే వెబ్‌సైట్ పెట్టారు. దానికీ డిమాండు మొదలవడంతో 2016లో యూట్యూబ్‌లో వంటల చానెల్ స్టార్ట్ చేశారు నిషా మధులిక. ఆమె వంట చేస్తూ ఆ రెసిపీని హిందీలో వివరిస్తూంటే ఆమె భర్త వీడియో తీసి చానెల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇప్పటి వరకు ఉల్లి,వెల్లుల్లి కూడా లేని దాదాపు పన్నెండు వందల శాకాహార వంటకాలను తన యూట్యూబ్ వంటల చానెల్‌లో అప్‌లోడ్ చేశారు నిషా మధులిక. యూత్, కొత్తగా పెళ్లయిన జంటలు మొదలు వర్కింగ్ విమెన్ చానెల్ సబ్‌స్క్రైబర్స్‌లో ముఖ్యులు.

● ట్విట్టర్ ఫేమ్

### దీపికా పదుకోణ్

ఫాలోవర్స్.. 1 కోటి 39 లక్షల మంది (13. 9 మిలియన్)



ఆమె ఫాలోవర్స్‌ను పెంచిన ట్వీట్.. YES!I am a Woman.I have breasts AND a cleavage! You got a problem!!?? ఎంత అమాయకమో.. అంతే బోల్డ్‌నెస్. ‘అవును.. నేను స్త్రీని. కాబట్టే స్త్రీకి ఉండాల్సినవన్నీ ఉన్నాయి. మీకేమన్నా ప్రాబ్లమా?’ అంటూ ట్విట్టర్‌లో పెట్టింది. ఆమె ధైర్యాన్ని అభిమానులు సరే.. మహిళలు, సినిమా ఇండస్ట్రీలోని మహామహులంతా కొనియాడారు పడుకోణ్ ఫ్యాన్స్ అయిపోయారు.

● ఇన్‌స్టా క్వీన్..

### ప్రియాంక చోప్రా

ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఫోలోవర్స్.. 49.9 మిలియన్ (4 కోట్ల 99 లక్షలు)



పీసీ అని ప్రేమగా పిలుచుకునే అభిమానులను సంపాదించుకున్న ప్రియాంక చోప్రా.. పాప్ గాయనిగా పాశ్చాత్యులకూ పరిచయమయ్యారు. అక్కడి టెలివిజన్ సిరీస్‌లో నటనతోనూ వాళ్లను మెప్పించారు. తన మీద మనసు పారేసుకున్న పాప్ సింగర్ నిక్ జోనస్‌ను పెళ్లాడారు. ఆ ముచ్చట్లను ఫోటోగ్రాఫ్‌లుగా ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తూ ఫాలోవర్స్‌నూ తన అకౌంట్‌కు కట్టిపడేస్తున్నారు. ఇన్‌స్టా క్వీన్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు.

● టిక్ టాక్ లేడీ..

### నిషా గురగైన్

ఫాలోవర్స్.. 21.7 మిలియన్ (2 కోట్ల 17 లక్షలు)



నిషా గురగైన్ పుట్టిపెరిగింది నేపాల్‌లో. సినిమాల్లో అవకాశాలను వెదుక్కుంటూనే సోషల్ మీడియాలో ప్రతిభను ప్రదర్శించింది ఈ అమ్మాయి. బాలీవుడ్ కంటే ముందు టిక్ టాక్‌లో స్టార్ అయింది. ‘ముఝే యాద్ హై ఆతా తెరీ వో నజ్రే మిలానా’ అనే పాటకు ఆమె లిప్ సింగ్ చేస్తూ అభినయించిన తీరు వైరలై.. లక్షల్లో లైక్స్ తోడై టిక్ టాక్ స్టార్‌ను చేసింది. వ్యూస్‌ను, షేర్స్‌ను సంపాదించి పెట్టింది.



సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ
ఆదివారం
8-3-2020


● విష్ణు మంచు

ఈ మధ్య చిన్న గ్యాప్ తీసుకున్నారు విష్ణు. ఈ బ్రేక్‌లో ఖాళీగా కూర్చోలేదాయన. కథలతో కూర్చున్నారు. కథల మీద కూర్చున్నారు. వెబ్ ప్రపంచంలోకి అడుగుపెట్టారు. హాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. కెరీర్‌ని క్షుణ్ణంగా పరిశీలించుకున్నారు. నిర్మాణ సంస్థను పటిష్టం చేసుకున్నారు. మరింత వేగంగా దూసుకెళ్లడానికే ఈ గ్యాప్ అంటారాయన. సరికొత్త కోణాన్ని చూపించబోతున్నాను అంటున్న విష్ణు మంచుతో ఇంటర్వ్యూ.

# నా ఒరిజినల్ వెర్షన్‌ని చూపించబోతున్నాను

● **‘ఆచారి అమెరికా యాత్ర’ (2018) తర్వాత కొత్త సినిమా ప్రారంభించడానికి కొంచెం విరామం తీసుకోవడానికి కారణం?**

కావాలనే విరామం తీసుకున్నాను. ‘ఆచారి..’ షూటింగ్ అప్పుడే ఆ సినిమా డిజాస్టర్ అవుతుందని అర్థం అయిపోయింది. దర్శకుడు నాగేశ్వరరెడ్డి గారికి ఈ విషయం చెప్పాను. నాకు చెప్పిన కథ ఒకటి, షూట్ చేస్తున్న సినిమా మరోటిలా అనిపించింది. సినిమా విడుదలయ్యాక ‘సారీ బాబు.. మీకు హిట్ ఇవ్వలేకపోయాను’ అని నాగేశ్వరరెడ్డి గారు మెసేజ్ పంపారు. ఈ గ్యాప్‌లో ఎక్కడ తప్పు జరుగుతోందా? అనే విషయాన్ని పరిశీలించుకున్నాను. ఏడాదిన్నరగా స్క్రిప్టులు తయారు చేసుకోవడం మీదే ఉన్నాను. అమెరికాలో ఓ కంపెనీ ఓపెన్ చేసి అక్కడున్న రచయితల్ని, ఇక్కడి రచయితల్ని కలిపి స్క్రిప్ట్ వర్క్ చేశాం.

● **తప్పెక్కడ జరుగుతుందో అర్థం చేసుకున్నారా?**

నాకు నచ్చే డ్రెస్ కాదు నాకు నప్పే డ్రెస్ వేసుకోవాలనే విషయం అర్థం అయింది. నా సినిమాల్లో స్క్రిప్ట్ ఎప్పుడూ సమస్య కాలేదు. ఎగ్జిక్యూషనే ప్రాబ్లమ్ అయింది. నేను చేయడం వల్ల ఆడని సినిమాలున్నాయి. నా నుంచి అలాంటి సినిమాను ప్రేక్షకులు ఊహించలేదు. ఇప్పుడున్న ఆడియన్స్ కొత్త కంటెంట్‌ను ఆదరిస్తున్నారు. ప్రస్తుతం ‘మోసగాళ్ళు’ని జానర్‌కి కట్టుబడి చేశాం.

● **మన దగ్గరి రచయితల్ని కాకుండా అమెరికాలోని రైటర్స్‌తో రాయించడం ఎందుకు? వాళ్ల కథలకి, మన కథలకి వ్యత్యాసం ఉంటుంది కదా?**

మన దగ్గర రచయితలు ‘ఢీ’లాగ రాద్దామా? మరో సినిమాలాగా రాద్దామా? అంటున్నారు. జూన్‌లో ఓ క్రేజీ ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేయబోతున్నాను. అప్పుడు మీకే అర్థం అవుతుంది. 15 ఏళ్లుగా నేను చేస్తున్న సినిమాలకు, నా ఆలోచనా విధానానికి సంబంధం లేదు. ప్రస్తుతం నా ఒరిజినల్ వెర్షన్‌ని చూపించాలనుకుంటున్నాను. కెరీర్ ప్రారంభం నుంచే దాన్ని పాటించి ఉంటే సూపర్ సక్సెస్‌ఫుల్ అయ్యుండొచ్చు, ఫ్లాప్ అయ్యుండొచ్చు. కానీ నా ఒరిజినాలిటీ నాకుండేది. ఆడియన్స్‌కి ఏం కావాలో అదే ఇన్ని రోజులూ చేశాను. నాకేం కావాలో అలా ‘మోసగాళ్ళు’ చేస్తున్నాను.

● **ఈ బ్రేక్‌లో ఎన్ని స్క్రిప్టులను సిద్ధం చేసుకున్నారు?**

కొన్ని స్క్రిప్టులు రెడీ అయ్యాయి. అలాగే నిర్మాణ సంస్థను బలపరుచుకోవాలనుకున్నాను. వరుసగా సినిమాలు నిర్మించేలా ప్రణాళికను రెడీ చేసుకున్నాను. ప్రస్తుతం మూడు సినిమాలు నిర్మించబోతున్నాం. సుబ్బరాజు దర్శకత్వంలో రాజ్ తరుణ్‌తో ఓ సినిమా, రచయిత రాజసింహా దర్శకత్వంలో ఓ సినిమా, మరో కొత్త దర్శకుడితో ఓ సినిమా నిర్మించబోతున్నాను. జూన్ లేదా ఆగస్ట్‌లో ఓ క్రేజీ ప్రాజెక్ట్ ప్రకటించబోతున్నాను. అది నా పెట్ ప్రాజెక్ట్. శ్రీను వైట్లగారితోనూ ఓ ప్రాజెక్ట్ గురించి చర్చిస్తున్నాం.

● **హాలీవుడ్‌లో సినిమా (‘మోసగాళ్ళు’ తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో తెరకెక్కుతోంది) ఎందుకు చేయాలనుకున్నారు?**

పేపర్‌లో ఓ స్కామ్‌కి సంబంధించిన ఆర్టికల్ చదివి సినిమా చేస్తే బావుంటుందనుకున్నాను. స్క్రిప్ట్ వర్క్ చేశాం. పూర్తి స్థాయి ఇంగ్లీష్‌లోనే చేయాలనుకున్నాం. సినిమా ప్రారంభించే ముందు నా స్నేహితుడు ‘ఇంత ఖర్చు చేస్తున్నావు. ఇంకొంచెం ఖర్చు పెడితే తెలుగు వెర్షన్ కూడా వచ్చేస్తుంది కదా. కేవలం హాలీవుడ్‌లో అంటే రిస్క్’ అన్నాడు. అలా తెలుగు వెర్షన్ కూడా చేశాం. తెలుగు వెర్షన్‌ని మే నెలలో రిలీజ్ చేయాలనుకుంటున్నాం. ఇంటర్నేషనల్ వెర్షన్ తర్వాత విడుదలవుతుంది. హాలీవుడ్‌లో ఓ పెద్ద స్టార్ నటి ఈ సినిమాలో నటించబోతున్నారు. మే చివర్లో ఆమె షూట్‌లో జాయిన్ అవుతారు. ఆమె పోర్షన్ వరకూ వేరే నటితో చిత్రీకరణ చేసి తెలుగులో ముందే రిలీజ్ చేసేస్తున్నాం.

● **‘చదరంగం’ సిరీస్‌తో వెబ్ వరల్డ్‌లోకి ఎంటర్ అయ్యారు..**

నాకు హిస్టరీ అంటే ఇంట్రెస్ట్ ఎక్కువ. ఎన్టీ రామారావుగారు ఊరు వెళ్లి వచ్చేలోగా పదవి నుంచి దింపేశారు. అప్పుడున్న పరిస్థితులేంటి? అని కథగా చెప్పాలనుకున్నాం. రాజకీయాల్లో విలన్లు ఉండరు. అవకాశవాదులే ఉంటారు. రాజకీయం అంటే చదరంగమే. జీ5 హిస్టరీలో ఎక్కువ రేటింగ్ ఉన్న సిరీస్ మాదే అని వాళ్లు చెబుతున్నారు. నేను అనుకున్న కథ చెప్పడానికి డిజిటల్ ప్లాట్‌ఫామ్ కరెక్ట్ అనిపించింది. ‘ఏది చేసినా నిజాలు చూపించండి’ అని నాన్నగారు అన్నారు. పరుచూరిగారి సలహాలు తీసుకున్నాం. అందుకే ఈ సిరీస్ చుట్టూ ఎటువంటి కాంట్రవర్శీలు లేవు.

● **భక్త కన్నప్ప ఎంతవరకూ వచ్చింది?**

మూడు నాలుగేళ్ల క్రితం తనికెళ్ల భరణిగారు, నేను ‘భక్త కన్నప్ప’ సినిమా చేద్దాం అనుకున్నాం. అప్పటి నుంచి నేను ఆ కథ మీద కూర్చుని కొన్ని ఇన్‌పుట్స్ ఇస్తూ స్క్రిప్ట్ రెడీ చేస్తూ వచ్చాను. హాలీవుడ్ నుంచి స్టోరీ బోర్డ్ ఆర్టిస్టులను పిలిపించాను. కాళహస్తిలో విపరీతమైన పరిశోధన చేశాం. హాలీవుడ్ రైటర్‌ని తీసుకున్నాను. ‘లార్డ్ ఆఫ్ ది రింగ్స్’లా ఉండాలనుకున్నాను. స్క్రిప్ట్ అలా తయారుచేశాం. ఆ సినిమా బడ్జెట్టే 95 కోట్లు వరకూ అయ్యేలా ఉంది. దాన్ని ఎలా తగ్గించాలని ఇంకా ప్రీ ప్రొడక్షన్ చేస్తున్నాం. నాస్తికుడు శివ భక్తుడు ఎలా అయ్యాడు? అన్నది భక్త కన్నప్ప పాయింట్. ఈ సినిమా షెడ్యూల్స్ ప్లానింగ్ కోసం పోల్యాండ్, ఐర్లాండ్, అమెరికా, స్కాట్‌ల్యాండ్, లండన్, ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్ వెళ్లాను. బడ్జెట్ సహకరిస్తే న్యూజిల్యాండ్ వెళ్లి షూట్ చేయాలనుంది. కొంత భాగం అరకు లోయలో తీయాలి. స్క్రిప్ట్ పూర్తయ్యాక భరణి అంకుల్ ‘నీ విజన్ బావుంది. ఇంత పెద్ద ప్రాజెక్ట్‌ని షూట్ చేయలేను. నేను హ్యాండిల్ చేయలేను. కావాలంటే చిన్న బడ్జెట్ సినిమా ఏదైనా చేద్దాం’ అన్నారు. చాలా బాధ అనిపించింది. ఆ తర్వాత ముగ్గురు పెద్ద దర్శకులను దర్శకత్వం వహించమని అడిగాను. అందులో కొందరు 20–30 శాతం బడ్జెట్‌ని పారితోషికంగా అడిగారు. ఎందుకో నాకు నచ్చలేదు. రిజెక్షన్‌లా అనిపించింది. హాలీవుడ్ అతనితో డైరెక్ట్ చేయిస్తాను. శివుడు పాత్రకు ఓ పెద్ద యాక్టర్‌ని అడిగాను. చేస్తానని అంగీకరించారు. ప్రస్తుతం నా మార్కెట్ 100 కోట్లు కాదు. కానీ కన్నప్ప తర్వాత రావొచ్చు.

● **వంద కోట్ల బడ్జెట్‌తో సినిమా తీసేంత డబ్బు మీ దగ్గర లేదా?**

నా దగ్గర అన్ని డబ్బులు లేవు. ఈ మధ్య ఐటీ రిటర్న్స్ వాళ్లు వచ్చి ‘ఏంటి? మీ రిటర్న్స్ ఇంత తక్కువ అంటున్నారు’. నా సినిమా ఆడితేనే నాకు డబ్బులొస్తాయి అని చెప్పాను. బయటేమో జనాలు నా దగ్గర బాగా డబ్బులున్నాయి అనుకుంటున్నారు. వాళ్లు అనుకున్నట్టు నా దగ్గర అంత డబ్బుంటే బావుండు.

● **కొత్త బిజినెస్ ప్రారంభిస్తున్నట్టున్నారు?**

విన్నీ మంచి డిజైనర్. న్యూయార్క్‌లో ఫ్యాషన్ డిజైనింగ్ చేసింది. ప్రస్తుతం నా బట్టలు, పిల్లల బట్టలు అన్నీ తనే చూసుకుంటుంది. చిన్నపిల్లల బట్టల మార్కెట్ మన దగ్గర అనుకున్నంత లేదు. నువ్వెందుకు ఆ మార్కెట్‌లోకి ఎంటర్ కాకూడదు? అని ఫ్రెండ్స్ పుష్ చేశారు. మే, జూన్‌లో ఆ కంపెనీ ప్రారంభిస్తాం.

**మీకు రెండు పొలిటికల్ పార్టీలతో సంబంధాలు ఉన్నాయి. ఎలా బ్యాలెన్స్ చేస్తున్నారు?**

నా ప్రయారిటీ విన్నీ (విష్ణు భార్య విరానికా), నా కుటుంబమే. చంద్రబాబు అంకుల్ నా బంధువే. జగన్ అన్న కుటుంబం విరానిక బంధువులు. ఫ్రాంక్‌గా చెప్పాలంటే నాకు విన్నీ వాళ్ల బ్రదర్ జగన్ అన్న ముఖ్యం. బాలకృష్ణగారు చాలా క్లోజ్. బ్రహ్మాణితో బావుంటాను. ఏది ఏమైనా నా ఫస్ట్ ఓట్ విన్నీకే.

**కుటుంబం పెద్దగా అయినట్టుంది?**

అవును (నవ్వుతూ). పిల్లలు కావాలనుకున్నప్పుడు దేవుడు కవల పిల్లల్ని (అరియాన, విరియాన) ఇచ్చాడు. ఆ తర్వాత ఐదేళ్లకు అవ్రామ్ పుట్టాడు. ఆ తర్వాత ఐరా. ఈ మధ్య ఇండస్ట్రీలో ఫ్రెండ్స్ ‘ఏవయ్యా నీవల్ల మా ఇంట్లో తిడుతున్నారు. మీకు ఇద్దరు సరిపోరా? పిల్లల్ని కనండీ అంటూ మా ఇంట్లో ఒత్తిడి చేస్తున్నారు’ అంటున్నారు. మా చెల్లెల్ని ఇబ్బంది పెట్టడం ఆపేయ్ అని జగనన్న, షర్మిలక్క అంటారు. ‘ఏవయ్యా, నీకు వేరే పని లేదా?’ అని సుబ్బరామిరెడ్డి అంకుల్ అంటున్నారు (నవ్వుతూ). ఈ బ్రేక్‌లో ఫ్యామిలీతో టైమ్ గడిపే వీలు కుదిరింది. షూటింగ్ లేకపోతే 7 గంటల తర్వాత బయటకు వెళ్లను. అందరూ కలసి డిన్నర్ చేయాలన్నది రూల్. 9కి నిద్రపోతాను. కానీ మా పిల్లలు నిద్రపోవడం లేదు. పిల్లల ఫొటోలు బావుంటాయి అని అందరూ అభినందిస్తుంటారు. అవన్నీ విరానికా ఐడియాలు. తను నాకంటే చాలా తెలివైనది.

13 ఏళ్ల వయసులో హీరోయిన్‌గా ఎంటరై ఓ 13 ఏళ్లు నటిగా వెనక్కి తిరిగి చూసుకోనంత బిజీగా సినిమాలు చేశారు చార్మి. ‘నీ తోడు కావాలి’ (2002) నుంచి ‘జ్యోతిలక్ష్మి’ (2015) వరకూ కథనాయికగా, ప్రత్యేక పాటల్లో, అతిథి పాత్రల్లో చార్మి మెరిశారు. ‘జ్యోతిలక్ష్మి’తో నిర్మాతగా మారారు. ‘పూరి కనెక్ట్స్’ బేనర్‌లో వచ్చిన జ్యోతిలక్ష్మి రోగ్, పైసా వసూల్, మెహబూబా, ఇస్మార్ట్ శంకర్ సినిమాలకు నిర్మాతగా వ్యవహరించారు. ఇప్పుడు ‘రొమాంటిక్’ సినిమా నిర్మిస్తున్నారు. విజయ్ దేవరకొండతో ప్యాన్ ఇండియా మూవీ ‘ఫైటర్’కి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా చార్మితో జరిపిన ఇంటర్వ్యూ.

# మీకు మీరే ప్రేరణ అవ్వండి


● చార్మి

● **స్క్రీన్ మీద స్త్రీలు కనిపించడం సాధారణమే. కానీ నిర్మాణ రంగంలో తక్కువమంది ఉన్నారు. మీరు యాక్టర్ నుంచి ప్రొడ్యూసర్ అయ్యారు. ఈ ఎక్స్‌పీరియన్స్ ఎలా ఉంది?**

తెరవెనకతో పోల్చితే తెర మీద కనిపించే స్త్రీల సంఖ్య ఎక్కువే. కానీ యాక్టింగ్ అనేది సాధారణ విషయం కాదు. ఎంతో అంకిత భావం, ఇష్టం ఉండాలి. దాంతోపాటు ఎంతో త్యాగం కూడా ఉంటుంది. అప్పుడే ఇండస్ట్రీలో ఉండగలుగుతాం. నా యాక్టింగ్ కెరీర్‌లో నేను చాలా ఎత్తుకి ఎదిగాను, అవార్డులు తీసుకున్నాను. కానీ ‘జ్యోతిలక్ష్మి’ సినిమా నా జీవితాన్ని మార్చేసింది. ఆ సినిమాలో నటిస్తూ, నిర్మించాను. ఒకవైపు ప్రొడక్షన్‌కి సంబంధించిన అన్ని వ్యవహారాలను చూసుకుంటూ, ఎవరిని ఎలా డీల్ చేయాలో అర్థం చేసుకుంటూ మరోవైపు నటనని కూడా బ్యాలెన్స్ చేసుకునేదాన్ని. అయితే యాక్టింగ్ కంటే ప్రొడక్షన్ చాలా చాలెంజింగ్‌గా అనిపించింది. ఒక మంచి సినిమా ఇవ్వడానికి నిర్మాత పడే కష్టాలు తెలిశాయి. ఒక స్త్రీగా నిర్మాణం సవాల్ అయినప్పటికీ సంతృప్తినిస్తోంది. అందుకే ప్రొడక్షన్‌ని కెరీర్‌గా చేసుకుని తెరవెనక పని చేస్తున్నాను. దేశంలో మనకున్న అతి తక్కువమంది సక్సెస్‌ఫుల్ యంగ్ లేడీ ప్రొడ్యూసర్స్‌లో నేను ఒకదాన్ని కావడం ఆనందంగా, గర్వంగా ఉంది.

● **డైరెక్టర్ పూరీ జగన్నాథ్‌గారు సపోర్ట్ చేయడం వల్లే మీరు ప్రొడక్షన్ చూసుకోగలుగుతున్నారా? లేక మీ అంతట మీరు సొంతంగా ప్రొడక్షన్‌ని హ్యాండిల్ చేసే ధైర్యం మీకుందా?**

పూరీగారు, నేను ఒకర్నొకరం సపోర్ట్ చేసుకుంటాం. మా మంచీ చెడులకు మేం ఒకరికొకరం అండగా నిలబడ్డాం. ఇక నేను ఓన్‌గా ప్రొడక్షన్ చూసుకోగలనా అంటే.. ‘జ్యోతిలక్ష్మి’ నుంచి మొదలుపెట్టి ఇప్పుడు విజయ్ దేవరకొండతో తీస్తున్న సినిమాతో కలిపి ఐదేళ్లుగా సినిమాలు నిర్మిస్తున్నాను. మరి నాకు ఓన్‌గా ప్రొడక్షన్‌ని హ్యాండిల్ చేసేంత ధైర్యం ఉందో లేదో చెప్పండి (నవ్వుతూ).

● **మేల్, ఫిమేల్ ప్రొడ్యూసర్‌కి ఉన్న డిఫరెన్స్?**

జెండర్ తేడా తప్ప పని విషయంలో ఏ తేడా ఉండదు. పీపుల్‌ని డీల్ చేసే విషయంలోను, సినిమాని డిస్ట్రిబ్యూట్ చేసే విషయంలోనూ అంతా ఒకటే. అయితే పెద్ద తేడా ఏంటంటే.. ఆడవాళ్లను నిరుత్సాహపరచడానికి చాలామంది ట్రై చేస్తారు. ఈ బిజినెస్‌కి పనికి రావు అన్నట్లుగా డౌన్ చేస్తారు. అలాంటి సమయాల్లో స్ట్రాంగ్‌గా ఉండాలి. అలాంటివాళ్లను ఎదుర్కోడానికి సిద్ధంగా ఉండాలి. కేవలం వాళ్లకున్న అభద్రతాభావంవల్లే స్త్రీలను నిరుత్సాహపరచడానికి ట్రై చేస్తారు.

● **హీరోయిన్‌గా ఎదుర్కొన్న సవాళ్లు? ఇప్పుడు నిర్మాతగా ఎదుర్కొంటున్న వాటి గురించి?**

నా పదమూడేళ్ల వయసులో యాక్టింగ్ కెరీర్‌ని మొదలుపెట్టాను. అప్పటినుంచి నటిగా నా చివరి సినిమా ‘జ్యోతిలక్ష్మి’ వరకు కెరీర్ బ్రహ్మాండంగా ఉన్నప్పటికీ చాలా ఎత్తుపల్లాలు చూశాను. తట్టుకుని ముందుకెళ్లాలంటే స్ట్రాంగ్‌గా ఉండాలి. మన ప్రతిభే మనల్ని శిఖరానికి చేర్చుతుంది. నటిగా నన్ను ప్రూవ్ చేసుకున్నాక అవకాశాలు వాటంతట అవే వచ్చాయి. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోలేదు. నిర్మాతగా కెరీర్ మొదలుపెట్టాక చాలా మంది ‘నెగటివ్ అడ్వైస్’లు ఇచ్చారు. ప్రొడక్షన్ బ్యాగ్రౌండ్ లేని కుటుంబం నుంచి వచ్చాను. పైగా ఫిమేల్ ప్రొడ్యూసర్. అయితే మానసికంగా స్ట్రాంగ్‌గా ఉండటంతో పాటు ఆత్మవిశ్వాసంతో ఉంటే ఏదీ అసాధ్యం కాదు. ఫైనల్లీ ప్యాన్ ఇండియా మూవీ (‘ఫైటర్’) ప్రొడ్యూసర్‌గా బెస్ట్ స్పేస్‌లో ఉన్నాను.

● **నటన, నిర్మాణం ఏది సౌకర్యంగా ఉంది?**

మీరు ఒక పని చేస్తున్నప్పుడు నేను ‘కంఫర్టబుల్‌గా ఉన్నాను’ అనే ఫీలింగ్ వస్తే అక్కడితో లైఫ్ చివరి దశకు చేరుకున్నట్లే. ఎందుకంటే కంఫర్ట్ జోన్‌లో ఉన్నప్పుడు నేర్చుకోవడానికి ఏమీ ఉండదు. జీవితం అంటేనే సాహసం. అది కంఫర్ట్‌గా ఉండేకన్నా చాలెంజింగ్‌గా ఉంటేనే బాగుంటుంది.

● **ఫైనల్లీ.. నటిగా ఇండస్ట్రీని చూశారు. ఇప్పుడు నిర్మాతగా చూస్తున్నారు. ఈ రెండింటిలో స్త్రీకి ఏది సేఫ్?**

ఏది సేఫ్ అని అడుగుతున్నారంటేనే స్త్రీకి ఎక్కడైనా కష్టాలు ఉన్నట్లే. ముఖ్యంగా మన సమాజంలో స్త్రీలకు ఏదో ఒక అసౌకర్య పరిస్థితి ఎదురవుతూనే ఉంటుంది. నటన, నిర్మాణం అనేది పక్కన పెడదాం. ప్రతి ఫీల్డ్‌లోనూ స్త్రీలకు సవాళ్లు, కష్టాలు ఉంటాయి. వాటికి భయపడిపోకూడదు. ‘స్ట్రాంగ్‌గా ఉండండి. మీకు మీరే ప్రేరణ అవ్వండి’.

## కష్టం వృథా కాలేదు - తమ్మారెడ్డి భరద్వాజ

‘‘నా నలభైఏళ్ల కెరీర్‌లో నాకు గుర్తుండిపోయే చిత్రం ‘పలాస’. ఈ సినిమాలో నటీనటుల అద్భుతమైన హావభావాలకు ప్రేక్షకులు మైమరచిపోతున్నారు. అద్భుతమైన రివ్యూస్ వచ్చాయి. మా కష్టం వృథా కాలేదని భావిస్తున్నాను’’ అన్నారు దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ. రక్షిత్, నక్షత్ర జంటగా కరుణకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘పలాస’. తమ్మారెడ్డి భరద్వాజ సమర్పణలో ధ్యాన్ అట్లూరి ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం సురేష్ ప్రొడక్షన్స్ ద్వారా ఈ నెల 6న విడుదలైంది. తమ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని చిత్రబృందం చెబుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో రక్షిత్ మాట్లాడుతూ– ‘‘మా సినిమాకు మంచి రివ్యూస్ రావడం హ్యాపీ. సినిమాలోని ప్రతి సన్నివేశం గురించి ప్రేక్షకులు మాట్లాడుకోవడం చూస్తుంటే సంతోషంగా ఉంది’’ అన్నారు. ‘‘ఈ సినిమా విజయం మరిన్ని మంచి సినిమాలు చేయడానికి ధైర్యాన్నిచ్చింది’’ అన్నారు కరుణకుమార్. ‘‘దర్శకుడి ఆలోచన, నిర్మాత ప్రయత్నం సినిమాను నిలబెట్టాయి. నటీనటుల పాత్రలతో పాటు నా పాత్రకూ మంచి స్పందన లభిస్తోంది’’ అన్నారు సంగీత దర్శకుడు–నటుడు రఘుకుంచె. ‘‘‘పలాస’లాంటి చిత్రాలు అరుదుగా వస్తుంటాయి. ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు’’ అన్నారు హీరోయిన్ నక్షత్ర.


● కరుణకుమార్, రక్షిత్, తమ్మారెడ్డి భరద్వాజ, నక్షత్ర, ప్రసాద్




## కథే ప్రాణం

అల్లు వంశీ, ఇతీ ఆచార్య జంటగా నటిస్తున్న చిత్రం ‘పసివాడి ప్రాణం’. ధన్‌శ్రీ ఆర్ట్స్ పతాకంపై ఎన్.ఎస్ మూర్తి ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఈ చిత్రం లిరికల్ ఆడియో సాంగ్‌ను దర్శకులు కోదండరామిరెడ్డి, వీవీ వినాయక్‌లతో కలిసి నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎన్.ఎస్. మూర్తి మాట్లాడుతూ– ‘‘తెలుగు సినిమాల్లో ఇప్పటివరకు రానటువంటి వినూత్నమైన లైవ్ కమ్ యానిమేషన్ చిత్రం ‘పసివాడి ప్రాణం’. మోషన్ క్యాప్చర్, యానిమేషన్, గ్రాఫిక్స్ టెక్నాలజీలతో నిర్మితమైన 3డీ, 2డీ క్యారెక్టర్స్ సినిమాలో ఉన్నాయి. 2డీ బేబి, 3డీ టెడ్డీ బేర్ స్పెషల్ ఎట్రాక్షన్. ఈ సినిమాకు కథ ప్రాణం అయితే గ్రాఫిక్స్ ఊపిరి’’ అన్నారు.


● అల్లు వంశీ, వినాయక్, ఎన్.ఎస్. మూర్తి

## గర్ల్ డ్రాగన్

విభిన్నమైన చిత్రాలను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తుంటారు దర్శక–నిర్మాత రామ్‌గోపాల్‌వర్మ. తాజాగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ‘ఎంటర్ ది గర్ల్ డ్రాగన్’. పూజా భలేకర్ ప్రధాన పాత్రధారిగా ఇండో–చైనీస్ సంయుక్త నిర్మాణంలో తెరకెక్కుతోన్న చిత్రం ఇది. ఈ ఏడాది జూన్‌లో ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు. ‘‘మార్షల్ ఆర్ట్స్‌కు గ్లామర్ మేళవించి ఓ కొత్త ట్రెండ్‌లో రామ్‌గోపాల్‌వర్మ రూపొందిస్తున్న చిత్రం ఇది. ఇందులో పూజా చేసే పోరాటాలు హైలైట్‌గా ఉంటాయి. ఇటీవల చైనాలో ఈ సినిమాకు సంబంధించిన కీలక సన్నివేశాలను చిత్రీకరించాం. తాజాగా ఈ చిత్రం వైజాగ్ షెడ్యూల్ ముగిసింది’’ అని చిత్రబృందం వెల్లడించింది.


● పూజా భలేకర్

epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ సన్నిధి
నల్లగొండ ॥ ఆదివారం
8-3-2020

# పౌరాణిక మణిదీపాలు

**పురాణాలలోని పతివ్రతలందరూ ఎన్నోవిధాలైన కష్టాలు పడ్డా, అబలలమని కన్నీరు కారుస్తూ కూచోలేదు. విధినే ధైర్యంగా ఎదుర్కొని విజయం సాధించారు. కన్నవారు, కట్టుకున్నవాడు, సమాజం, చివరకు ప్రార్థించే భగవంతుడు... ఇలా ఎవరివల్ల ఆపద వాటిల్లినా, తాము నమ్ముకున్న సత్యాన్ని ఆచరించడంలో వెనుకడుగు వేయని ఆ ధీరత్వాన్ని సర్వజగత్తు శభాష్ అనిపించేలా చేసుకున్న ఆ స్త్రీల ఆత్మస్థైర్యం ఆదర్శప్రాయం. అనుసరణీయం.**



## స్త్రీ వేదం

స్త్రీలు విజ్ఞాన సముపార్జనలో ముందున్నారు. వేదాంత చర్చల్లో పాల్గొన్నారు... మండనమిశ్రుని భార్య ఉభయభారతి పాండిత్యంలోను, వేదాంతంలోను అగ్రస్థానాన నిలబడింది. జగద్గురువు ఆదిశంకరాచార్యులకు, అపర సరస్వతీపుత్రునిగా వెలుగొందిన తన భర్త మండన మిశ్రునికి మధ్య జరిగిన వాదనకు న్యాయనిర్ణేతగా నిలిచింది ఉభయభారతి. ఈ సంఘటనకు వేల సంవత్సరాల క్రితమే అంటే వేదకాలంలో... గార్గి అనే మహిళ వేదాలను ఔపోసన పట్టినట్లు తెలుస్తోంది. హిందూ సంప్రదాయంలో మహిళల గొప్పదనాన్ని గురించి ఉదహరించేటప్పుడు గార్గి పేరును తప్పనిసరిగా ప్రస్తావిస్తారు. గార్గి చిన్నతనం నుంచే వేద పరిజ్ఞానం పెంచుకుంది. తన పరిజ్ఞానంతో పురుషులను అధిగమించింది. అపారమైన వేదాంత పరిజ్ఞానాన్ని సముపార్జించింది. వేదాలతో పాటు ఉపనిషత్తుల మీద కూడా పట్టు సాధించింది గార్గి. పురుషులతో చర్చల్లో పాల్గొనేది. కుండలినీ శక్తిని సాధించింది. విద్యావ్యాప్తి కోసం పాటు పడింది. ఛాందోగ్యోపనిషత్తులో సైతం గార్గి ప్రస్తావన ఉంటుంది. బ్రహ్మవాదిని అయిన గార్గి, ఋగ్వేదంలో అనేక ఋక్కులను రచించింది. మిథిలా నగర మహారాజైన జనకుని కొలువులో కొలువు తీరిన నవరత్నాలలో గార్గి కూడా ఉంది.

విదేహరాజు అయిన జనకమహారాజు రాజసూయయాగం నిర్వహించిన సందర్భంలో వివిధ దేశాల రాజులతో పాటు పండితులు కూడా హాజరయ్యారు. వచ్చిన పండితులందరినీ చూసి సంతోషంతో, అందరికంటె ఉన్నతుడిని ఎంపిక చేయాలనుకుని, చర్చ గోష్ఠి ఏర్పాటు చేశాడు. యాజ్ఞవల్క్యునితో వాదించడానికి ఎవ్వరూ సాహసించలేకపోయారు. యాజ్ఞవల్క్యునితో వాదన చేస్తానని సవాలు విసిరింది గార్గి. చివరి వరకు వాదన చేసింది. ఈ వాదనలో గెలిచిన యాజ్ఞవల్క్యుడు బహుమానాన్ని తిరస్కరించి యాజ్ఞవల్క్యుడు అడవులకు తన భార్య మైత్రేయితో కలిసి వెళ్లిపోతాడు. ఆవిడ కూడా భర్తతో సమానంగా చదువుకుంది. ఆమె తన భర్త అయిన యాజ్ఞవల్క్యుని వ్యక్తిత్వాన్ని, ఆధ్యాత్మిక ఆలోచనలను, జ్ఞానాన్ని వికసింపచేయడానికి కృషి చేసింది. ఉపనిషత్తుల్లో గార్గి పేరుతో పాటు మైత్రేయి పేరు కూడా ప్రసిద్ధిగా వినిపిస్తుంది.

– రోహిణి



## సమయస్ఫూర్తి శచీదేవి

పూర్వం ఇంద్రుడు ఒకానొక సందర్భంలో విరక్తుడై ఎవరికీ కనిపించకుండా వెళ్లిపోయాడు. దాంతో దేవతలు, ఋషులు అంతా కలిసి నహుషుడనే రాజును స్వర్గాధిపతిగా ఎన్నుకున్నారు.

తేలికగా సురలోకాధిపత్యం పొందిన నహుషుడి దృష్టి ఇంద్రుని భార్య శచీదేవిపై పడి, తనను సేవించడానికి రావలసిందిగా కబురు చేశాడు. దాంతో తల్లడిల్లిన శచీదేవి ఇంద్రుని వెతుకుతూ వెళ్ళింది. ఒక సరస్సు మధ్యలో ఉన్న పద్మనాళంలో సూక్ష్మ రూపంలో ఉన్న ఇంద్రునితో నహుషుని దుష్కృత్యాలు చెప్పి కన్నీరు పెట్టుకుంది. ఇంద్రుడు ఆమెను ఊరడించి 'ఋషులు మోసే దివ్యవాహనంపై నా దగ్గరకు వస్తే నీ దానిని అవుతాను' అని నహుషునికి వార్త పంపు''. అని తరుణోపాయం సూచించాడు. పతి సూచన మేరకు ఆమె నహునికి అలాగే వర్తమానం పంపింది. నహుషుడు తపోదీక్షలో ఉన్న ఋషులతో పల్లకీని మోయించి అగస్త్యుడి శాపంతో పాముగా మారి భూలోకంలో ఉన్న ఓ పాడుబడ్డ బావిలో పడ్డాడు. అలా శచీదేవి నహుషుడు తన వేలితోనే తన కన్ను పొడుచుకునేలా చేసి, అతను శాపగ్రస్థుడయ్యేలా చేసింది. భర్తకు తిరిగి ఇంద్ర పదవి సిద్ధించేలా చేసుకుంది.

నిర్వహణ:
డి.వి.ఆర్. భాస్కర్



## పోరాట పటిమ సావిత్రి

మద్రదేశ రాజు అశ్వపతి గారాబు తనయ సావిత్రి. యుక్తవయస్కురాలైన సావిత్రి సాళ్వ రాజ వంశజుడైన సత్యవంతుని గుణగణాదుల గురించి విని అతడే తన భర్తగా నిశ్చయించుకుంటుంది. సత్యవంతుని తండ్రి ద్యుమత్సేనుడు విధివశాన రాజ్యాన్ని, కంటిచూపుని పోగొట్టుకొని భార్యాసమేతుడై అరణ్యంలో ఆశ్రమ జీవనం సాగిస్తున్నారని, సత్యవంతుని ఆయువు మరొక్క సంవత్సరకాలమేనని నారదుడి ద్వారా తెలుసుకున్నాడు అశ్వపతి.

చూస్తూ చూస్తూ అల్పాయుష్కుడికి కూతురినివ్వలేక, అలాగని ఆమె కోరికను కాదనలేక కుమిలి పోతున్న అశ్వపతికి నారదుడే నచ్చజెప్పడంతో అశ్వపతి తన కుమార్తె వివాహాన్ని సత్యవంతునితో జరిపిస్తాడు. మద్ర దేశపు రాజకుమారిగా ఎంతో సౌకుమార్యంగా, అత్యంత గారాబంగా పెరిగిన సావిత్రి అతి సామాన్యమైన ఇల్లాలుగా, అత్యంత నిరాడంబర జీవనాన్ని గడుపుతూ అత్తమామల సేవలో, భర్త అనురాగంలో మునిగి తేలుతోంది. ఈలోగా నారదుడు చెప్పిన గడువు రానే వచ్చింది. భర్త ఉన్నట్లుండి కళ్లు తిరుగుతున్నాయంటూ కుప్పకూలడంతో తన ఒడిలో పడుకోబెట్టుకుంది సావిత్రి. ఇంతలో పాశహస్తుడై ఉన్న కాలయముడు సత్యవంతునిలోని జీవాన్ని తీసుకుని వెళుతుండటం ఆమె కంటపడి యమునికి అడ్డుపడింది. యముడు ''నేటితో నీకు, నీ భర్తకు ఋణం తీరింది. నీ భర్తకు జరిపించవలసిన సంస్కారాలు జరిపి నీ దోవన నీవు వెళ్లు'' అని మరలిపోయాడు.

భర్త శరీరాన్ని చెట్టుచాటున దాచిన సావిత్రి యముని అనుసరించింది. తన వెంబడి వస్తున్న సావిత్రిని చూసిన యముడు ''నీ ధైర్యానికి మెచ్చాను, ఏదైనా వరం ఇస్తాను కోరుకో'' అన్నాడు. ఆమె తన అత్తమామలకు చూపుతోపాటు పోగొట్టుకున్న రాజ్యాన్ని కూడా ప్రసాదించమని ప్రార్థించింది. ప్రసాదించాడు యముడు.

అయినా సావిత్రి తన వెంట రావడంతో ''తల్లీ! నీకోరిక తీర్చాను కదా! ఇకనైనా మరలిపో! పోనీ మరొక్క వరం కోరుకోమనడంతో సావిత్రి తన పుట్టింటికి వారసులు కావాలని కోరింది. అశ్వపతికి నూరుగురు పుత్రులను అనుగ్రహించాడు యముడు. అయినప్పటికీ సావిత్రి యముని అనుసరించి ''స్వామీ! ఏడడుగులు నడిస్తే అపరిచితులైనా బంధువులవుతారని పెద్దలంటారు కదా! మన మిరువురం అంతకన్నా ఎక్కువగానే కలిసి నడవడం వల్ల ఆత్మబంధువులమయ్యాము కదా!'' అన్నది సావిత్రి. ఆమె వాక్చాతుర్యానికి, సమయస్ఫూర్తికి ముగ్ధుడైన యముడు సత్యవంతుని పునర్జీవితుని చేసి, వారిని దీవించాడు.

**నేటిరోజులలో కూడా అధికారులు, జమీందారులు, శతకోటీశ్వరుల తనయలు పేద కుర్రాళ్లని ప్రేమించి పెళ్లి చేసుకుంటున్నారు. కానీ, పుట్టింటిలో తాము పెరిగిన జీవన విధానంతో అత్తింటివారిని పోల్చుకుంటూ, అతి కొద్దికాలంలోనే తమ బతుకును దుర్భరంగా మార్చుకుంటూ, ఆ పెళ్లి పెటాకులు చేసుకుని తిరిగి పుట్టింటికి వెళ్లిపోవడమో లేదంటే ముఖం చెల్లక తనువు చాలించడమో చేస్తున్నారు. అలాంటి వారు సావిత్రిని ఆదర్శంగా తీసుకోవాలి.**

స్త్రీ వైశిష్ట్యం-30

## వీర ధీర భక్త శిరోమణులు

చిన్నతనం నుండీ కృష్ణభగవానుడే భర్త అని నమ్మి సేవించిన మహాతల్లి మీరాబాయి. ఆయన ఉన్నాడు.. అని నమ్మి తండ్రి పంపిన విషాన్ని తాగేసింది. కృష్ణపరమాత్మ ఆ విషాన్నంతటినీ గ్రహించడంతో పాలరాతి విగ్రహం నల్లగా మారిపోయింది. కృష్ణా, నీవిలా అయిపోవడం నేను చూడలేను.. అని ఆమె ఆర్తితో మొరపెట్టుకుంటే విగ్రహం మళ్ళీ తెల్లగా పూర్వ స్థితిలో కనిపించింది.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

ఆ తల్లి చిట్టచివరి రోజుల్లో బృందావనంలో కీర్తనలు పాడుకుంటూ ఉండిపోయింది. బృందావనానికి కృష్ణ భక్తుడైన ఒక సాధువు వచ్చాడని తెలిసి మరో భక్తుడితో కలిసి చూడడానికి వెళ్ళింది. ఆ సాధువు ఆడవాళ్లను చూడడం నిషేధంగా పెట్టుకున్నారని ఆమెకు ప్రవేశం నిరాకరించారు. ఆమె ఆయన శిష్యులను ఉద్దేశించి..''నాకు తెలిసి బృందావనంలో కృష్ణుడొక్కడే పురుషుడు. ఇక్కడ మరో పురుషుడు కూడా ఉన్నాడా?'' అన్నది. అదీ ఆమె భక్తి తన్మయత్వం. ఈ రోజుకి కూడా మీరా భజనలకు అమితమైన ఆదరణ ఉంది.







కవయిత్రి మొల్ల. మూడు నాలుగు రోజులలో రామాయణాన్ని అంతటినీ పూర్తి చేసింది. సాహిత్యంలో విదుషీమణి. అలాగే భక్తితో ఈ దేశానికి సేవ చేయాలని విదేశాలనుంచి వచ్చిన స్త్రీలలో మార్గరెట్ ఎలిజబెత్ నోబెల్ ఒకరు. ఆమె విదేశాల్లో వివేకానందుడి ప్రసంగాలు విని ప్రభావితురాలై భారతదేశానికి వచ్చేసింది. భారతీయ సంస్కృతిని ఆకళింపు చేసుకుని, తన జీవితాన్ని భగవంతుడికి నివేదన చేసుకున్న కారణంగా వివేకానంద ఆమె పేరును సిస్టర్ నివేదితగా మార్చారు. ''నేను ఎవరో ఒకరిద్దరు బిడ్డలకు తల్లిని కాను. ఈ లోకమంతా నా బిడ్డలే'' అన్న భావనతో తన సర్వస్వం, చివరకు ఆర్తులను ఆదుకోవడానికి తన అన్నపానీయాలను కూడా త్యాగం చేసిన తల్లి ఆమె.

ఏదో భక్తిలోనో, సేవలోనో కాదు.. యుద్ధరంగంలో ప్రవేశించి ధీరత్వం చూపించిన సమయంలో కూడా మాతృత్వాన్ని మరచిపోలేదు... వారణాసిలో పుట్టి ఎక్కడో ఝాన్సీని పరిపాలించే గంగాధరరావుని వివాహమాడి లార్డ్ డల్హౌసీ ప్రవేశపెట్టిన దత్తత స్వీకార రద్దు చట్టం వల్ల తన రాజ్యమే పోతే తను పెంచుకున్న దామోదరరావుకు రాజ్యం దక్కడం కోసమని బిడ్డను అంతఃపురంలో వదిలేసి యుద్ధానికి వెడితే తాను తిరిగి రానేమో, తను చనిపోతే బిడ్డడిని చిత్రహింస చేస్తారేమోనని, మాతృత్వాన్ని వదులుకోలేక... పెంచుకున్న బిడ్డ దామోదరరావుని ఉత్తరీయంతోటి చీర కొంగుతో బిగించి కట్టుకుని... ముందునుంచి కత్తితో పొడిస్తే బిడ్డగుండెలో బాకు గుచ్చుకోకూడదని వెనక వీపుకు కట్టుకుని యుద్ధానికి వెళ్ళి... చనిపోయే పరిస్థితి ఎదురయితే బిడ్డకంటే ముందే తాను ప్రాణాలు వదిలేలా ఏర్పాటు చేసుకుని వీరోచితంగా పోరాడిన ఝాన్సీ లక్ష్మీబాయి పుట్టిన గడ్డ ఇది.



## స్థితప్రజ్ఞ కౌసల్య

దశరథుని ముగ్గురు పత్నులలో పెద్దభార్య. అయోధ్య నగరానికి మహారాణి. రాముని తల్లి కౌసల్య. పేరుకు తగ్గట్టే ఆమె కుశలత, కౌశల్యం ఉన్న స్థితప్రజ్ఞురాలు. సవతి కైకేయికి భర్త ఇచ్చిన వరం మూలంగా పద్నాలుగేళ్ల పాటు తన పుత్రుడికి దూరమై అంతులేని వేదనను అనుభవించిన మాతృమూర్తి. భర్త నిస్సహాయత, కైకేయి దురాలోచన ఫలితంగా రాముడు వనవాసానికి వెళ్లి తాను శోకంలో మునిగిపోయినప్పటికీ తనయుడి పితృవాక్యపరిపాలనకు లోటు రాకూడదన్న సదాశయంతో, సంయమనంతో వ్యవహరించిన తల్లి కౌసల్యాదేవి.

రామాయణాన్ని పరిశీలిస్తే ఆమె ఒక్కో సందర్భంలో ఒక్కోలా కనిపిస్తుంది. కొన్ని సందర్భాలలో సాధారణమైన ఇల్లాలిగా... ఇంకొన్ని సందర్భాలలో సంయమనం ఉన్న పట్టపురాణిగా... ఒకోసారి మూర్తీభవించిన పుత్రవాత్సల్యం గల సాధారణ మాతృమూర్తిలా... కనిపించినప్పటికీ, తిరిగి అంతటిలోనే ఎంతో స్థితప్రజ్ఞత, పాండిత్యం, శాస్త్ర విషయాలు తెలిసున్న మహోన్నత స్త్రీగా దర్శనమిస్తుంది.

'నేను నాన్నగారి మాట విని తీరవలసిందే... ఆయన మాట మేరకు అడవులకు వెళ్లి తీరుతా'నని చెప్పిన రామయ్య మాటలను, ఆ మాటల వెనక కొడుకు ధర్మనిరతిని, పితృవాక్పాలనను, దృఢనిశ్చయాన్ని అమ్మగా అర్థం చేసుకుంది. తనను తాను స్థిమిత పరచుకుంది. ఎటువంటి పరిస్థితులలోనూ ధర్మాన్ని తప్పవద్దని చెప్పి, సీతకు పాతివ్రత్య ధర్మాన్ని బోధించి, ఇరువురినీ ఆలింగనం చేసుకుని, వెళ్లిరమ్మని నిండు మనస్సుతో ఆశీర్వదించి పంపుతుంది. పుత్ర వియోగాన్ని తట్టుకోలేక దశరథుడు మరణించడంతో పట్టపురాణిగా సహగమనానికి సిద్ధపడుతుంది. అనంతరం మహర్షుల మాటలతో తెప్పరిల్లి ఎప్పటికైనా తన రాముని అయోధ్యానగరానికి రాజుగా చూసుకోవాలన్న ఆకాంక్షతో ఆ ప్రయత్నాన్ని విరమించుకుంటుంది. ఆ తర్వాత వైధవ్య దుఃఖాన్ని, పుత్ర వియోగ భారాన్ని దిగమింగుకుని, అతి సామాన్య స్త్రీ వలె నిరాడంబరంగా గడుపుతూ పద్నాలుగేళ్లపాటు రాముని కోసం ఎదురు చూసి, తిరిగి శ్రీరామ పట్టాభిషేకం అనంతరం కన్ను మూస్తుంది కౌసల్య.

**ఒక మహారాజుకు భార్యగా... పట్టపురాణిగా... మర్యాదా పురుషోత్తముడిగా పేరుగాంచిన రాముడి తల్లిగా... ఉత్తమ ఇల్లాలైన సీతకు అత్తగారిగా... వివిధ రకాల విపత్కర పరిస్థితులలోనూ సంయమనాన్ని పాటించిన కౌసల్య పేరు రామాయణం ఉన్నంతకాలం చిరస్థాయిగా నిలిచిపోతుంది.**



## ఓరిమి ఊర్మిళ

ఊర్మిళ... ఈ పేరు చెప్పగానే సీతమ్మకు చెల్లెలుగా, లక్ష్మణుని భార్యగా... మరీ మాట్లాడితే నిద్రాదేవికి ముద్దుబిడ్డగా మాత్రమే ప్రపంచానికి పరిచయం. నిజానికి ఊర్మిళ ఓరిమిళ... రాముడితో పాటు వనవాసానికి వెళ్లడానికి నిర్ణయించుకున్నట్టు ఊర్మిళకు చెప్పాడు లక్ష్మణుడు. ఆమె బాధ్యతను కూడా వివరించాడు. యువరాణిగా, కోడలిగా తన తల్లిదండ్రులను చూసుకోవాలని, రాజ్యప్రజల బాధ్యత తీసుకోవాలని వివరించాడు.

లక్ష్మణుడు చెప్పిన దానికి ఊర్మిళ చాలా ధైర్యంగా సమాధానం చెప్పింది. రాముడు, సీతకు తన భర్త చేయాల్సిన సేవలను అర్థం చేసుకుని, ఈ వనవాసం గడిపే రోజుల్లో తన గురించి కనీసం ఆలోచించ కూడదని లక్ష్మణుడి నుంచి వాగ్దానం తీసుకుంది.

సీతారాములనే తల్లిదండ్రులుగా భావించి సేవలందించాలని, ఇక్కడ ఉన్న తమ గురించి ఆలోచించకండని ఊర్మిళ లక్ష్మణుడికి చెప్పింది. సీతారాములకు నిజాయితీగా సేవ చేయమని కోరుతూ.. ప్రోత్సహించింది.

ఊర్మిళ లక్ష్మణుడి కుటుంబ సభ్యులందరి కోసం త్యాగం చేసింది. తన భర్త 14 ఏళ్లు ఎలాంటి ఆటంకం లేకుండా.. సీతారాములకు సేవ చేయాలని భావించిన ఊర్మిళ.. ఈ పద్నాలుగేళ్లు.. ఆమె తన భర్త, సీత, రాముడి కోసం తన జీవితాన్ని త్యాగం చేస్తూ.. ఆరాధనాభావంలో మునిగిపోయి.. సన్యాసిగా మారిపోయింది. ఈ విషయం ఎవరికీ చెప్పలేదు. అయోధ్య నుంచి తిరిగి వచ్చిన సీతకు మాత్రం విధిలేక అంతా వివరించింది.

అప్పుడు సీత ఊర్మిళను ఓదారుస్తూ.. ఆమె తమకోసం ఎంతో త్యాగం చేసిందని.. నీ వేదన తీర్చడానికి లక్ష్మణుడితో మాట్లాడుతానని తెలిపింది. వెంటనే విషయం తెలుసుకున్న లక్ష్మణుడు తన తప్పు తెలుసుకుని.. ఊర్మిళకు క్షమాపణ చెప్పాడు.

**ఊర్మిళ నిద్ర పేరుతో14 ఏళ్లు సన్యాస జీవితం గడపడమే కాదు.. రాణివాసపు జీవితాన్ని, సుఖభోగాలను కూడా పక్కన పెట్టింది. ఇదంతా కేవలం తన భర్త బాధ్యత నెరవేర్చడం కోసమే త్యాగం చేసింది. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా.. ఇంతటి త్యాగం చేసిన లక్ష్మణుడి భార్య ఊర్మిళ నిస్పందేహంగా ఓరిమికి, సహనానికి మారు పేరు.**



## తోడూ నీడ సీత

సీతారాముల కల్యాణం వేడుకగా జరిగింది. కొన్ని సంవత్సరాలు హాయిగా జరిగిపోయాయి. దశరథుడు రాముడికి పట్టాభిషేకం చేయాలని నిశ్చయించాడు. అందుకు తగ్గట్టుగా ఆచరించవలసిన నియమాలు సుమంత్రుడి ద్వారా తెలుసుకుని ఆచరించాడు. ఇంతలోనే పినతల్లి ద్వారా తండ్రి కోరికను తెలుసుకుని అరణ్యవాసానికి సిద్ధమయ్యాడు. విషయం చెప్పటం కోసం సీతాదేవి ఉన్న గృహం చేరుకున్నాడు. సీత చిరునవ్వుతో స్వాగతం పలికింది. రామచంద్రుడు గుండె బిగపట్టి, 'సీతా నన్ను నాన్నగారు అడవికి వెళ్లమన్నారు. నేను దండకారణ్యంలో పదునాలుగేళ్లు గడిపి వస్తాను. ఆ మాట నీకు చెప్పి వెళ్దామని వచ్చాను. ఈ రోజు నుంచి నువ్వు జాగ్రత్తగా మసలుకో వాలి... అంటూ జాగ్రత్తలు చెబుతూంటే, ''నువ్వు వీరుడైన రామచంద్రుడివేనా, నన్ను విడచి ఒంటరిగా అరణ్యాలకు వెళ్తానంటావా. ఇక్కడ అయోధ్యలో నీతో ఏ భోగభాగ్యాలు అనుభవించానో, ఇక ముందు అడవిలో నీతో అవే సుఖదుఃఖాలు అనుభవిస్తాను. అడవిలో క్రూర మృగాలుంటాయని భయపడే దాన్ని కాదు. రాజభవనంలో ఎలా ఉన్నానో, అరణ్యాలలోనూ అలాగే ఉండగలను. ఇది నా నిశ్చయం. దీనికి తిరుగులేదు... అంటుంటే రాముడు అనునయించడానికి ముందుకు వెళ్లాడు. సీత రాముడిని చేతులతో తోసి, 'మా తండ్రి నిన్ను మహావీరుడని పొరబడి నన్నిచ్చి పెళ్లి చేశాడు. పురుషాకృతిలో ఉన్న అబలవని తెలుసుకోలేకపోయాడు. నువ్వు కాదంటే ప్రాణం విడుస్తాను అంది. **అంత శక్తిమంతురాలు సీత. పుట్టింది రాజకుటుంబంలోనైనా, అవసరం వస్తే ఎంతటి కష్టాలనైనా ఓర్చుకోగలగటం బాల్యం నుంచే నేర్చుకుంది. అందుకే సీత మహిళా శక్తిగా, బలం కోల్పోయినవారికి ధైర్యాన్ని ఇస్తుంది.**



## సరైన తల్లి సత్యభామ

నరకాసుర వధలో శ్రీకృష్ణునికి సహాయపడింది సత్యభామ. యుద్ధం పూర్తయింది. నరకుడు మరణించాడు. అందరితోపాటు సత్యభామ కూడా పండుగ జరుపుకుంటోంది. ఇంతలో ఇరుగుపొరుగు స్త్రీలంతా కోపంగా సత్యభామ దగ్గరకు వచ్చారు. వారంతా ముక్తకంఠంతో 'నువ్వసలు తల్లివేనా! నీకసలు మాతృత్వం అంటే ఏమిటో తెలుసా? ఎక్కడైనా తల్లి తన బిడ్డను చంపుకుంటుందా?' అంటూ ప్రశ్నల పరంపరను సంధించారు. అందరినీ లోపలకు ఆహ్వానించి ఉచితాసనాలలో కూర్చోబెట్టి, గౌరవించింది. అనంతరం తన గళాన్ని సవరించుకుంటూ ''మీరందరూ నా మీద అంత పెద్ద నింద ఎందుకు వేశారో తెలుసుకోవచ్చా' అని అడిగింది. 'నువ్వు భూదేవిగా ఉన్నప్పుడు నరకుడు నీ కుమారుడే కదా! నీ కన్నబిడ్డను అంత కర్కోటకంగా ఎలా సంహరించావు'– తన సందేహాన్ని కొంచెం ఘాటుగానే వెలిబుచ్చింది ఓ తల్లి.

'మీ అందరి సందేహమూ ఇదేనా. ఇంకేమైనా ఉన్నాయా' అని ప్రశ్నించింది సత్యభామ.

అందరూ అదే తమ సందేహం అన్నట్లుగా తలలు ఊపారు. వారందరి ఏకైక ప్రశ్నకు సమాధానంగా, 'మీకు కలిగిన సందేహం సబబైనదే. ఆ ప్రశ్నకు నేను సమాధానం చెప్పవలసిందే. ఒక్కసారి నరకుడి గుణగణాల గురించి ఆలోచించండి. నరకుడు సజ్జనులను, సాధువులను. మునిజనాన్ని, స్త్రీజనాన్ని.. తన మాటను కాదన్న ప్రతివారినీ అడ్డు తొలగించుకుంటూ వచ్చాడు. భూలోకంలో మంచిని సమాధి చేయడానికి కంకణం కట్టుకున్నాడు. వాడి ఆగడాలకు అంతులేకుండా పోయింది. వాడు మారడని అర్థం అయ్యింది. అందుకే వాడిని సంహరించాలని నిశ్చయించుకున్నాను.. అంది. 'నేను కర్కోటకురాలిని కాను. మాతృత్వం అంటే తెలియని దాన్ని కాను. తల్లిగా నా బాధ్యత నెరవేర్చాను. పిల్లలను కీర్తిస్తుంటే ఆ గొప్పదనాన్ని తల్లిదండ్రులు తమదిగా భావిస్తారు. పిల్లలను దూషిస్తుంటే ఆ తప్పును కూడా తమదిగానే భావించాలి. ధృతరాష్ట్రుడు, గాంధారి దుర్యోధనాదుల అకృత్యాలను చూసీ చూడనట్టుగా వదిలేశారు పుత్రవ్యామోహంతో. దాంతో తల కొరివి పెట్టడానికి ఒక్కడూ మిగలలేదు. ఇక నరక వధ తథ్యమనుకున్నాను. శ్రీకృష్ణుడు నరకుడిని వధించాడు. ఒక కన్నతల్లిగా వాడిని నా ఒడిలోకి తీసుకున్నాను. తల్లిగా నా కర్తవ్యం నెరవేర్చాను. లోకకంటకుడిని సంహరించి, లోకానికి పూలబాట పరచాను. అటువంటి పుత్రుడు జన్మిస్తే, ఎవరైనా వారిని ఆదిలోనే ఖండించాలని ఆచరణలో చూపాను. ఇప్పుడు మీ అందరికీ నరకాసుర వధలోని ఆంతర్యం అర్థం అయ్యిందనుకుంటున్నాను'' అంటూ అందరివంకా చూసింది. అందరూ మౌనంగా తలలూపారు.

–డా. వైజయంతి పురాణపండ



## మహా ఇల్లాలు మండోదరి

మహాశిల్పి మయాసురుడికి, హేమ అనే గంధర్వకాంతకు పుట్టిన మండోదరి సౌందర్యవతి. సుగుణవతి. మయుడి వద్దకు వెళ్లిన రావణుడి కంట పడ్డ మండోదరిని మొదటి చూపులోనే మోహించేస్తాడు. ఆమెను ఒప్పించి, నొప్పించి మరీ వివాహం చేసుకుంటాడు రావణుడు.

తన భర్త గొప్ప శివభక్తుడు, పండితుడు, పరాక్రమవంతుడూ అయినా, అతనికి పరస్త్రీ వ్యామోహమనే అవలక్షణం ఉందని తెలిసీ మౌనంగా సహిస్తుంది, సహనంతో భరిస్తుంది. అనేక తప్పిదాలు, చెడు ధోరణులను అనుసరించే వ్యక్తి అయినా, ఆమె పతి భక్తి, అంకితభావం, బాధ్యత గల భార్యగా వాటన్నింటినీ ఖండించే వ్యక్తిత్వం ఉన్న స్త్రీగా, ఉత్తమ ఇల్లాలిగా పేరు తీసుకొస్తుంది. సీతాన్వేషణలో హనుమ అంతటివాడినే సీతమ్మగా భ్రమింపచేసిందంటే, ఆమె ఎంతటి తేజస్సంపన్నురాలో తెలుసుకోవచ్చు.

రావణ వధానంతరం యుద్ధ ప్రాంగణానికి వెళ్లిన మండోదరిని మహావీరుడైన తన భర్త విగత శరీరుడై రణరంగాన పడి ఉండడం కలచివేసింది. రాముడికి నమస్కరించి తన పతి శరీరానికి అంతిమ సంస్కారాలు చేసుకునేందుకు అనుమతి ఇమ్మని అర్థించింది.

రాముడామె మాటను మన్నించాడు. విభీషణుని పిలిచి, రావణుని శరీరానికి అంతిమ సంస్కారాలు జరపవలసిందిగా సూచిస్తాడు. ఆమెకు నిత్య సుమంగళి యోగం కలుగుతుందని, ఆమె పేరు విన్నంతనే పాపాలన్నీ తొలగిపోతాయనీ వరం ఇస్తాడు.

**భర్త చెడ్డవాడని కుంగిపోతూ కూచోకూడదు. చేతనైనంతలో ఆ చెడు లక్షణాలనుంచి మళ్లించి, సన్మార్గంలో పెట్టేందుకు ప్రయత్నం చేయాలి. చెడుని నివారించేందుకు అనుక్షణం పాటుపడాలి. మంచి పనులకు సంపూర్ణంగా సహకరించాలి.**



## ప్రతీకార కాంక్ష పాంచాలి

పాంచాల రాజు ద్రుపదుని కుమార్తెగా అల్లారుముద్దుగా పెరిగింది ద్రౌపది. అత్యంత లావణ్యరాశి అయిన ద్రౌపదికి స్వయంవరం ప్రకటించాడు ఆమె తండ్రి.

ఆమెను స్వయంవరంలో గెలిచిన అర్జునుడి తల్లి కుంతి అన్నమాటకు కట్టుబడి అయిదుగురు సోదరులనూ పెళ్ళి చేసుకోవలసి వచ్చింది. పాండవుల పత్నిగా అనేక సుఖభోగాలతోబాటు ఏ స్త్రీకీ జరగనంతటి అవమానాలూ, అవహేళనలూ అనుభవించక తప్పలేదు. భర్త అయిన ధర్మరాజు కౌరవులతో జరిగిన మాయాజూదంలో రాజ్యాన్ని, తమ్ములను, భార్యను, చివరకు తనకు తాను పణంగా పెట్టి ఓడిపోవడంతో ఏకవస్త్ర ఐన ద్రౌపదిని నిండుసభకు జుట్టుపట్టుకుని ఈడ్చుకు వచ్చాడు దుశ్శాసనుడు. దుర్యోధనుడు ఆమెను కూర్చోమని తన తొడను చూపించాడు. ఆమె పతులముందే ఆమెను వివస్త్రను చేయబూనాడు. ఆ ప్రయత్నం విఫలమైన తర్వాత పాండవులను అడవుల పాలు చేశాడు. ద్రౌపది పాండవులతోపాటు పన్నెండేళ్ళు వనవాసం చేయవల్సివచ్చింది. ఆ సమయంలోనే సైంధవుడు ద్రౌపదిని అపహరించడానికి ప్రయత్నించాడు. వనవాసం ముగిశాక అజ్ఞాతవాసంలో విరాటరాజు పత్ని సుధేష్ణాదేవికి సైరంధ్రిగా ఉండవలసి వచ్చింది. కీచకుడు ఆమెను బలవంతంగా అనుభవించటానికి యత్నించి భీముని చేతిలో చచ్చాడు.

అజ్ఞాతవాసం తరువాత రాయబారాలు, సంధి ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు ద్రౌపది వాటిని వ్యతిరేకించింది. యుద్ధం జరిగి, తనను అవమానించినవారిని తన భర్తలు నిర్జించి తన పగ తీర్చాలని కోరుకొంది. ఆ కోరిక నెరవేరే క్రమంలో తన పుత్రులను కోల్పోయి పెద్ద మూల్యమే చెల్లించుకోవలసి వచ్చింది. ఆ తర్వాత ఆమె కొన్నేళ్ళు హస్తినాపుర పట్టమహిషిగా జీవించింది. కొన్నాళ్ళకు పాండవులు మహాప్రస్థానం ప్రారంభించారు. ఆ యాత్రలో అందరి కన్నా ముందు మరణించింది ద్రౌపది.

**కౌరవుల దుష్కృత్యాలకు ప్రధాన బాధితురాలైన ద్రౌపది తన మనసుకు ఏర్పడ్డ గాయాన్ని ఒక అసామాన్యమైన పట్టుదలగా మార్చుకుని పగతో రగిలిపోతూ పాండవులలో యుద్ధం చేయాలనే పట్టుదలకు, ప్రతీకార కాంక్షకు ప్రేరణగా నిలిచింది.**

### ప్రెగ్నెంట్ మోడల్స్

సోషల్ మీడియా విస్తృతి పెరిగాక ఏం జరిగినా ఫొటోలు దిగడం, వాటిని షేర్ చేయడం సర్వసాధారణమైంది. ఒకప్పుడు గర్భిణులు బయటకి రావడానికి కూడా కాస్త బిడియపడేవారు. అందులోనూ సెలబ్రిటీలైతే కెమెరాలకు దూరంగా ఉండేవారు. గర్భం దాల్చినప్పుడు పెరిగే పొట్ట, భారీ శరీరంతో గ్లామరస్‌గా కనిపించమేమోనన్న సందేహాలు ఉండేవి. కానీ ఇప్పుడు ఆ ట్రెండ్ మారింది. గర్భం దాల్చినప్పుడు మహిళల్లో కనిపించే ఆ నిండుదనంలో ఒక అందం కూడా ఉంటుందని గ్రహించిన బాలీవుడ్ భామలు ప్రెగ్నెన్సీ వస్తే ఫొటో షూట్‌లు చేసి మరీ సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. దానినే స్ఫూర్తిగా తీసుకొని ఆయూష్ కేజ్రీవాల్ అనే ఫ్యాషన్ డిజైనర్ గర్భం దాలిస్తే ఆడవారిని మోడలింగ్‌కు దూరంగా ఉంచి ఎందుకు వివక్ష చూపించాలని భావించారు. వెంటనే ఓ గర్భిణితో కలంకారి చీరలకు మోడలింగ్ చేయించి, ఆ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో ఉంచారు. ఇలా ప్రెగ్నెంట్స్‌గా ఉన్నప్పటికీ మోడలింగ్ చేయడం ఇప్పుడు ఒక ట్రెండ్ అనే చెప్పాలి. గర్భిణులు వారికి ఇష్టమైతే పని చేస్తారు. లేదంటే బ్రేక్ తీసుకుంటారు. అది వారి స్వేచ్ఛ. కానీ మోడల్స్ అలా కాదు. వాళ్లకి ప్రెగ్నెన్సీ వస్తే తప్పనిసరిగా పనికి దూరం కావాలి. అలా పనిచేసే పరిస్థితి లేకపోవడం అంటే వారి స్వేచ్ఛను హరించడమే. అలాకాకుండా అమ్మతనాన్ని కూడా నిండుగా చూపించడమనే ట్రెండ్ ఇప్పుడిప్పుడే మొదలైంది. మున్ముందు ఇది మరింతగా విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.



### ఆతిథ్యంలో ఆమెది అందెవేసిన చెయ్యి

అతిథి మర్యాదల్లో మన మహిళామణులది అందెవేసిన చెయ్యి. ఇంటికి ఎవరైనా అతిథులొస్తే వారికి చిన్నపాటి కష్టం కలగకుండా సర్వం అమర్చిపెట్టే సహనం ఉన్న వారు. ఆ ఆతిథ్యమే ఇప్పుడు వారికి ఆర్థిక స్వావలంబనకి బాటలు వేసింది. ఎయిర్ బీఎన్‌బీ అంటే తెలుసా? ఆతిథ్య రంగంలో పేరొందిన అంతర్జాతీయ ఆన్‌లైన్ ప్లాట్ ఫాం. ప్రపంచ దేశాల్లో మనం ఎక్కడికి వెళ్లి ఉండాలన్నా.. ఫుల్ ఫర్నిచర్‌తో ఉన్న ఇళ్లు, సకల సౌకర్యాలతో బస కల్పించే ప్లాట్‌ఫాం ఇది. ఊళ్లు పట్టుకొని తిరిగే వారికి దీని ద్వారా బస ఏర్పాటు చేసుకోవడం సులభం. మహిళలు ఆతిథ్యమిచ్చే ఎయిర్‌బీఎన్‌బీ ద్వారా గతేడాది భారత్‌లో మహిళలు రూ.100 కోట్లకు పైగా సంపాదించారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 40 శాతం ఎక్కువ. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, కోల్‌కతా, జైపూర్‌లలో ఎయిర్ బీఎన్‌బీ వినియోగదారులు ఎక్కువ. భారతీయ మహిళల్లో 34 శాతం మంది దీని ద్వారా ఆతిథ్యమిస్తే, 40 శాతం మంది అతిథులుగా వెళ్లి ఎంజాయ్ చేశారు. ఇక ఎయిర్ బీఎన్‌బీ ద్వారా ఆతిథ్యమిచ్చి ప్రపంచవ్యాప్తంగా మహిళలు 14,900 కోట్ల డాలర్ల ఆదాయాన్ని ఆర్జించారు. ఇలా మహిళలకి ఆర్థిక స్వేచ్ఛ రావడమే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థకి వెన్నుదన్నుగా నిలుస్తుందని ఎయిర్‌బీఎన్‌బీ ఇండియా కంట్రీ మేనేజర్ అమన్‌ప్రీత్ సింగ్ బజాజ్ అంటున్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని #hostwithher హ్యాష్‌ట్యాగ్‌తో మహిళల్లో పారిశ్రామిక స్ఫూర్తిని నింపే ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. డిజిటల్ టూరిజం కీలకంగా మారిన ఈ రోజుల్లో మహిళల సంపాదన శక్తి ఎలా పెరుగుతోందో ఎయిర్ బీఎన్‌బీ రుజువు చేస్తోంది.



# కోవిడ్‌పై వదంతులు నమ్మొద్దు

## ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ

కోవిడ్–19 (కరోనా వైరస్)కు సంబంధించి వస్తున్న వదంతులను నమ్మరాదని, వైద్యుల సలహా, సూచనలను కచ్చితంగా పాటించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రజలు షేక్‌హ్యాండ్లను మానేసి ఇతరులను పలకరించేందుకు నమస్కారాన్ని వాడాలని కోరారు. జన్ ఔషధి దివస్ సందర్భంగా శనివారం ప్రధాని మోదీ కొంత మంది జన ఔషధి దుకాణదారులు, ప్రధానమంత్రి భారతీయ జనౌషధి పరియోజన (పీఎంబీజేపీ) లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. 'కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్న ఈ తరుణంలో రకరకాల వదంతులు పుట్టుకొస్తాయి. కొంతమంది వైరస్‌కు దూరంగా ఉండేందుకు ఫలానాది తినమని సలహాలిస్తుంటారు. దయచేసి వేటినీ నమ్మవద్దు. ఏం చేసినా.. వైద్యులు చెప్పినట్లు మాత్రమే చేయండి. మీరే వైద్యులు కావొద్దు' అని ఆయన స్పష్టం చేశారు.

జన ఔషధి పథకం ద్వారా భారీగా లబ్ధి పొందింది ఈ దేశ పేదలు మాత్రమేనని ప్రధాని మోదీ అన్నారు. పీఎంబీజేపీ ద్వారా దేశం మొత్తమ్మీద నెలనెలా కోటి మందికి ఔషధాలు చౌకగా అందుతున్నాయని, దేశవ్యాప్తంగా ఉన్న ఆరు వేల జన ఔషధి కేంద్రాల ద్వారా పేదల సొమ్ము రూ.2000 నుంచి 2500 కోట్లు ఆదా చేయగలిగామని వివరించారు. ఈ కేంద్రాల్లో మందులు గరిష్ట అమ్మకం రేటు కంటే 50 నుంచి 90 శాతం తక్కువ ధరకు లభిస్తాయని వివరించారు. కేన్సర్ వ్యాధి చికిత్సకు వినియోగించే మందులు మార్కెట్‌లో రూ.6500 వరకూ ఉంటే జన ఔషధి కేంద్రాల్లో కేవలం రూ.850 మాత్రమే ఉంటుందని ఆయన వివరించారు. ఈ కేంద్రాల నిర్వాహకుల శ్రమను గుర్తించేందుకు అవార్డులు అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.





శనివారం వీడియోకాన్ఫరెన్స్‌లో డెహ్రాడూన్ మహిళ మాటలు విన్నాక ఉద్వేగానికిలోనైన ప్రధాని మోదీ

### మీరు మా దేవుడు...

ప్రధానితో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో డెహ్రాడూన్‌కు చెందిన దీపా షా అనే మహిళ మాట్లాడుతూ.. 'నేను దేవుడిని చూడలేదు. కానీ మీలో మాకు దేవుడు కనిపిస్తున్నాడు' అని వ్యాఖ్యానించడంతో ప్రధాని ఉద్వేగానికి గురయ్యారు. కాసేపు ఆయన ఏమీ మాట్లాడలేకపోయారు. 2011లో పక్షవాతానికి గురైన దీపా మాట్లాడుతూ.. 'మొదట్లో నా మందుల ఖర్చు చాలా ఎక్కువగా ఉండేది. జన ఔషధి కేంద్రాల కారణంగా నెలకు రూ.3500 ఆదా చేయగలుగుతున్నాను' అని మోదీతో చెప్పారు. 'మీరు మీ ఆత్మస్థైర్యంతో వ్యాధిని జయించారు' అని మోదీ ఆమెతో అన్నారు. సుమారు 3.5 లక్షల మంది ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగమయ్యారని, మూడు లక్షల మంది వృద్ధులకు పింఛన్ లభిస్తోందని ప్రధాని తెలిపారు.

# వైరస్‌పై ప్రధాని సమీక్ష

న్యూఢిల్లీ: కరోనా వైరస్(కోవిడ్–19) బారిన పడిన వారిని ఏకాంతంగా ఉంచేందుకు తగిన ప్రాంతాలను గుర్తించడంతోపాటు, వ్యాధి మరింత తీవ్రతరమైతే అన్ని అత్యవసర సేవలు అందించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని మోదీ అధికారులను ఆదేశించారు. దేశంలో కరోనా వైరస్ పరిస్థితిపై శనివారం ప్రధాని సంబంధిత మంత్రిత్వ శాఖలు, విభాగాలతో సమీక్ష నిర్వహించారు. కోవిడ్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయాలని, ప్రజలు పెద్ద ఎత్తున ఒకచోట గుమికూడే పరిస్థితులను నివారించాలని అధికారులకు సూచించారు. 'అన్ని విభాగాల వారూ సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలి. అవగాహన పెంచే ప్రయత్నాలు చేపట్టాలి. ముందు జాగ్రత్త చర్యలనూ వివరించాలి' అని ప్రధాని కోరినట్లు అధికారిక ప్రకటన ఒకటి తెలిపింది. కోవిడ్ నియంత్రణకు ప్రపంచవ్యాప్తంగా ఆచరిస్తున్న పద్ధతుల్లో మేలైనవి ఎంచుకుని అమలు చేయాలని ప్రధాని కోరారని ప్రకటనలో పేర్కొన్నారు.

### వైరస్ టెస్టింగ్‌కు 52 కేంద్రాలు

కరోనా వైరస్ పరీక్షలు జరిపేందుకు దేశవ్యాప్తంగా 52 కేంద్రాలు ఏర్పాటయ్యాయి. వీటితో పాటు రక్త నమూనాల సేకరణ విషయంలో సహకరించేందుకు మరో 57 పరిశోధనశాలలను గుర్తించినట్లు ఆరోగ్యశాఖ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో ఇప్పటివరకూ 34 మంది కోవిడ్ బారిన పడినట్లు నిర్ధారణ కాగా, వీరిలో 16 మంది ఇటలీ పర్యాటకులు ఉన్న విషయం తెలిసిందే. మరో 29 వేల మంది వైద్య పర్యవేక్షణలో ఉన్నారు. కరోనా వైరస్ పరీక్షలు నిర్వహించే కేంద్రాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని స్విమ్స్, విశాఖలోని ఆంధ్ర మెడికల్ కాలేజీ, అనంతపురములోని జీఎంసీలు ఉన్నాయి. అలాగే బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ, మైసూర్ మెడికల్ కాలేజీ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, హాసన్, శివమొగ్గ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లలో పరీక్షలు జరుగుతాయి.

### కాలర్ టోన్లతో కరోనా వైరస్ అవగాహన

పలు టెలికం సర్వీసుల్లో రింగ్‌టోన్లకు బదులు వైరస్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మొదలుకొని జబ్బు లక్షణాలను వివరించే కాలర్ టోన్లు వినిపిస్తున్నాయి. కేంద్రం టెలికం ఆపరేటర్లకు ఈ ఆడియో క్లిప్‌ను అందించగా వాటిని తాము కాలర్ ట్యూన్ల కోసం డబ్బు చెల్లించే వారికి మినహా మిగిలిన వారందరికీ అందిస్తున్నట్లు ఒక టెలికం ఆపరేటర్ తెలిపారు. కరోనా వైరస్‌పై యుద్ధంలో కార్పొరేట్ సంస్థలు రంగంలోకి దిగాయి. పేటీఎం, ట్విట్టర్ వంటి కంపెనీలు ఉద్యోగులను ఇంట్లో నుంచే పనిచేయాలని అప్పటికే ఆదేశాలు జారీ చేయగా, రిలయన్స్ జియో తమ ఆఫీసుల్లో అటెండెన్స్‌కు వాడే బయోమెట్రిక్ యంత్రాలను పక్కనబెట్టింది. ఓలా తమ డ్రైవర్లకు మాస్కులు, శానిటైజర్లను అందించడం మొదలుపెట్టింది.

### భారత్‌లో మరో మూడు

దేశంలో మరో ముగ్గురు కోవిడ్–19 బారిన పడినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. కోవిడ్– 19 బారిన పడిన వీరిలో ఇద్దరు లడాఖ్‌కు చెందిన వారు కాగా.. ఇటీవలే ఇరాన్‌కు వెళ్లారని, మిగిలిన ఒక వ్యక్తి తమిళనాడుకు చెందిన వారని ఒమన్‌ను సందర్శించారని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటనలో వివరించారు. దీంతో భారత్‌లో ఈ వ్యాధి బారిన పడ్డ వారి సంఖ్య 34కు చేరుకున్నట్లు అయింది. తాజాగా కోవిడ్ వైరస్ బారిన పడ్డ ఈ ముగ్గురి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉంది.



కోల్‌కతాలో మాస్కులు ధరించే హోలీ జరుపుకుంటున్న ఎన్జీవో మహిళా సభ్యులు

### అదిరే ధర



18వ శతాబ్దానికి చెందిన చైనా చక్రవర్తి ఖ్వీన్‌లాంగ్‌కు చెందిన ఈ అరుదైన పింగాణీ పాత్రను ఫ్రాన్స్‌లో వేలంవేయగా రూ.34 కోట్ల ధర పలికింది.

# కోవిడ్ కేసులు లక్ష పైనే

- హుబే ప్రాంతంలో క్వారంటైన్ ఎత్తివేత?
- 97 దేశాలకు విస్తరించిన కరోనా వైరస్
- ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన

బీజింగ్: ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ బాధితుల సంఖ్య శనివారం నాటి లెక్కల ప్రకారం లక్ష దాటిపోగా, 3500 మందికిపైగా చనిపోయారు. చైనాలోని వూహాన్ సిటీలో గత డిసెంబరులో తొలిసారి కరోనా వైరస్‌ను గుర్తించగా.. తాజాగా ఇది 97 దేశాలకు విస్తరించడం ప్రపంచ ఆరోగ్య సంస్థను ఆందోళనకు గురి చేస్తోంది. భూటాన్, కామరూన్, సెర్బియా, దక్షిణాఫ్రికాల్లో కొత్తగా కోవిడ్ కేసులు నమోదయ్యాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. వేసవి కారణంగా వైరస్ తీవ్రత తగ్గుముఖం పడుతుందన్న అంచనాలకు శాస్త్రీయ ఆధారాలేవీ లేవని, అన్ని దేశాలూ వైరస్ కట్టడికి చేస్తున్న ప్రయత్నాల తీవ్రతను తగ్గించరాదని డబ్ల్యూహెచ్‌ఓ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైఖేల్ రయన్ స్పష్టం చేశారు. అమెరికాలో కోవిడ్ కారణంగా 14 మంది, ఇటలీలో 233 మంది మరణించారు.



జమ్మూలోని వైద్య కళాశాలలో 'కోవిడ్ బ్లాక్'లో మాస్కులు ధరించిన వైద్యులు

### చైనాలో కొత్త కేసులూ తగ్గుముఖం

చైనాలో కోవిడ్ కారణంగా మరణించిన వారి సంఖ్య 3070కు చేరుకుందని చైనా ఆరోగ్య కమిషన్ అధికారులు శనివారం తెలిపారు. వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయిన వారి సంఖ్య 80,651గా ఉంటే ప్రపంచవ్యాప్తంగా ఇది 1.02 లక్షలకు చేరుకుందని వివరించారు. చైనా మొత్తమ్మీద శుక్రవారం 28 మంది మరణించగా, కొత్తగా 99 మందికి వైరస్ సోకింది. ఒక రోజులో కొత్తగా వ్యాధి సోకిన వారి సంఖ్య వంద కంటే తక్కువగా ఉండటం ఇదే తొలి సారి. వ్యాధి తీవ్రత తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో హుబే ప్రాంతంలో క్వారంటైన్ (విడిగా ఉంచడం)ను ఎత్తివేయనున్నట్లు చైనా సూచన ప్రాయంగా తెలిపింది. చైనా పొరుగునే ఉన్న దక్షిణ కొరియాలో శనివారం నాటికి వ్యాధి బారిన పడ్డ వారి సంఖ్య ఏడు వేలకు చేరుకుంది. ఇరాన్ లో ఇప్పటివరకు 145 మంది మరణించారు. వ్యాధిసోకిన వారి సంఖ్య 5823కి చేరినట్లు అయింది.

### 'కోవిడ్' భవనం కూలింది

కోవిడ్ బాధితులను చికిత్స కోసం ఉంచిన ఓ భవనం కూలింది. చైనాలోని ఫుజియాన్ ప్రావిన్సు క్వాన్‌ఝౌ నగరంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. 80 గదులున్న ఓ హోటల్‌ను ప్రస్తుతం కోవిడ్ బాధితుల క్వారంటైన్ కోసం ఉపయోగిస్తున్నారు. ఇప్పటి వరకు 30 మందిని రక్షించామని, శిథిలాల కింద మరో 70 మంది చిక్కుకుని ఉంటారని అధికారులు తెలిపారు.

### జయప్రదపై వారెంటు

రాంపూర్: బీజేపీ నేత, సీనియర్ నటి జయప్రదపై నాన్ బెయిలబుల్ వారంట్ జారీ అయింది. గతేడాది జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకుగానూ వారెంటు జారీ చేస్తున్నట్లు ఉత్తర ప్రదేశ్‌లోని ఓ కోర్టు తెలిపింది. తదుపరి విచారణను ఏప్రిల్ 20కి వాయిదా వేసింది. ఆ ఎన్నికల్లో జయప్రద సమాజ్‌వాద్ పార్టీ నేత ఆజం ఖాన్ చేతిలో సుమారు లక్షకు పైగా ఓట్ల తేడాతో ఓటమిపాలైన సంగతి తెలిసిందే.

### బీజేపీ నుంచి మాత్రమే విడిపోయాం: ఉద్ధవ్



ముంబై: మహారాష్ట్ర ముఖ్యమంత్రి, శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే శనివారం అయోధ్య రామాలయాన్ని సందర్శించారు. సీఎంగా 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా అయోధ్య పర్యటనకు వెళ్లిన ఉద్ధవ్.. అయోధ్యలో రామాలయ నిర్మాణానికి రూ. కోటి విరాళమిస్తానని ప్రకటించారు. తమ పార్టీ బీజేపీ కూటమి నుంచే విడిపోయిందని, హిందుత్వ నుంచి కాదని ఉద్ధవ్ పేర్కొన్నారు. గతేడాది నవంబర్ 28న మహా వికాస్ అఘాడి కూటమి తరఫున ఉద్ధవ్ ఠాక్రే మహారాష్ట్ర సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారానికి ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించి 100 రోజులు పూర్తైంది. శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్ కలిసి మహా వికాస్ అఘాడి కూటమిని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

### మలయాళం న్యూస్ చానెళ్లపై నిషేధం ఎత్తివేత

న్యూఢిల్లీ: ఢిల్లీలో చెలరేగిన హింసపై ఏకపక్ష వార్తలు ప్రసారం చేశారన్న ఆరోపణలపై రెండు మలయాళం వార్తా చానళ్లు ఏసియానెట్ న్యూస్, మీడియా వన్‌లపై శుక్రవారం విధించిన 48 గంటల నిషేధాన్ని కేంద్రం ఎత్తివేసింది. ఫిబ్రవరి 25న ప్రసారం చేసిన వార్తలకు అదే నెల 28న కేంద్రం షోకాజ్ నోటీసులు జారీచేసింది. చానళ్లు ఇచ్చిన సమాధానంతో సంతృప్తిపడని కేంద్రం శుక్రవారం రాత్రి 7:30 గంటల నుంచి, ఆదివారం రాత్రి 7:30 గంటల వరకు నిషేధాన్ని విధించింది. మీడియాపై నిషేధాన్ని కాంగ్రెస్, సీపీఐలు తీవ్రంగా తప్పుపట్టాయి. దీంతో ప్రభుత్వం నిషేధాన్ని ఎత్తివేస్తూ ఆదేశాలు జారీచేసింది.



తమిళనాడులోని నాగపట్నంలో రైతులతో కలసి నర్సరీలో వరి నాట్లు వేస్తున్న సీఎం పళనిస్వామి

## 'గాప్' సీఈవోగా సోనియా సింగాల్

ఇంద్రా నూయి తర్వాత ఆ ఘనత సాధించిన రెండో భారతీయ అమెరికన్ మహిళ

పెప్సీకో సీఈవో ఇంద్రా నూయి తర్వాత అంతటి ఘనతను మరో భారత సంతతి మహిళ సాధించారు. భారత సంతతి అమెరికన్ మహిళల్లోనే అత్యున్నత హోదా సాధించారు. ఆమే సోనియా సింగాల్(49). ఫార్చ్యూన్500 కంపెనీల్లో 186వ స్థానంలో ఉన్న ప్రముఖ దుస్తుల తయారీ సంస్థ 'గాప్ ఇంక్'కు ఆమె సీఈవో అయ్యారు. ఈ కంపెనీ ఆదాయం ఏడాదికి 18 బిలియన్ డాలర్లు. అమెరికాసహా విదేశాల్లో 3,727 స్టోర్లు ఉన్న ఈ సంస్థలో 1.35 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అంతకుముందు ఈమె సన్ మైక్రోసిస్టమ్స్, ఫోర్డ్ మోటార్స్‌లో 15 ఏళ్లపాటు పనిచేశారు. గాప్ ఇంక్‌లో 2004లో చేరిన ఈమె గ్రూప్‌లోని ఓల్డ్ నేవీ సీఈవోగా, గాప్ ఇంక్ యూరప్ ఎండీగా ఉన్నారు. అమెరికాలో ముగ్గురు శ్వేత జాతి నాయకుల మధ్య ఎన్నికల ప్రచారంలో భాగంగా భిన్నత్వం, లింగ సమానత్వంపై జోరుగా చర్చ సాగుతున్న సమయంలో ఈ నియామకం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఫార్చ్యూన్500 కంపెనీల్లో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా 33 మంది మహిళలు ప్రస్తుతం సీఈవోలుగా ఉన్నారు. వలస వచ్చిన కుటుంబాల నుంచి మహిళలు సీఈవో స్థాయికి ఎదగడం అరుదు. భారత్‌లో పుట్టిన సోనియా కుటుంబం.. ఆమె చిన్నతనంలో కెనడాకు తర్వాత అమెరికాకు వెళ్లింది. సోనియా కెట్టరింగ్ వర్సిటీ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ, స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పొందారు.



### డీఎంకే ప్రధాన కార్యదర్శి అన్బళగన్ కన్నుమూత



సాక్షి ప్రతినిధి, చెన్నై: తమిళనాడు రాజకీయ కురువృద్ధుడు, డీఎంకే ప్రధాన కార్యదర్శి కె.అన్బళగన్ (98) కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చెన్నైలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. అన్బళగన్ మృతితో పార్టీ కార్యక్రమాలను శనివారం నుంచి వారం రోజులపాటు వాయిదా వేసినట్లు డీఎంకే ప్రధాన కార్యాలయం ప్రకటించింది. అన్బళగన్ పార్థివదేహంపై డీఎంకే పతాకాన్ని కప్పారు. డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్, పార్టీనేతలు కనిమొళి, దురై మురుగన్ నివాళులర్పించారు. కరుణానిధికి మిత్రుడిగా మెలిగిన అన్బళగన్ గత 43ఏళ్లుగా పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. తొమ్మిదిసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచారు. శనివారం సాయంత్రం ఆయన అంత్యక్రియలు ముగిశాయి.

### ఎస్‌బీఐలో యస్‌బ్యాంక్ విలీనం కాదు: రజనీష్

న్యూఢిల్లీ: ఎస్‌బీఐలో యస్‌బ్యాంక్ విలీనం ప్రసక్తే లేదని, కేవలం దాంట్లో వాటాను కొంటామని ఎస్‌బీఐ ఛైర్మన్ రజనీష్ కుమార్ చెప్పారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్‌బీఐ ప్రతిపాదించిన డ్రాఫ్ట్ స్కీంపై స్పందించేందుకు తమకు సోమవారం వరకు గడువుందన్నారు. మొండిబకాయిలతో ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయిన యస్‌బ్యాంక్‌ను గట్టెక్కించేందుకు ఆర్‌బీఐ ప్రతిపాదించిన డ్రాఫ్ట్ స్కీంపై తమ బ్యాంక్ న్యాయ బృందం పనిచేస్తోందన్నారు. ఎస్‌బీఐలో యస్‌బ్యాంక్ విలీనం ఎట్టిపరిస్థితుల్లో ఉండదని స్పష్టంచేశారు. 'యస్‌బ్యాంక్‌లో 49 శాతం వాటాను ఎస్‌బీఐ కొనుగోలు చేస్తే రూ.2,400కోట్ల పెట్టుబడి అవసరం అవుతోంది. పెట్టుబడి పథకాన్ని చూశాక 23 మంది ఇన్వెస్టర్లు ఎస్‌బీఐని సంప్రదించారు' అని చెప్పారు. 'యస్‌బ్యాంక్‌లో ఎస్‌బీఐ 49 శాతం కొంటుందా? లేక 26 శాతం తీసుకుంటుందా? అనేది ఇన్వెస్ట్‌మెంట్‌పై ఆధారపడి ఉంటుంది. మరికొందరు ఇన్వెస్టర్ల నుండి వచ్చిన ఆసక్తిని పరిశీలిస్తున్నాం' అని పేర్కొన్నారు.

### సౌదీ రాజుకు వ్యతిరేకంగా కుట్ర

రియాద్: సౌదీ అరేబియా రాజును గద్దె దింపేందుకు కుట్ర పన్నారన్న ఆరోపణలపై అధికారులు ముగ్గురు యువరాజులను అరెస్ట్ చేశారు. రాజు సల్మాన్ తమ్ముడు అహ్మద్ బిన్ అబ్దుల్ అజీజ్ అల్ సౌద్, దగ్గరి బంధువు మహమ్మద్ బిన్ నయేఫ్‌లు ఇందులో ఉన్నట్లు అమెరికా మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. శుక్రవారం ఉదయం యువరాజులు ముగ్గురిని వారి ఇళ్ల నుంచి అరెస్ట్ చేసినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ ఒక కథనాన్ని ప్రచురించింది. సౌదీ రాజు సల్మాన్‌తోపాటు ఆయన కొడుకు మహ్మద్ బిన్ సల్మాన్‌లను గద్దె దింపేందుకు కుట్ర పన్నినట్లు వీరిపై న్యాయస్థానంలో అభియోగాలు నమోదయ్యాయి. ఈ ఆరోపణలు రుజువైతే నిందితులకు జీవితకాల ఖైదు లేదంటే మరణ శిక్ష పడే అవకాశం ఉంది. నయేఫ్‌తోపాటు ఆయన తమ్ముడు నవాఫ్ బిన్ నయేఫ్ కూడా అరెస్ట్ అయినట్లు న్యూయార్క్ టైమ్స్ తెలిపింది.

## ఏ దేశమూ అందరినీ ఆహ్వానించదు

సీఏఏ ఆందోళనలపై విదేశాంగ మంత్రి జైశంకర్



న్యూఢిల్లీ: ప్రపంచంలోని ఏ దేశమూ అందరినీ ఆహ్వానించదని విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నారు. ఎకనామిక్ టైమ్స్ గ్లోబల్ బిజినెస్ సమిట్‌లో సీఏఏ వ్యతిరేక వాదనలపై అడిగిన ప్రశ్నకు ఆయన స్పందించారు. 'ఏ దేశానికీ చెందని వారిని పౌరులుగా గుర్తించేందుకు ఈ చట్టం చేశాం. దేశం ఎదుర్కొంటున్న శరణార్థుల సమస్యను పరిష్కరించేందుకు ఇది ఉపయోగపడుతుంది. పౌరసత్వంపై దేశానికో నిర్వచనం, విధానం ఉంటాయి. ప్రపంచంలో అందరినీ స్వాగతించే దేశమేదైనా ఉంటే చూపండి. అలా ఎవరూ చూపలేరు. అమెరికాను చూడండి. యూరోపియన్లను చూడండి. యూరప్‌లో అయితే ఒక్కో దేశానికీ ఒక్కో విధానం ఉన్నాయి' అని వ్యాఖ్యానించారు. సీఏఏ విషయంలో భారత్ ప్రపంచాన్ని ఒప్పించలేకపోయిందా అన్న ప్రశ్నకు ఆయన.. బ్రస్సెల్స్‌లో 27 దేశాల మంత్రులతో జరిగిన సమావేశంలో సీఏఏపై వాస్తవాలను వివరించానన్నారు. ఈ విషయంలో భారత్ తన స్నేహితులను కోల్పోతుందా అన్న ప్రశ్నపై.. వాస్తవ మిత్రులెవరో కూడా ఇప్పుడే తెలిసే అవకాశం ఉంది కదా? అని ప్రశ్నించారు. 'ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశం భారత్. మూడో ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోంది. గతంలో మాదిరిగా నేడు రక్షణాత్మకంగా వ్యవహరించ లేదు. ప్రతి ఒక్కరితోనూ సంబంధాలు కలిగి ఉండాలి. ప్రతి సమస్యకూ పరిష్కారం కనుగొనాల్సిందే. భారత్‌లో జరుగుతున్న పరిణామాలను కొందరు అంగీకరించవచ్చు. మరికొందరు అంగీకరించక పోవచ్చు. ఈ రెంటినీ ఒకే గాటన కట్టలేం. ఇందుకు తగినట్లుగా ఆయా దేశాలతో మనం వ్యవహారం సాగించాల్సి ఉంది' అని తెలిపారు. కశ్మీర్‌లో పరిస్థితులపై ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కౌన్సిల్ (యూఎన్‌హెచ్‌ఆర్‌సీ) డైరెక్టర్ వ్యక్తం చేసిన అభ్యంతరాలపై ఆయన స్పందిస్తూ.. గతంలోనూ యూఎన్‌హెచ్‌ఆర్‌సీ ఇటువంటి తప్పుడు అభిప్రాయాన్నే వ్యక్తం చేసింది. కశ్మీర్‌లో పొరుగుదేశం ప్రేరేపిస్తున్న సీమాంతర ఉగ్రవాదంపై యూఎన్‌హెచ్‌ఆర్‌సీ ఏమీ చేయలేకపోయింది' అని పేర్కొన్నారు.

సాక్షి స్పోర్ట్స్
ఆదివారం
8-3-2020

## క్రొయేషియా చేతిలో భారత్ ఓటమి

డేవిస్ కప్ పురుషుల ప్రపంచ టీమ్ టెన్నిస్ టోర్నీ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో భారత్ 1-3తో క్రొయేషియా చేతిలో ఓడిపోయింది. జాగ్రెబ్‌లో శనివారం జరిగిన మూడో మ్యాచ్‌లో లియాండర్ పేస్-రోహన్ బోపన్న జంట (భారత్) 6-3, 6-7 (9/11), 7-5తో మ్యాట్ పావిచ్-స్కుగోర్ జోడీపై గెలిచింది. అయితే నాలుగో మ్యాచ్‌లో సుమీత్ నాగల్ 0-6, 1-6తో మారిన్ సిలిచ్ చేతిలో ఓడటంతో భారత పరాజయం ఖాయమైంది. ఫలితం తేలిపోవడంతో ఐదో మ్యాచ్‌ను నిర్వహించలేదు.

*లక్ష మంది ప్రేక్షకులు... దాదాపు రెండేళ్ల క్రితం అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల టి20 ప్రపంచ కప్-2020 ఫైనల్ వేదికను మెల్‌బోర్న్‌గా ప్రకటించినప్పుడు ఆశించిన సంఖ్య! మహిళా దినోత్సవం రోజున ఈ పోరును నిర్వహిస్తే అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచవచ్చని భావించిన నిర్వాహకుల ఆలోచన ఇప్పుడు సరిగ్గా కార్యరూపం దాలుస్తోంది. రికార్డు స్థాయిలో అభిమానుల హాజరయ్యే అవకాశం ఉన్న మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో (ఎంసీజీ) రెండు అత్యుత్తమ జట్లు తుది పోరులో తలపడుతుండటంతో మహిళా క్రికెట్ చరిత్రలో ఎన్నడూ లేని క్రేజ్ ఈ ఫైనల్‌కు వచ్చేసింది. ఇక సమరం హోరాహోరీగా సాగడమే తరువాయి.*




టి20 వరల్డ్‌కప్ ట్రోఫీతో ఆస్ట్రేలియా కెప్టెన్ మెగ్ లానింగ్, భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్

*మొదటిసారి ఫైనల్లోకి ప్రవేశించిన జట్టు ఒకవైపు... నాలుగు సార్లు ఇప్పటికే చాంపియన్‌గా నిలిచిన టీమ్ మరోవైపు. సమష్టితత్వంతో వరుస విజయాలు సాధించి భారత్ తుది పోరుకు అర్హత సాధించగా... తొలి మ్యాచ్ ఓటమిని దాటి తమదైన ప్రొఫెషనలిజంతో ఆస్ట్రేలియా ముందంజ వేసింది. తొలి టైటిల్ సాధించే లక్ష్యంతో హర్మన్ సేనపై కాస్త ఒత్తిడి ఉండగా, ఇప్పటికే ఇలాంటి ఫైనల్స్ ఆడిన అనుభవంతో రాటుదేలిన ఆడ కంగారూలు ప్రశాంతంగా కనిపిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా టీవీల ముందే కాదు... ఎంసీజీలో కూడా భారీ సంఖ్యలోనే హాజరయ్యే భారత అభిమానుల ప్రపంచకప్ కల నెరవేరుతుందా!*

# మెల్‌బోర్న్‌లో.... మహారాణులు ఎవరో?

**నేడు మహిళల టి20 ప్రపంచ కప్ ఫైనల్**

- ఆతిథ్య ఆస్ట్రేలియాతో భారత్ 'ఢీ'
- తొలిసారి టైటిల్ వేటలో హర్మన్ సేన
- ఐదో ట్రోఫీ లక్ష్యంగా ఆసీస్
- అంతర్జాతీయ మహిళా దినోత్సవాన క్రికెట్ పండగ

**మధ్యాహ్నం గం.12.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1, 2లలో ప్రత్యక్ష ప్రసారం**

**మెల్‌బోర్న్:** క్రికెట్ ప్రపంచంలో అత్యధిక ఆదరణ ఉన్న జట్టుకు, ప్రపంచ నంబర్‌వన్ జట్టుకు మధ్య విశ్వ వేదికపై తుది సమరానికి సమయం వచ్చేసింది. నేడు ఇక్కడి ఎంసీజీలో జరిగే మహిళల టి20 ప్రపంచకప్ ఫైనల్లో ఆతిథ్య ఆస్ట్రేలియాతో భారత జట్టు తలపడనుంది. వరుసగా ఆరోసారి ఫైనల్ చేరిన ఆసీస్ ఇప్పటికే నాలుగుసార్లు విజేతగా నిలవగా, భారత్ మొదటిసారి ఫైనల్ బరిలోకి దిగుతోంది. లీగ్ దశలో ఇరు జట్ల మధ్య జరిగిన పోరులో భారత్ గెలిచింది. గ్రూప్ 'ఎ'లో భారత జట్టు ఆడిన అన్ని మ్యాచ్‌లలో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది. ఇదే గ్రూప్‌లో భారత్ చేతిలో ఓడిన అనంతరం ఆస్ట్రేలియా మిగిలిన మూడు మ్యాచ్‌లలో నెగ్గింది. ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్ వర్షం కారణంగా రద్దు కావడంతో భారత్ ముందంజ వేయగా...సెమీస్‌లో దక్షిణాఫ్రికాను ఓడించిన డిఫెండింగ్ చాంపియన్ ఫైనల్‌కు అర్హత సాధించింది.

గత కొన్నేళ్లుగా టి20ల్లో ఆసీస్ ఆధిపత్యం బాగా సాగింది. అయితే వారిని నిలవరించగలిగిన ఏకైక జట్టు భారత్ మాత్రమే. గత ఐదేళ్లలో ఇరు జట్ల మధ్య 10 మ్యాచ్‌లు జరిగితే భారత్ 5 గెలిచి, 5 ఓడింది. ఓడిన మ్యాచ్‌లతో సమాన సంఖ్యలో మరే జట్టు ఆసీస్‌పై గెలవలేకపోయింది. ఇటీవలి ముక్కోణపు టోర్నీతో కలిపి చూస్తే ఇరు జట్ల మధ్య జరిగిన ఐదు మ్యాచ్‌లో భారత్ 3 గెలిచి ఆధిక్యంలో ఉంది. అందుకే సొంత మైదానంలో ఆడుతున్నా సరే... తమకు విజయం అంత సులువు కాదని ఆసీస్‌కూ బాగా తెలుసు. కీలకమైన మ్యాచ్‌కు ముందు తమ స్టార్ ప్లేయర్ ఎలీస్ పెర్రీ గాయంతో దూరం కావడం ఆసీస్‌కు పెద్ద దెబ్బ. అయితే కెప్టెన్ లానింగ్, బెత్ మూనీ, అలీసా హీలీలతో జట్టు బ్యాటింగ్ పటిష్టంగా ఉంది. బౌలింగ్‌లో ఆ జట్టు ప్రధానంగా జెస్ జొనాసన్, మెగాన్ షూట్‌లపై ఆధారపడుతోంది.

భారత జట్టుకు మరోసారి సంచలన ఓపెనర్ షఫాలీ వర్మ ఇచ్చే ఆరంభం కీలకం కానుంది. ఆమె తనదైన శైలిలో చెలరేగితే ప్రత్యర్థి బౌలర్లకు ఇబ్బందులు తప్పవు. షఫాలీని నిలువరించేందుకు ఆసీస్ అన్ని ప్రయత్నాలు చేయడం ఖాయం. అయితే మిగతా బ్యాటర్ల ప్రదర్శన అంత గొప్పగా లేకపోవడం ఆందోళన కలిగించే అంశం. తుది పోరులోనైనా తమ స్థాయికి తగినట్లు కెప్టెన్ హర్మన్, స్మృతి, జెమీమా చెలరేగాల్సి ఉంది. లేదంటే గెలుపు ఆశలు నెరవేరడం కష్టం. బౌలింగ్‌లో మరోసారి భారత్ స్పిన్‌నే నమ్ముకుంది. తమ స్పిన్నర్లు ఈ టోర్నీలో కెప్టెన్ హర్మన్ ఉపయోగించిన తీరు ప్రశంసనీయం. ముఖ్యంగా పూనమ్ యాదవ్ తొలి మ్యాచ్‌లో ఆసీస్‌కు భారీ షాక్ ఇచ్చింది. కాబట్టి ఈసారి ఆమె కోసం వారు మరింత మెరుగ్గా సిద్ధమై రావడం ఖాయం. ఇతర స్పిన్నర్లు కూడా ఒత్తిడి పెంచగలిగితే ప్రత్యర్థిని నిలువరించవచ్చు.

### వర్షం లేదు!

సెమీస్‌లో పోలిస్తే సంతోషకర విషయం ఆదివారం మెల్‌బోర్న్‌లో ఎలాంటి వర్ష సూచన లేదు. మ్యాచ్‌కు ఏ సమయంలోనా ఇబ్బంది ఉండకపోవచ్చు. అనూహ్యంగా వర్షం పడినా ఫైనల్‌కు రిజర్వ్ డే ఉంది. పిచ్ కూడా సాధారణ బ్యాటింగ్ వికెట్. మంచి స్కోరింగ్‌కు అవకాశం ఉంది. వరల్డ్ కప్ ఫైనల్ ఒత్తిడి ఉంటుంది కాబట్టి టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకోవడం ఖాయం.

**టోర్నీలో భారత్ టాప్-3 బ్యాటర్లు**

1. షఫాలీ వర్మ (161 పరుగులు)
2. జెమీమా (85)
3. దీప్తి శర్మ (84)

**టాప్-3 బౌలర్లు**

1. పూనమ్ యాదవ్ (9 వికెట్లు)
2. శిఖా పాండే (7)
3. రాధా యాదవ్, రాజేశ్వరి (5)

**టోర్నీలో ఆస్ట్రేలియా టాప్-3 బ్యాటర్లు**

1. మూనీ (181 పరుగులు)
2. హీలీ (161)
3. లానింగ్ (116)

**టాప్-3 బౌలర్లు**

1. షూట్ (9 వికెట్లు)
2. జొనాసన్ (7)
3. వేర్‌హామ్, క్యారీ (3)

### ఫైనల్ చేరారిలా

**(భారత్) లీగ్ దశలో...**

- ఆస్ట్రేలియాపై 17 పరుగులతో విజయం
- బంగ్లాదేశ్‌పై 18 పరుగులతో గెలుపు
- న్యూజిలాండ్‌పై 3 పరుగులతో విజయం
- శ్రీలంకపై ఏడు వికెట్లతో గెలుపు

**సెమీఫైనల్...**

- ఇంగ్లండ్‌తో జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. లీగ్ దశలో ఎక్కువ పాయింట్లు సాధించినందుకు భారత్ ఫైనల్ చేరింది.

**(ఆస్ట్రేలియా) లీగ్ దశలో...**

- భారత్ చేతిలో 17 పరుగులతో ఓటమి
- శ్రీలంకపై 5 వికెట్లతో గెలుపు
- బంగ్లాదేశ్‌పై 86 పరుగులతో విజయం
- న్యూజిలాండ్‌పై 4 పరుగులతో గెలుపు

**సెమీఫైనల్...**

దక్షిణాఫ్రికాపై 5 పరుగులతో విజయం

# మన క్రికెట్ మహిళా సైన్యం...

*భారత మహిళలు గర్జించే రోజు వచ్చేసింది. కంగారూ జట్టును కంగారెత్తించి తొలిసారి విశ్వకిరీటం సొంతం చేసుకునేందుకు భారత బృందం విజయం దూరంలో ఉంది. లీగ్ దశ నుంచి అజేయంగా దూసుకుపోతున్న 15 మంది సభ్యుల భారత్ బృందంలో 9 మంది భారత్ ఆడిన 4 మ్యాచ్‌లలోనూ బరిలోకి దిగారు. స్మృతి మంధాన అనారోగ్యం కారణంగా 3 మ్యాచ్‌లకే పరిమితమవగా, ఆమె స్థానంలో రిచా ఘోష్ ఆడింది. హైదరాబాద్ పేసర్ అరుంధతి రెడ్డి 2 మ్యాచ్‌లు ఆడిన తర్వాత ఆమె స్థానంలో స్పిన్నర్ రాధా యాదవ్‌కు మరో 2 మ్యాచ్‌లలో అవకాశం కల్పించారు. ఇద్దరు ప్లేయర్లు హర్లీన్ డియోల్, పూజ వస్త్రకర్‌లకు మాత్రం మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు. జగజ్జేతగా నిలిచేందుకు గెలుపు దూరంలో ఉన్న భారత బృందానికి సంబంధించిన క్లుప్త సమాచారం...*

### హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్, బ్యాటర్)



**వయసు:** 31 ఏళ్లు **స్వస్థలం:** మోగా (పంజాబ్)
**అనుభవం:** 113 టి20లు (2009లో అరంగేట్రం)
**విశేషాలు:** 2016 నుంచి జట్టు సారథిగా ఉంది. గత టి20 ప్రపంచ కప్ టోర్నీలో సెమీస్ వెళ్లినప్పుడు కూడా కెప్టెన్‌గా వ్యవహరించింది.

### స్మృతి మంధాన (బ్యాటర్)

**వయసు:** 23 ఏళ్లు **స్వస్థలం:** సాంగ్లి (మహారాష్ట్ర)
**అనుభవం:** 74 టి20లు (2013లో అరంగేట్రం)



**విశేషాలు:** జట్టులో టాప్ బ్యాటర్. ఎన్నో చిరస్మరణీయ ఇన్నింగ్స్‌లు ఆడింది. బిగ్‌బాష్ లీగ్‌లో ఆడిన అనుభవముంది.

### షఫాలీ వర్మ (బ్యాటర్)

**వయసు:** 16 ఏళ్లు **స్వస్థలం:** రోహ్‌టక్ (హరియాణా)
**అనుభవం:** 18 టి20లు (2019లో అరంగేట్రం)



**విశేషాలు:** సంచలన ప్రదర్శనతో ఐసీసీ నంబర్‌వన్ ర్యాంక్. ఈ టోర్నీలో భారత టాప్ స్కోరర్.

### జెమీమా రోడ్రిగ్స్ (బ్యాటర్)

**వయసు:** 19 ఏళ్లు **స్వస్థలం:** ముంబై
**అనుభవం:** 43 టి20లు (2018లో అరంగేట్రం)



**విశేషాలు:** జట్టులో ప్రధాన బ్యాటర్. దేశవాళీ వన్డేల్లో డబుల్ సెంచరీ చేసిన ఘనత. గత ప్రపంచకప్‌లో స్టాండవుట్ ప్లేయర్‌గా ఎంపిక.

### దీప్తి శర్మ (ఆల్‌రౌండర్)

**వయసు:** 22 ఏళ్లు **స్వస్థలం:** ఆగ్రా (ఉత్తరప్రదేశ్)
**అనుభవం:** 47 టి20లు (2014లో అరంగేట్రం)



**విశేషాలు:** వన్డేల్లో ప్రపంచ రికార్డు పార్ట్‌నర్‌షిప్‌లో భాగస్వామి. వన్డేల్లో మూడో అత్యధిక వ్యక్తిగత స్కోరు (188) సాధించిన ఘనత.

### తానియా భాటియా (వికెట్‌కీపర్)

**వయసు:** 22 ఏళ్లు **స్వస్థలం:** చండీగఢ్
**అనుభవం:** 49 టి20లు (2018లో అరంగేట్రం)



**విశేషాలు:** 13 ఏళ్లకే పంజాబ్ సీనియర్ టీమ్‌లో ఆడింది. కీపింగ్ నైపుణ్యంతో జట్టులో రెగ్యులర్ సభ్యురాలు.

### వేద కృష్ణమూర్తి (బ్యాటర్)

**వయసు:** 27 ఏళ్లు **స్వస్థలం:** చిక్‌మగళూరు (కర్ణాటక)
**అనుభవం:** 75 టి20లు (2011లో అరంగేట్రం)



**విశేషాలు:** దూకుడుగా ఆడగల సమర్థురాలు. మంచి డ్యాన్సర్‌గా గుర్తింపు. కరాటేలో బ్లాక్‌బెల్ట్ కూడా.

### శిఖా పాండే (పేస్ బౌలర్)

**వయసు:** 31 ఏళ్లు **స్వస్థలం:** గోవా
**అనుభవం:** 49 టి20లు (2014లో అరంగేట్రం)



**విశేషాలు:** ఈ ప్రపంచకప్‌లో ఓపెనింగ్ బౌలర్‌గా కీలక పాత్ర పోషించింది. ఎయిర్‌ఫోర్స్‌లో ఫ్లయిట్ లెఫ్టినెంట్‌గా పని చేస్తోంది.

### రాధ యాదవ్ (లెఫ్టార్మ్ స్పిన్నర్)

**వయసు:** 20 ఏళ్లు **స్వస్థలం:** ముంబై
**అనుభవం:** 34 టి20లు (2018లో అరంగేట్రం)



**విశేషాలు:** నిలకడగా వికెట్లు తీసే బౌలర్. కూరగాయలు అమ్మే తండ్రి ప్రోత్సాహంతో క్రికెటర్‌గా ఎదిగిన తీరు స్ఫూర్తిదాయకం.

### పూనమ్ యాదవ్ (లెగ్‌స్పిన్నర్)

**వయసు:** 28 ఏళ్లు **స్వస్థలం:** ఆగ్రా (ఉత్తర ప్రదేశ్)
**అనుభవం:** 66 టి20లు (2013లో అరంగేట్రం)



**విశేషాలు:** ఈ ఏడాది బీసీసీఐ అత్యుత్తమ క్రికెటర్‌గా ఎంపిక. గుగ్లీలతో ప్రత్యర్థులను బోల్తా కొట్టించే నైపుణ్యం సొంతం.

### రాజేశ్వరి గైక్వాడ్ (లెఫ్టార్మ్ స్పిన్నర్)

**వయసు:** 28 ఏళ్లు **స్వస్థలం:** బిజాపూర్, కర్ణాటక
**అనుభవం:** 27 టి20లు (2014లో అరంగేట్రం)



**విశేషాలు:** నాలుగు మ్యాచుల్లోనూ రాణించింది. భారత్ తరపున వన్డే వరల్డ్ కప్‌లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన రికార్డు.

### అరుంధతి రెడ్డి (పేసర్)

**వయసు:** 22 ఏళ్లు **స్వస్థలం:** హైదరాబాద్
**అనుభవం:** 20 టి20లు (2018లో అరంగేట్రం)



**విశేషాలు:** తెలుగు రాష్ట్రాలనుంచి భారత జట్టులో ఉన్న ఏకైక ప్లేయర్. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో రాణించింది.

### రిచా ఘోష్ (బ్యాటర్)

**వయసు:** 16 ఏళ్లు **స్వస్థలం:** సిలిగురి (పశ్చిమ బెంగాల్)
**అనుభవం:** 2 టి20లు (ముక్కోణపు టోర్నీలో అరంగేట్రం చేసి, ప్రపంచకప్‌లో ఒకే మ్యాచ్ ఆడింది)



**విశేషాలు:** దూకుడుగా ఆడగల మరో టీనేజర్.

### హర్లీన్ డియోల్ (ఆల్‌రౌండర్)

**వయసు:** 21 ఏళ్లు **స్వస్థలం:** చండీగఢ్
**అనుభవం:** 6 టి20లు (2019లో అరంగేట్రం)



**విశేషాలు:** దూకుడులో జూనియర్ హర్మన్‌గా గుర్తింపు ఉంది. దేశవాళీలో హిమాచల్‌కు ఆడుతుంది. వరల్డ్‌కప్‌లో మ్యాచ్ దక్కలేదు

### పూజ వస్త్రకర్ (పేసర్)

**వయసు:** 20 ఏళ్లు **స్వస్థలం:** షహ్‌దోల్ (మధ్య ప్రదేశ్)
**అనుభవం:** 20 టి20లు (2018లో అరంగేట్రం)



**విశేషాలు:** పేసర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నా... వరుస గాయాలతో కెరీర్ నిలకడగా సాగలేదు. గత ప్రపంచకప్ ఆడింది.

## భారత మహిళల టెన్నిస్ జట్టు కొత్త చరిత్ర

**తొలిసారి ఫెడ్ కప్ ప్లే ఆఫ్స్‌కు అర్హత**

**దుబాయ్:** టెన్నిస్ అభిమానులకు భారత మహిళల జట్టు తీపి కబురు అందించింది. ఫెడ్ కప్ మహిళల టీమ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో తొలిసారి భారత జట్టు వరల్డ్ గ్రూప్ ప్లే ఆఫ్ దశకు అర్హత సాధించింది. శనివారం ముగిసిన ఆసియా ఓసియానియా గ్రూప్-1 టోర్నీలో భారత జట్టు రెండో స్థానంలో నిలిచి ఈ ఘనత సాధించింది. చైనా టాప్ ర్యాంక్‌లో నిలిచి భారత్‌తో కలిసి ప్లే ఆఫ్ దశకు బెర్త్ దక్కించుకుంది. శనివారం ఇండోనేసియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 2–1తో గెలిచింది. తొలి మ్యాచ్‌లో రుతుజా 3–6, 6–0, 3–6తో ప్రిస్కా చేతిలో ఓడిపోయింది. రెండో మ్యాచ్‌లో అంకిత రైనా 6–3, 6–3తో అల్దీలా సుత్‌జియాదిపై నెగ్గి స్కోరును 1–1తో సమం చేసింది. నిర్ణాయక డబుల్స్ మ్యాచ్‌లో సానియా మీర్జా-అంకిత రైనా ద్వయం 7–6 (7/4), 6–0తో సుత్‌జియాది-నుగ్రోహో జంటను ఓడించి భారత్ విజయాన్ని ఖాయం చేసింది. ఆరు జట్లు రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో తలపడిన ఈ టోర్నీలో సానియా, రుతుజా, అంకిత, రియా భాటియా, సౌజన్య భవిశెట్టిలతో కూడిన భారత జట్టు నాలుగు మ్యాచ్‌ల్లో గెలిచింది. ఏప్రిల్‌లో జరిగే ప్లే ఆఫ్‌లో లాత్వియా లేదా నెదర్లాండ్స్ జట్టుతో భారత్ ఆడుతుంది.



అంకిత, సానియా

## క్వార్టర్స్‌లో మేరీకోమ్



**అమ్మాన్ (జోర్డాన్):** టోక్యో ఒలింపిక్స్ ఆసియా బాక్సింగ్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో భారత అగ్రశ్రేణి బాక్సర్లు మేరీకోమ్ (51 కేజీలు), అమిత్ పంఘాల్ (52 కేజీలు) క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. శనివారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్ బౌట్స్‌లో మేరీకోమ్ 5–0తో టాస్మీన్ బెన్నీ (న్యూజిలాండ్)ను చిత్తుగా ఓడించగా... అమిత్ 3–2తో ఎన్క్‌మనాదక్ ఖర్కు (మంగోలియా)పై కష్టపడి గెలిచాడు. మరో ప్రిక్వార్టర్ ఫైనల్ బౌట్‌లో భారత బాక్సర్ గౌరవ్ సోలంకి (57 కేజీలు) 1–4తో టాప్ సీడ్ మిరాజిజ్‌బెక్ మిర్జాఖలీలోవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో ఓడిపోయాడు.

## కోవిడ్‌పై ప్రజలను చైతన్య పరుస్తున్న చోటా భీమ్




**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ యానిమేషన్ కంపెనీ గ్రీన్ గోల్డ్ యానిమేషన్ కోవిడ్ వైరస్‌పై తనదైన శైలిలో ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాన్ని చేపట్టింది. కోవిడ్ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆ వైరస్‌కు సంబంధించిన ప్రాథమిక సమాచారంతో చోటా భీమ్ క్యారెక్టర్ ద్వారా రూపొందించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. ఈ వీడియోను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్.. ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు అత్యంత ఇష్టపడే చోటా భీమ్ క్యారెక్టర్ ద్వారా కోవిడ్ లాంటి కీలకమైన, అత్యంత ఆవశ్యకమైన అంశంపై ప్రజలను చైతన్యపరిచేందుకు ముందుకు వచ్చిన గ్రీన్ గోల్డ్ యానిమేషన్ సంస్థను మంత్రి కేటీఆర్ అభినందించారు. చోటా భీమ్ క్యారెక్టర్ ద్వారా చేపట్టిన ప్రచారం ముఖ్యంగా బడిపిల్లల్లో విస్తృత అవగాహన పెంపొందిస్తుందని గ్రీన్ గోల్డ్ సంస్థ ఆశాభావం వ్యక్తం చేసింది.

## కాళోజీ వర్సిటీకి కొత్త ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్

**సాక్షి, హైదరాబాద్:** కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ వి.శాంతారామ్ (మాజీ డీన్, నిమ్స్), డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి (ఏఐజీ), డాక్టర్ విమలా థామస్ (ఎస్‌పీఎం, గాంధీ మెడికల్ కాలేజీ), డాక్టర్ పి.ధైర్యావన్ (మాజీ సూపరింటెండెంట్, గాంధీ మెడికల్ కాలేజీ), డాక్టర్ కె.ఇందిర (నిజామాబాద్ మెడికల్ కాలేజీ), డాక్టర్ జె.వెంకటేశ్వర్లు (ప్రొఫెసర్, కాకతీయ మెడికల్ కాలేజీ), డాక్టర్ ఎం.రమణి (డీన్, మల్లారెడ్డి మెడికల్ కాలేజీ)ని నియమిస్తున్నట్లు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ.శాంతకుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

## జలమండలిలో మేనేజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లయ్ అండ్ సీవరేజ్ బోర్డ్ ఆఫ్ ఇంజనీరింగ్ సర్వీస్‌లో (జలమండలి) 93 మేనేజర్ పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ శనివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 16 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనుంది. సివిల్ ఇంజనీరింగ్‌లో 79, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 6, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో 4, కంప్యూటర్ సైన్స్, ఐటీ విభాగంలో 1, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో 3 పోస్టులు ఉన్నట్లు నోటిఫికేషన్‌లో తెలిపింది. పూర్తి వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించింది.

## వెబ్‌సైట్‌లో సెక్షన్ ఆఫీసర్ అభ్యర్థుల జాబితా

**సాక్షి, హైదరాబాద్:** సెక్రటేరియట్‌లోని ఫైనాన్స్, లా విభాగాల్లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితా తమ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు టీఎస్‌పీఎస్సీ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. అర్హులైన అభ్యర్థులకు ఈ నెల 7న ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఇంటర్వ్యూ మార్కులు, వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్ సందర్శించాలని సూచించింది.

## 12 నుంచి రీలింక్విష్‌మెంట్‌కు అవకాశం

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ గ్రేడ్–2, అసిస్టెంట్ స్టోర్స్ ఆఫీసర్ గ్రేడ్–2, డేటా ప్రాసెసింగ్ అసిస్టెంట్ గ్రేడ్–2 పోస్టులకు సంబంధించి అర్హులైన అభ్యర్థులకు ఈ నెల 12 నుంచి 14 వరకు రీలింక్విష్‌మెంట్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. పూర్తి వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించింది.

## మీరు అన్ని రంగాల్లో పురోగమించాలి

### మహిళలకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం వైఎస్ జగన్

**సాక్షి, అమరావతి:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలుగు రాష్ట్రాల మహిళలకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన చేస్తూ.. ప్రతి మహిళా అన్ని రంగాల్లో సమానత్వం సాధించాలని అభిలషించారు. అన్ని రంగాల్లోనూ మహిళలు పురోగమించాలన్నారు.



**ఏపీఐఐసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆర్కే రోజా అద్భుతమైన నాట్యంతో అహూతులను ఆకట్టుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఆమె ఇచ్చిన ‘నవ జనార్దన పారిజాతం’ నృత్యప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.**

## ఇంటర్ ఇంగ్లిష్–2 పేపర్‌లో తప్పులు

- ఆందోళనకు గురైన విద్యార్థులు
- ఆ తర్వాత మార్పులపై సమాచారం ఇచ్చిన బోర్డు
- అయినా తప్పని గందరగోళం

**సాక్షి, హైదరాబాద్:** ఇంటర్మీడియెట్ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన ద్వితీయ సంవత్సర ఇంగ్లిష్ పరీక్ష ప్రశ్నపత్రంలో తప్పులు దొర్లాయి. మొత్తం 6 ప్రశ్నల్లో తప్పులు దొర్లినట్లు విద్యార్థులు గుర్తించారు. వాటివల్ల పరీక్ష కేంద్రాల్లో అనేక మంది విద్యార్థులు గందరగోళానికి గురి కావాల్సి వచ్చిందని వాపోయారు. 5, 7, 10, 12, 14, 17 నంబరు ప్రశ్నల్లో తప్పులు దొర్లాయని, దీంతో 15 మార్కుల వరకు కోల్పోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిలో 14వ ప్రశ్నను అసంపూర్తిగా ఇవ్వగా.. మిగతా ప్రశ్నల్లోనూ అనేక తప్పులు దొర్లాయి. ప్రశ్నపత్రం ప్రింట్ చేసిన తరువాత ప్రూఫ్ రీడింగ్ చేయకపోవడం, తప్పులను సరిదిద్దడంలో నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరిగిందని లెక్చరర్లు పేర్కొంటున్నారు. అయితే ఈ తప్పులకు బాధ్యత బోర్డుదే అయినందున విద్యార్థులు నష్టపోకుండా మార్కులు కలపాలని ప్రైవేట్ జూనియర్ కాలేజీల యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు గౌరి సతీష్ డిమాండ్ చేశారు.

### ఆ ప్రశ్న అటెంప్ట్ చేస్తే మార్కులిస్తాం: బోర్డు కార్యదర్శి

ప్రశ్నపత్రంలో దొర్లిన తప్పులపై ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్ స్పందించారు. 14వ ప్రశ్న అసంపూర్తిగా ఉన్నందున ఆ ప్రశ్నను అటెంప్ట్ చేసిన విద్యార్థులకు 4 మార్కులు ఇస్తామని వెల్లడించారు. అచ్చు తప్పుల విషయంలో ఉదయం 9:45 గంటలకే అన్ని పరీక్ష కేంద్రాలకు సమాచారం ఇచ్చి సరి చేయించామన్నారు. తప్పులతో ప్రశ్నపత్రాలను రూపొందించిన వారిపై చర్యలు చేపడతామన్నారు.

### ఇవీ ప్రశ్నపత్రంలో దొర్లిన తప్పులు..

- 14వ ప్రశ్నలో ఎస్‌బీఐ సేవింగ్స్ అకౌంట్ ఫారం ఇచ్చారు. అందులో అకౌంట్ నంబరు, పేరు, అమౌంట్ ఇచ్చారు. అయితే అందులో డేట్, బ్రాంచి వివరాలు, మొబైల్ నంబరు ఆప్షన్, సంతకం లేకుండా అసంపూర్ణంగా ప్రశ్నను ఇచ్చారు. ఆ తరువాత బోర్డు నుంచి వచ్చిన సమాచారం మేరకు ఇన్విజిలేటర్లు అది కోఠి బ్రాంచ్ అని చెప్పారు. దీంతో విద్యార్థులు మరింత గందరగోళానికి గురయ్యారు. ఇది 4 మార్కుల ప్రశ్న కాగా, జవాబులు రాయాల్సిన ఖాళీలు 10 ఇచ్చారు. కానీ ప్రశ్నకు పక్కన మాత్రం 8 రాయాలని, ఒక్కో ఖాళీ నింపితే అర మార్కు చొప్పున ఇస్తామని ఉంది.
- ఇక 4 మార్కులు కలిగిన 5వ ప్రశ్నకు why అని ఉండాల్సిన చోట what అని వచ్చింది.
- 4 మార్కులు కలిగిన 17వ ప్రశ్నలో felicitation కి బదులుగా felicilation అని తప్పుగా పడింది.
- 7వ ప్రశ్న రెండో పేరాలో discipline అని ఇవ్వడానికి బదులుగా disipline అని ఇచ్చారు. అదే తప్పు రిపీటైంది.
- 10వ ప్రశ్నలో a book అనే పదం ఉండాల్సి ఉండగా.. అది లేకుండానే ఇచ్చారు.
- ఒక మార్కు కలిగిన 12వ ప్రశ్నలో turn a deaf ear అని ముద్రించాల్సి ఉండగా.. turn a deaf year అని ముద్రించారు.

## ఏబీవీని విచారించండి

- ఏపీ ప్రభుత్వానికి సూచించిన కేంద్ర హోం శాఖ
- ఏసీబీ దర్యాప్తునకు గ్రీన్ సిగ్నల్
- 7వ తేదీలోగా చార్జిషీటు

**సాక్షి, అమరావతి:** ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ అదనపు డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావుపై ఆ రాష్ట్ర ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను ఖరారు చేస్తూ తదుపరి విచారణను చేపట్టాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏబీపై క్రమశిక్షణ చర్యలను తీసుకోవడమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వం ఏసీబీ దర్యాప్తును చేపట్టేందుకు కేంద్ర హోం శాఖ అనుమతించింది. ఈ మేరకు శనివారం కేంద్ర హోంశాఖ కార్యదర్శి రాజీవ్ కుమార్ నిగమ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్నికి లేఖ రాశారు. పోలీసు విభాగం ఆధునికీకరణ నిధులు దుర్వినియోగం, ఏరోసాట్, యూఏవీల కొనుగోళ్ల కోసం వెంకటేశ్వరావు వెచ్చించిన రూ.25.5 కోట్ల వ్యవహారంలో భారీ అక్రమాలు, అవకతవకలు జరిగాయని ప్రాథమికంగా నిర్ధారణ అయినట్లు కేంద్ర హోంశాఖ ఆ లేఖలో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో వెంకటేశ్వరరావుపై వచ్చే నెల 7వ తేదీలోగా చార్జిషీటు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది.

### ఏసీబీ విచారణ జరిపించండి..

- ఏబీ వెంకటేశ్వరరావు ప్రతిపక్ష నేతలపై నిఘా కోసం ఫోన్ ట్యాపింగ్ పరికరాలు, డ్రోన్లు కొనుగోలు చేయడంలో చేతివాటం చూపినట్లు గతంలో ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే.
- ఆ ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేయించింది.
- వెంకటేశ్వరరావు దేశ భద్రతకు సంబంధించిన పలు కీలక విషయాలను బహిర్గతం చేసినట్లు తేలింది.
- పోలీస్ ఇంటెలిజెన్స్ ప్రొటోకాల్స్ విధానాలను ఉద్దేశ పూర్వకంగా ఉల్లంఘించినట్లు ప్రభుత్వం గుర్తించింది. ఇది జాతీయ భద్రతకు ప్రత్యక్ష ముప్పుగా భావిస్తున్నారు. ఇంటెలిజెన్స్ ప్రొటోకాల్, ఇండియన్ ప్రొటోకాల్ ఒకే విధమైన ప్రామాణికాలను కలిగి ఉంటాయి. దర్యాప్తులో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి.
- ప్రవర్తనా నియమాల ఉల్లంఘనకు సంబంధించి ఆయన్ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్నీ ఈ ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. ఆల్ ఇండియా సర్వీసెస్ (క్రమశిక్షణ, అప్పీల్) నిబంధనల నియమం 3 (1) కింద ఆయన్ను సస్పెండ్ చేసినట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు.
- ప్రభుత్వ అనుమతి లేకుండా ఆయన హెడ్ క్వార్టర్ దాటి వెళ్లేందుకు వీల్లేదని ఆదేశాల్లో స్పష్టం చేశారు.
- ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 19వ తేదీన వెంకటేశ్వరరావు అక్రమాలపై సమగ్ర నివేదికను కేంద్ర హోం శాఖకు పంపించింది.
- ఈ నివేదికను పరిశీలించిన కేంద్ర హోం శాఖ.. అవకతవకలు జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయినందున వెంకటేశ్వరరావుపై ఏసీబీ ద్వారా సవివరమైన విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. అందుకు సంబంధించిన నివేదిక సమర్పిస్తే తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేసింది.




## చుక్‌బుక్ రైలే... నడిపిందీ మహిళలే..!

### సికింద్రాబాద్ - వికారాబాద్ మధ్య పూర్తిగా మహిళా సిబ్బందితో నడిచిన ప్యాసింజర్ రైలు

**సాక్షి, హైదరాబాద్:** సికింద్రాబాద్ స్టేషన్.. ఉదయం 7.45.. వికారాబాద్‌కు వెళ్లే ప్యాసింజర్ రైలు బయలు దేరింది. క్యాబిన్‌లో లోకోపైలట్ సీటులో ఓ మహిళ, సహాయంగా అసిస్టెంట్ లోకోపైలట్‌గా మరో మహిళ రైలును పరుగులు పెట్టిస్తున్నారు. ఇంతలో బోగీల్లోకి టికెట్లు చెక్ చేసేందుకు ముగ్గురు టీటీఈలు వచ్చారు. వారంతా మహిళలే, రక్షణగా ఉన్న పోలీసు సిబ్బంది గస్తీకోసం బోగీల్లోకి వచ్చారు వారూ మహిళా సిబ్బందే. చివరలో ఉండే గార్డు క్యాబిన్‌లో విధులు నిర్వహించిందీ స్త్రీమూర్తే. రైలును నడపటం క్లిష్టమైన ప్రక్రియే అయినా అత్యంత సులభంగా వారంతా నడిపి చూపించారు.



మహిళా సాధికారత, లింగసమానత్వం చాటడానికి భారతీయ రైల్వే ఈనెల 1 నుంచి 10 వరకు ‘ఈచ్ ఫర్ ఈక్వల్’ నినాదంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా దక్షిణ మధ్య రైల్వే అధికారులు శనివారం సికింద్రాబాద్ నుంచి వికారాబాద్ వరకు ప్యాసింజర్ రైలును పూర్తిగా మహిళా ఉద్యోగులతో నడిపించారు. లోకోపైలట్ సరిత మేశ్రమ్, అసిస్టెంట్ లోకో పైలట్ మమత కుమారి, గార్డ్ వినీష, టీటీఈలు మంగ, కరిష్మ, పావన, ఎస్‌పీఎఫ్/ఆర్‌పీఎఫ్ నసీమా బేగం, నిరోషాలు విధుల్లో పాల్గొన్నారు. ఈ రైలును సికింద్రాబాద్ డివిజన్‌కు చెందిన మహిళా అధికారులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గజానన్ మాల్యా రైలు నడిపిన మహిళా ఉద్యోగులందరిని అభినందించారు. లింగబేధం లేకుండా వారందరికీ దక్షిణ మధ్య రైల్వే సమానావకాశాలు కల్పిస్తోందని స్పష్టం చేశారు. ఇలాంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టి మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా వ్యవహరిస్తామన్నారు. దక్షిణ మధ్య రైల్వే ‘మహిళా రైల్వే స్టేషన్లు’ ఏర్పాటు చేసి అందరూ మహిళలే పనిచేసే 5 రైల్వే స్టేషన్లను విజయవంతంగా నిర్వహిస్తోందని తెలిపారు. బేగంపేట్, విద్యానగర్, చంద్రగిరి, న్యూగుంటూర్, రామవరప్పాడు స్టేషన్లు వారి ఆధ్వర్యంలో విజయవంతంగా నడుస్తున్నాయన్నారు. మహిళలే రైలు నడపటం ఆనందంగా ఉందని ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేయగా, తాము ఎలాంటి ఇబ్బంది లేకుండా సాఫీగా రైలును నడిపి చూపించామని విధుల్లో పాల్గొన్న ఉద్యోగులు పేర్కొన్నారు. అటు వికారాబాద్ వరకు, తిరిగి సికింద్రాబాద్‌కు రైలును వారు నడిపారు. ఈ ప్రయోగం విజయవంతం కావటంతో భవిష్యత్తులో దీన్ని వీలును బట్టి కొనసాగించనున్నట్టు అధికారులు వెల్లడించారు.

## బీసీలకు భరోసా

- టీడీపీ కుయుక్తుల వల్ల 34 నుంచి 24 శాతానికి తగ్గిపోయిన రిజర్వేషన్లు
- ఆ మేరకు తగ్గిపోయిన 10 శాతం పార్టీ ద్వారా భర్తీ
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ సీఎం వైఎస్ జగన్ చరిత్రాత్మక నిర్ణయం
- బీసీలకు కనీసం 34 శాతం సీట్లు దక్కేలా జనరల్ స్థానాల్లోనూ టికెట్లు
- సర్పంచ్ మొదలు జెడ్పీ చైర్‌పర్సన్ వరకు బీసీలకు లబ్ధి కలిగేలా కార్యాచరణ

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో 10 శాతం రిజర్వేషన్లు నష్టపోవడం వల్ల బీసీలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగకూడదని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గట్టి నిర్ణయం తీసుకున్నారు. టీడీపీ కుయుక్తుల కారణంగా బీసీలు నష్టపోతున్న 10 శాతం రిజర్వేషన్లను పార్టీ పరంగా భర్తీ చేయాలని చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. బీసీలకు కనీసం 34 శాతం మేర సీట్లు దక్కేలా జనరల్ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులను నిలపాలని మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులకు ఆదేశాలు జారీ చేశారు. టీడీపీ కుయుక్తుల కారణంగా రిజర్వేషన్లు 59.85 శాతం నుంచి 50 శాతానికి తగ్గిన విషయం విదితమే. ఫలితంగా బీసీలు 9.85 శాతం రిజర్వేషన్లు కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో.. బీసీల రిజర్వేషన్లు 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గిపోయాయి. ఈ నేపథ్యంలో పార్టీ పరంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ మొదలు జెడ్పీ చైర్‌పర్సన్ స్థానం వరకు.. మున్సిపల్ వార్డు సభ్యుడి నుంచి కార్పొరేషన్ మేయర్ వరకు.. అన్ని స్థానాల్లోనూ బీసీలకు రిజర్వేషన్ పరంగా దక్కే సీట్ల కంటే.. కనీసం 10 శాతం అదనంగా పార్టీ టికెట్లు ఇచ్చి గెలిపించాలని ముఖ్యమంత్రి జగన్ సూచించారు. ఈ నిర్ణయాన్ని పార్టీ బీసీ విభాగం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్యే జోగి రమేష్, పార్టీ నాయకుడు దాడి వీరభద్రరావు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వేర్వేరుగా వెల్లడించారు.

### సాహసోపేత నిర్ణయం

- రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు 34 శాతం కంటే తగ్గకూడదనే ఉద్దేశంతో మొత్తం రిజర్వేషన్లు 59.85 శాతం ఉండాలని ముఖ్యమంత్రి జగన్ నిర్ణయించారు. ఈ మేరకు 2019 డిసెంబర్‌లో మంత్రివర్గం తీర్మానం చేసింది.
- అందుకు అనుగుణంగా హైకోర్టు అనుమతితో ఎన్నికల నిర్వహణకు సిద్ధమైంది. జనవరిలో సంక్రాంతి తర్వాత ఎన్నికల నోటిఫికేషన్‌కు ప్రభుత్వం సన్నద్ధమయింది.
- అదే సమయంలో టీడీపీ కుయుక్తులు మొదలుపెట్టింది. టీడీపీ నేత బిర్రు ప్రతాప్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై సుప్రీం కోర్టుకు వెళ్లారు. రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో తేల్చుకోవాలని, నెల రోజుల్లో విచారణ పూర్తి చేయాలని సుప్రీం కోర్టు సూచించింది. టీడీపీ నేత పిటీషన్ కారణంగా సుప్రీంకోర్టు నుంచి వచ్చిన సూచన మేరకు.. 59.85 శాతం రిజర్వేషన్ల మీద హైకోర్టు విచారణ చేపట్టింది.
- సుప్రీంకోర్టు తీర్పు మేరకు రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదంటూ ఈ నెల 2వ తేదీన హైకోర్టు తీర్పు వెలువరించింది. దీంతో 9.85 శాతం మేర బీసీలు రిజర్వేషన్లు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో అన్ని రాష్ట్రాలు ఒక్కొక్కటిగా తమ రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్లు తగ్గించుకుంటూ పోతున్నా, రాష్ట్రంలో మాత్రం ఆ మేర పార్టీ పరంగా టికెట్లు కేటాయించాలని వైఎస్ జగన్ సంచలన నిర్ణయం తీసుకున్నారు.

## నగారా మోగింది

### ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల

**సాక్షి, అమరావతి:** ఏపీలో మూడు రకాల స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. మూడు దశల్లో ఈ ఎన్నికలు జరుగుతాయని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ శనివారం ప్రకటించారు. తొలిదశలో జెడ్పీటీసీ, ఎంపీటీసీలన్నింటికీ ఒకే విడతలో ఈ నెల 21న.. రెండో దశలో 23న మున్సిపల్ ఎన్నికలు.. మూడో దశలో గ్రామ పంచాయతీ సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికలు 27, 29 తేదీల్లో రెండు విడతలుగా నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీల ఎన్నికల నోటిఫికేషన్ వెంటనే అమలులోకి వస్తుందని.. మున్సిపల్ ఎన్నికలకు 9న, గ్రామ పంచాయతీ ఎన్నికలకు రెండు విడతలుగా 15, 17 తేదీల్లో నోటిఫికేషన్‌ను వేర్వేరుగా విడుదల చేస్తామని రమేష్‌కుమార్ తెలిపారు. ఎన్నికల నియమావళి కూడా తక్షణమే అమలులోకి వస్తుందని అన్నారు.

### మున్సి‘పోల్స్’ 23న..

రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెలువరించిన షెడ్యూల్ ప్రకారం పట్టణ, నగర పాలక సంస్థలకు కూడా ఒకే విడతలో ఈ నెల 23న ఎన్నికలు జరుగుతాయి. ఇందుకు 11 నుంచి 13 వరకు నామినేషన్ల స్వీకరిస్తారు. 27న కౌంటింగ్ జరుగుతుంది. మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మన్, వైఎస్ చైర్మన్ ఎన్నిక ఎక్కడికక్కడ ఈ నెల 31న జరుగుతుంది.

### సర్పంచి ఎన్నికలు రెండు విడతల్లో..

ఇక తొలి విడతలో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచి, వార్డు సభ్యుల స్థానాలకు 17–19 తేదీల మధ్య నామినేషన్లు స్వీకరిస్తారు. రెండో విడతలో జరిగే వాటికి 19–21 తేదీల మధ్య నామినేషన్లు స్వీకరిస్తారు. ఇటీవల పలు పంచాయతీలను మున్సిపాలిటీలలో విలీనం అనంతరం రాష్ట్రంలో దాదాపు 13,377 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. తొలి దశలో ఏ గ్రామాలకు, రెండో దశలో ఏ గ్రామాలకు ఎన్నికలు నిర్వహించాలన్న దానిపై పూర్తి అధికారాలు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆయా జిల్లా కలెక్టర్లకే అప్పగించింది. అయితే, ఒక మండలంలో గ్రామ పంచాయతీలన్నింటికీ ఒకే దశలో ఎన్నికల జరపాలని, సమస్యాత్మక గ్రామ పంచాయతీలకు రెండో దశలో ఎన్నికలు జరుపుకోవాలని కమిషన్ సూచించింది. కాగా, దాదాపు 140కి పైగా గ్రామాల్లో వివిధ కారణాలతో ఎన్నికలను నిలిపివేస్తున్నట్టు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేష్‌కుమార్ వెల్లడించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అనంతరం అదే రోజు మ.2 గంటల నుంచి కౌంటింగ్ చేపడతారు.

### పరోక్ష పద్ధతిలో..

- గెలుపొందిన ఎంపీటీసీలు ఈనెల 30న మండలాల వారీగా ఎక్కడికక్కడ మండల పరిషత్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కోఆప్షన్ సభ్యులను పరోక్ష పద్ధతిలో ఎన్నుకుంటారు. అలాగే, జిల్లాల వారీగా ఎన్నికైన జెడ్పీటీసీలు జిల్లా పరిషత్ చైర్మన్, వైస్‌చైర్మన్‌ను కూడా అదేరోజు ఇదే పద్ధతిలో ఎన్నుకుంటారు.
- మున్సిపల్ ఎన్నికల్లో ఎన్నికైన కౌన్సిలర్లు కూడా పరోక్ష పద్ధతిలోనే మేయర్, డిప్యూటీ మేయర్.. చైర్మన్, వైస్‌చైర్మన్లను ఈనెల 31న ఎన్నుకుంటారు.

### ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు రేపటి నుంచే నామినేషన్లు

ఈ నెల 9 నుంచి 11 వరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది.

- ఎంపీటీసీ స్థానాలకు సంబంధిత మండల పరిషత్ కార్యాలయంలో.. జెడ్పీటీసీ స్థానాలకు జిల్లా పరిషత్ సీఈఓ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తారు.
- రాష్ట్రంలో ఉన్న మొత్తం 660 జెడ్పీటీసీ స్థానాలకు.. అలాగే, 10,047 ఎంపీటీసీ స్థానాలుండగా వీటిలో 9,984కు ఒకే విడతలో ఈనెల 21వ తేదీ ఉ.7గంటల నుంచి సా.5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది.
- తూర్పు గోదావరి జిల్లా ఏటిపాక ఎంపీపీ పదవీకాలం 2021 జూన్ 28 వరకు ఉండడంతో అక్కడ ఎంపీటీసీ, ఎంపీపీ ఎన్నికలు జరగడంలేదు.
- దీనితో కలిపి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 68 ఎంపీటీసీ స్థానాల్లో వివిధ కారణాల రీత్యా ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల కమిషన్ తాత్కాలికంగా నిలుపుదల చేసింది.
- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్ 24న జరుగుతుంది.
- ఎంపీటీసీలకు పోటీచేసే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.1,500, జనరల్ అభ్యర్థులు రూ.3వేలు.. అదే జెడ్పీటీసీలకు పోటీచేసే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.3వేలు, జనరల్ అభ్యర్థులు రూ.6వేలు డిపాజిట్ కింద చెల్లించాల్సి ఉంటుంది.
- అలాగే, జెడ్పీటీసీగా పోటీచేసే అభ్యర్థి గరిష్ట వ్యయ పరిమితి రూ.4లక్షలు కాగా.. ఎంపీటీసీ అభ్యర్థిది రూ.2లక్షలు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com